Dwaraka

శుక్రవారం
12•1•2018
హైదరాబాద్
• వెల.5 రూ.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

• సంపుటి 7 • సంచిక 216
• పేజీలు : 16 + (24/20/16)

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

తెలంగాణ ఓ గురుకులం

కేజీ టు పీజీ ఉచిత విద్యకు పటిష్ఠ పునాదులు



517
రెండున్నరేండ్లలో కొత్తగా ఏర్పాటు చేసినవి..

2,00,297
కార్పొరేట్ స్థాయి విద్య పొందుతున్న విద్యార్థులు

1200
మూడేండ్లలో మొత్తం గురుకులాలు

7.6 లక్షలు
ఏడేండ్లలో ప్రయోజనం పొందే విద్యార్థులు

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

వరకవుల దుర్వాసరాజు, నమస్తే తెలంగాణ:

పక్కా భవనాలు.. విశాలమైన ప్రాంగణాలు.. నాణ్యమైన విద్య.. సాంస్కృతిక, క్రీడాంశాల్లో ప్రత్యేక శిక్షణ.. పౌష్టికాహారం.. ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ! ఇదేదో సంపన్నవర్గాల స్కూళ్ల సంగతి కాదు! విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా పీల్చి పిప్పిచేసే కార్పొరేట్ పాఠశాలలకు భిన్నంగా.. కార్పొరేట్ స్థాయి విద్యాబోధనను తలదన్నేలా ప్రభుత్వం నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలల ఘనత! చాలీచాలని అన్నం.. వానాకాలం చదువుల స్థానంలో సామాజిక బాధ్యతతో విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దుతున్న మహా సంకల్పం! కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వమే ఉచితంగా విద్యనందించాలనే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కలలు సాకారం అవుతున్న సందర్భం! రాష్ట్ర ఆవిర్భావానికి ముందు తెలంగాణలో 298 గురుకులాలుంటే.. రెండున్నరేండ్ల వ్యవధిలో వాటి సంఖ్యను 815కు పెంచి తన చిత్తశుద్ధిని చాటుకుంటున్నది తెలంగాణ ప్రభుత్వం. ఏటా కొత్త

మిగతా 11వ పేజీలో



ఉమ్మడి హైకోర్టు సీజేగా రాధాకృష్ణన్

సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు.. త్వరలోనే రాష్ట్రపతి ఆమోదముద్ర

మొత్తం ఐదు హైకోర్టులకు సీజేల ఎంపిక

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఇద్దరి పేర్లు ఖరారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ తోట్టత్తిల్ బీ రాధాకృష్ణన్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన పేరును హైకోర్టు ఆఫ్ జ్యుడికేచర్ ఎట్ హైదరాబాద్ (ఉమ్మడి హైకోర్టు) ప్రధాన న్యాయమూర్తి పదవికి సిఫారసు చేస్తూ బుధవారం సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖకు వర్తమానం పంపింది. త్వరలోనే ఉమ్మడి హైకోర్టు సీజేగా జస్టిస్ టీబీ రాధాకృష్ణన్ నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. ప్రస్తుతం జస్టిస్ రాధాకృష్ణన్ ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఉమ్మడి హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపడితే 2015 మే 7 తర్వాత ఉమ్మడి హైకోర్టు పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తి పదవి చేపట్టిన తొలివ్యక్తి అవుతారు. 2015 మే 7న అప్పటి ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కల్యాణ్‌జ్యోతిసేన్ గుప్తా పదవీ విరమణ అనంతరం 33 నెలలుగా పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిని

మిగతా 11వ పేజీలో

రాష్ట్రంలో రెరా ఏర్పాటు 11

• భారత టెకీలకు శుభవార్త

45% పెరుగనున్న అమెరికా గ్రీన్‌కార్డులు

ఏటా 55 వేలమందికి లబ్ధి
అమెరికా ప్రతినిధుల సభలో ప్రతిపాదన 5

• అక్రమాస్తులపై ఐటీ కొరడా

రూ.3600 కోట్ల బినామీ ఆస్తుల జప్తు

900కుపైగా బినామీ స్థిరచరాస్తుల స్వాధీనం
ఆదాయం పన్ను శాఖ వెల్లడి 13

ఐటీ కాంగ్రెస్‌కు ప్రధాని?

ప్రారంభ సమావేశానికి ఆహ్వానించిన నాస్కామ్

వచ్చే నెల 19 నుంచి ప్రతిష్ఠాత్మక సమావేశాలు.. ఏర్పాట్లు పూర్తిచేసిన ప్రభుత్వం

పలు కంపెనీలతో ఒప్పందాలు.. హైదరాబాద్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్!

వివరాలు వెల్లడించిన మంత్రి కేటీఆర్, నాస్కాం అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో వచ్చే నెలలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న వరల్డ్ ఐటీ కాంగ్రెస్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్రమోదీ హాజరయ్యే అవకాశాలున్నాయి. ఈ సదస్సు నిర్వహణలో కీలక భాగస్వామిగా వ్యవహరిస్తున్న నాస్కామ్ ఈ మేరకు ప్రధానిని ఆహ్వానించింది. ఫిబ్రవరి 19 నుంచి మూడురోజులపాటు నిర్వహించనున్న వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (డబ్ల్యూసీఐటీ) వివరాలను రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు, వరల్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ అలయెన్స్ చైర్మన్ యువాన్ చ్యూ, నాస్కాం

మిగతా 6వ పేజీలో



మీడియా సమావేశంలో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కే తారక రామారావు, డబ్ల్యూఐటీఎస్ఏ చైర్మన్ యువాన్ చ్యూ, ప్రధాన కార్యదర్శి జేమ్స్ పాయ్‌సంట్, నాస్కాం అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్ , ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్

Dwaraka

5 కోట్లతో కురవి ఆలయాభివృద్ధి

పనులకు నేడు మంత్రుల శంకుస్థాపన



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహబూబాబాద్ జిల్లా కురవి మండలకేంద్రంలోని వీరభద్రస్వామి ఆలయాన్ని రూ.5 కోట్లతో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు సంబంధించిన అభివృద్ధి పనులకు శుక్రవారం రాష్ట్ర మంత్రులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, తన్నీరు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారు. మహాశివరాత్రి సందర్భంగా 2017లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కురవి వీరభద్రస్వామిని దర్శించుకొని తెలంగాణ మొక్కులు చెల్లించుకున్నారు. వీరభద్రస్వామికి కోర మీసం సమర్పించారు. అదే సందర్భంలో ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు ప్రకటించారు. ఆ నిధులతో దేవాలయంలో 17 రకాల పనులను చేపట్టనున్నారు. రూ.75 లక్షలతో ఆలయ ప్రాకారం, రూ.48 లక్షలతో బంజారా సత్రం, మూడంతస్తుల్లో రాజగోపుర నిర్మాణం వంటి పనులు పూర్తిచేయనున్నారు.

కుంభమేళాస్థాయిలో మేడారం జాతర

- ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- అన్ని రాష్ట్రాల గిరిజన, సాంస్కృతిక పర్యాటక మంత్రులు, ఎంపీలకు ఆహ్వానం
- అధికారులకు సీఎస్ ఎస్పీసింగ్ ఆదేశం
- జాతర పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిగా వాకాటి కరుణ నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను కుంభమేళా స్థాయిలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్పీ సింగ్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క-సారలమ్మ జాతరకు దేశంలోని అన్ని రాష్ట్రాల గిరిజన, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రులను, సెక్రటరీలను, గిరిజన ఎంపీలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని చెప్పారు. జాతర ఏర్పాట్ల పర్యవేక్షణకు గతంలో వరంగల్ కలెక్టర్‌గా పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణను ప్రత్యేక అధికారిగా నియమిస్తున్నట్టు ఎస్పీసింగ్ ప్రకటించారు. గురువారం సచివాలయంలో మేడారం జాతర ఏర్పాట్లను సమీక్షించిన ఆయన మాట్లాడుతూ మేడారం జాతరకు వచ్చే యాత్రికులకు హెలికాప్టర్ సేవలను కూడా కల్పించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, భద్రతకు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను



గురువారం సచివాలయంలో మేడారం జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్

ఆదేశించారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం లభించేలా చూడాలన్నారు. అంతర్జాతీయ చానల్స్‌తోపాటు, బ్లాగులు, సోషల్‌మీడియాను కూడా ప్రచారానికి వినియోగించాలన్నారు. జాతీయ,అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని, విదేశీ యాత్రికులకు ఉన్నతస్థాయి సదుపాయాలతో ప్రత్యేక నివాసాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వివిధ దేశాల నుంచి జాతరకు వచ్చే ముఖ్యఅతిథులను తగిన ప్రొటోకాల్‌తో ఆహ్వానించాలన్నారు. ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసి జాతర కార్యక్రమాలను పర్యవేక్షించాలని సాంస్కృతిక శాఖకు సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పురపాలకశాఖ అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక, దేవాదాయశాఖ అధికారులు జాతర ఏర్పాట్లపై ప్రత్యేకంగా శాఖలవారీగా సమావేశాలు నిర్వహించాలని, టూరిజం శాఖ ప్రత్యేక బ్రోచర్‌ను విడుదల చేయాలని చెప్పారు. సమావేశంలో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, పర్యాటకశాఖ కార్యదర్శి బీ వెంకటేశం, దేవాదాయశాఖ కమిషనర్ శివశంకర్, గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టినా జే చొంగ్తూ, పోలీస్ ఉన్నతాధికారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాటరీ ద్వారా ప్రవేశాల ఖరారు

ప్రైవేటు స్కూళ్లకు విద్యాశాఖ ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ వంటి బడా పాఠశాలల్లో లాటరీ లేదా ర్యాండమ్ ద్వారా ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు స్కూళ్లలో స్క్రీనింగ్ టెస్ట్‌లను నిషేధించి అందరికీ అవకాశం కల్పించేందుకు మొత్తం దరఖాస్తులను క్రోడీకరించి లాటరీ ద్వారా సీట్లు ఖరారు చేయాల్సి ఉన్నది. ఇప్పటికే అన్ని కార్పొరేట్ స్కూళ్ల ప్రవేశాల కోసం జారీచేసిన షెడ్యూల్‌లో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించామని విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. లాటరీ ద్వారా ప్రవేశాలను నిర్వహించని స్కూళ్లపై చర్యలు తీసుకుంటామని ఆ శాఖ అధికారులు స్పష్టంచేశారు.

టీశాట్‌లో ఆంగ్ల బోధన

రామకృష్ణమఠ్ సమన్వయంతో ప్రసారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామీణ, పేద విద్యార్థుల కోసం టీ-శాట్ నెట్‌వర్క్ ఆంగ్లబోధనను ప్రసారం చేయనున్నది. జనవరి 14నుంచి ప్రతి ఆదివారం నిపుణ, విద్యచానళ్లలో ఆంగ్లబోధన అందుబాటులో ఉంటుందని టీ-శాట్ సీఈవో శైలేశ్‌రెడ్డి తెలిపారు. రామకృష్ణమఠం సౌజన్యంతో 'ఇంగ్లీష్ ఫర్ ఆల్' పేరుతో ఇంగ్లిష్ బోధనను ప్రసారం చేయనున్నట్టు తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు నిపుణ చానల్‌లో, సాయంత్రం 4 గంటలకు విద్యచానల్‌లో 45 నిమిషాలపాటు 86 ఎపిసోడ్స్ ప్రసారం చేస్తామని తెలిపారు. టీఆర్టీ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ నెల 12 నుంచి మరో మూడుగంటలపాటు అదనంగా కార్యక్రమాలను ప్రసారాలు చేయనున్నట్టు తెలిపారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 5.56 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, ఏకాదశి రాత్రి 9.24 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: విశాఖ ఉదయం 7.28 వరకు తదుపరి అనూరాధ, అమృత ఘడియలు: రాత్రి 10.38 నుంచి 12.14 వరకు, రాహుకాలం: ఉదయం 11.02 నుంచి మధ్యాహ్నం 12.24 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.05 నుంచి 9.50 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.47 నుంచి 1.31 వరకు, వర్జ్యం: ఉదయం 11.56 నుంచి మధ్యాహ్నం 1.32 వరకు.

లోకం పోకడ



చూశారా వీళ్ల నిర్వాకం.. హోంవర్క్ చేయాలని నోట్‌బుక్స్ ఇస్తే ఏం చేస్తున్నారో!!

పరిశ్రమల పునరుద్ధరణకు 'ట్రిపుల్ ఆర్'

- పారిశ్రామిక సమస్యలపై ప్రతి నెలా సమావేశాలు
- ఇండస్ట్రియల్ హెల్త్‌క్లినిక్‌లో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి
- పవర్ లూంకు ముద్ర రుణాలు
- ఎస్సెల్బీసీ ఎమ్మెస్‌ఎంఈ సబ్ కమిటీ సమావేశంలో మంత్రి కేటీఆర్



గురువారం కోఠిలోని ఎస్బీ ఐ ప్రధాన కార్యాలయంలో బ్యాంకులు, పారిశ్రామిక ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎస్ఎల్బీసీ చైర్మన్ జే స్వామినాథన్, కన్వీనర్ మణికందన్, పరిశ్రమలశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్, కమిషనర్ అహ్మద్‌నదీమ్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జిల్లాల్లోని పరిశ్రమల యజమానుల సమస్యల పరిష్కారానికి లీడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో ప్రతినెలా జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు సూచించారు. గురువారం కోఠిలోని ఎస్బీఐ ప్రధాన కార్యాలయంలో ఎస్సెల్బీసీ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు బ్యాంకుల నుంచి అందించాల్సిన సహాయంపై అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కొత్త పరిశ్రమలను ఆహ్వానించడంతోపాటు ప్రస్తుతం ఉన్న పరిశ్రమల సమస్యలను పరిష్కరించటానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నదని చెప్పారు. దీని కోసమే తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసిందని, దీనికి ఆర్బీఐ ఎన్బీఎఫ్సీ గుర్తింపు లభించిందని గుర్తుచేశారు. జిల్లా స్థాయి సమస్యలను స్థానికంగా పరిష్కరించాలని, అక్కడ పరిష్కారం కాని వాటిని రాష్ట్రస్థాయి కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెస్‌ఎంఈ పరిశ్రమల పునరుద్ధరణకు 'రెక్టిఫికేషన్, రీస్ట్రక్చరింగ్, రికవరీ' అనే ట్రిపుల్ ఆర్ సూత్రాన్ని పాటించాలని చెప్పారు.ఎమ్మెస్‌ఎంఈ పరిశ్రమలను ఆదుకొనేందుకు ప్రభుత్వం వినూత్నమైన కార్యక్రమాలతో ముందుకు పోతున్నదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. టీఐహెచ్‌సీలో బ్యాంకర్లు పెట్టుబడులు పెట్టి భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధిలో బ్యాంకుల సహకారాన్ని తాము గుర్తిస్తున్నామని తెలిపారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల యజమానులు వాయిదాలను చెల్లించకపోతే.. వాటిని మొండిబకాయిల ఖాతాలో చేర్చకుండా, తిరిగి ఆదుకొనే విషయంలో టెక్నో ఎకానమిక్ వయబిలిటీ (టీఈవీ) అధ్యయనంలో కొంత సానుకూలంగా ఉండాలని కోరారు. సాధ్యమైనంత తక్కువ సమయంలో దీన్ని పూర్తిచేయాలని మంత్రి బ్యాంకర్లకు సూచించారు. అవసరమైతే ఈ అధ్యయనాన్ని టీఐహెచ్‌సీ చేసిపెడుతుందని అభయమిచ్చారు.

ఎన్పీయేలకు 90 రోజులు సరికాదు

పరిశ్రమలు బకాయిలుపడితే వెంటనే సర్ఫాయస్ యాక్ట్ అమలుచేయటం సరికాదని మంత్రి కేటీర్ పేర్కొన్నారు. ఖాయిలా పరిశ్రమల బకాయిలను రీషెడ్యూల్, రివైవ్ చేయటానికి ప్రయత్నించాలని సూచించారు. గతంలో ఉన్న స్లిక్ కమిటీని పునరుద్ధరించాలని ఆర్బీఐని కోరుతామని చెప్పారు. 90 రోజుల గడువులోపు నెలవారి మొత్తాలు చెల్లించకుంటే ఎన్పీఏలుగా ప్రకటించడం సరికాదని, ఈ సమయాన్ని పెంచాలని ఆర్బీఐతోపాటు కేంద్ర ఆర్థికశాఖ మంత్రిని కోరుతామని స్పష్టంచేశారు. బ్యాంకులు పరిశ్రమల బకాయిలు, వేలం విషయంలో ఆర్బీఐ నిబంధనలను అమలుచేయాలని సూచించారు. పవర్ లూం కార్మికులకు ముద్ర రుణాలు అందజేయాలని, 20శాతం సబ్సిడీతో రూ.25 లక్షల వరకు రుణాలు అందించాలని మంత్రి కోరారు. స్టాండప్, స్టార్టప్ పథకాలను సద్వినియోగం చేసుకోని విరివిగా రుణాలు ఇవ్వాలని చెప్పారు. టీఎస్ఐఐసీ చేపట్టిన వివిధ క్లస్టర్లను అడాప్ట్ చేసుకోవాలని, పరిశ్రమలు నెలకొల్పటానికి బ్యాంకులు రుణాలివ్వాలని కోరారు. ఎలిప్ ప్రెసిడెంట్ రమాదేవి టీఐహెచ్‌సీలో తమ సంస్థ తరుపున రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించారు. సమావేశంలో ఎస్ఎల్బీసీ చైర్మన్ జే స్వామినాథన్, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, పరిశ్రమలశాఖ కమిషనర్ అహ్మద్‌నదీమ్, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహరెడ్డి, పరిశ్రమలశాఖ అదనపు సంచాలకులు దేవానంద్, ఎస్సెల్బీసీ కన్వీనర్ మణికందన్, ఎస్బీఐ జీఎం మైయా, టీఐహెచ్‌సీ సలహాదారు యెర్రం రాజు, ఎఫ్‌ట్యాప్సీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్, డిక్కి అధ్యక్షుడు రాహుల్‌కిరణ్, టీఐఎఫ్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, ఏపీకే రెడ్డి పాల్గొన్నారు.

లిఫ్టులు ఆరునెలల్లో పూర్తవ్వాలి

- టెండరు నోటిఫికేషన్‌లోనే నిబంధనలు
- కాళేశ్వరం స్ఫూర్తితో ఐడీసీబోర్డు సంచలన నిర్ణయం
- వానకాలంనాటికి లిఫ్టుల కింద రెండు లక్షల ఎకరాలకు నీరు
- ప్రభుత్వ పరిశీలనలో రూ.398 కోట్లతో కొత్త లిఫ్టు పథకాలు



గురువారం ఈడీసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి. చిత్రంలో నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు, ఐడీసీ ఎండీ సురేశ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇక నుంచి చేపట్టే ఏ లిఫ్టు పథకమైనా ఆరునెలల్లో పూర్తిచేయాలని గురువారం జరిగిన బోర్డు సమావేశంలో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ నిబంధనను టెండరు నోటిఫికేషన్‌లోనే పొందుపరచాలని తీర్మానించారు. ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అధ్యక్షతన ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కీలకనిర్ణయాలు తీసుకున్నారు. ప్రత్యేక, సహేతుక కారణాలుంటే తప్ప గడువు సమయం పొడగింపు (ఈవోటీ) ఇవ్వకూడదని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా పూర్తిచేస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు స్ఫూర్తితోనే ఈ కీలక నిర్ణయం తీసుకున్నామని ఐడీసీ చైర్మన్ మీడియాకు చెప్పారు. ఐడీసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతి లిఫ్టు పథకంలోనూ ఎమ్మెస్ పైప్‌లైన్లు వేయాలని నిర్ణయించామని, దీనిద్వారా గతంలోకంటే అంచనా వ్యయం 20-30శాతం పెరిగినా.. ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడంతోపాటు నాణ్యత కోణంలో మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం లిఫ్టు పథకాల కింద సుమారు 1.20 లక్షల ఎకరాల వరకు సాగునీరు ఇస్తున్నామని, ఈ యాసంగిలో అదనంగా 30వేల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరు ఇస్తున్నామని చెప్పారు. సూర్యాపేట జిల్లా పరిధిలోని ఎర్రగడ్డతండా వద్ద రెండు, మంథని నియోజకవర్గంలోని ఖాసిపేట, పలిమెల లిఫ్టు పథకాలను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. వీటిద్వారా మరో 10-12 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. వచ్చే వానకాలంలో అదనంగా 30 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా.. మరో 20 లిఫ్టు పథకాలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇవి ప్రధానంగా పాత పాలమూరు, నల్లగొండ, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో పనులు

రాష్ట్రవ్యాప్తంగా రూ.398 కోట్ల విలువైన అనేక కొత్త లిఫ్టు పథకాలకు త్వరలో ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తాయని ఆశిస్తున్నట్టు ఐడీసీ చైర్మన్ శంకర్ రెడ్డి చెప్పారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ఆరు పథకాలకు సంబంధించి రూ.257 కోట్ల విలువైన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో స్తంభంపల్లి, వెలగటూర్, దమ్మన్నపేట లిఫ్టు పథకాలను రూ.88.70 కోట్లతో చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు వెల్లడించారు. దీనిద్వారా 6,885 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఆందోల్ నియోజకవర్గంలో రూ.38 కోట్లతో చేపట్టనున్న తలెలమ్మ లిఫ్టు ద్వారా మూడువేల ఎకరాలకు, కమలాపూర్ నియోజకవర్గంలో రూ.4 కోట్లతో మరిపల్లిగూడెం లిఫ్టు ఆధునీకరణ ద్వారా 540 ఎకరాలకు, బాన్సువాడ నియోజకవర్గంలో రూ.11 కోట్లతో చేపట్టనున్న కొడిచెర్ల లిఫ్టు ద్వారా 1,400 ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. రూ.32 కోట్లతో చేపట్టిన థాంసీ లిఫ్టు పథకంపై కూడా బోర్డు సమావేశంలో చర్చించినట్టు తెలిపారు. ఈ పథకం ద్వారా రెండున్నరవేల ఎకరాలకు సాగునీరు అందనుండగా.. అందులో వెయ్యి ఎకరాలు చనాక-కొరాట ప్రాజెక్టు ఆయకట్టులో ఉన్నదని చెప్పారు. దీంతో ఆ వెయ్యి ఎకరాల ఆయకట్టును థాంసీ లిఫ్టు పథకం నుంచి తొలిగించి, ఆ నీటిని సమీపంలోని ఇతర చెరువులు నింపేందుకు వినియోగించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు, ఐడీసీ ఎండీ సురేశ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నలభై ఏండ్ల తర్వాత న్యాయం!

- ఎస్సారెస్పీ భూనిర్వాసితుల భూములకు సాగునీరు
- ఆరు లిఫ్టు పథకాలకు రూ.257 కోట్లతో ప్రతిపాదనలు
- ఎంపీ కవిత, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చొరవతో ఐడీసీ కసరత్తు
- ప్రభుత్వ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాం: చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి

ప్రభుత్వానికి ప్రతిపాదించిన లిఫ్టు పథకాల వివరాలు

పథకం పేరు	అంచనా వ్యయం (రూ.కోట్లల్లో)	ఆయకట్టు (ఎకరాల్లో..)
ఫతేపూర్	70	3,700
కమటం-చిక్లి	56.75	3,175
మచ్చర్ల	40	2,860
సుబ్రియాల్	36	2,040
మిర్దాపల్లి	54.5	1,920
మొత్తం	257.25	13,695

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు భూములిచ్చిన త్యాగం వాళ్లది. మరోచోట భూములు కొనుక్కొని జీవనం సాగించాలనుకున్నారు. భూములు కొన్నారేగానీ.. వాటికి సాగునీరు వచ్చే అవకాశం లేదు. వాస్తవంగా ప్రభుత్వాలు ఏం చేయాలి? ఒక ఆధునిక దేవాలయానికి తమ భూములిచ్చినందుకు ఆ రైతులకు ఎలాగైనా సాగునీరు అందించి న్యాయంచేయాలి. కానీ, నాలుగు దశాబ్దాలకుపైగా ఆ రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. కానీ ఇన్నాళ్లూ ఆ దిశగా ఆలోచించిన నాయకులు లేరు. ప్రభుత్వాలు లేవు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పరిస్థితి మారింది. ఏకంగా రూ.257 కోట్లతో ఎస్సారెస్పీ భూనిర్వాసితుల భూములకు జీవం పోసి.. న్యాయంచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చొరవతో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆరు లిఫ్టు పథకాలకు ప్రతిపాదనలు సిద్ధంచేసి.. ప్రభుత్వానికి పంపింది. వాటికి ఆమోదం రాగానే త్వరితగతిన పనులు పూర్తిచేస్తామని ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతుల్లో వేలమంది నిజామాబాద్ జిల్లా పరిధిలోని ఆర్మూర్ నియోజకవర్గంలో తిరిగి భూములు కొనుగోలుచేశారు. వీటికి సాగునీటి వసతిలేదు. ప్రాజెక్టు కోసం భూములిచ్చిన తమకు ఎలాగైనా సాగునీరిచ్చి న్యాయంచేయాలని ఆ రైతులు అప్పటి నుంచి ప్రభుత్వాలను వేడుకుంటున్నా.. ఏ ఒక్క ప్రజాప్రతినిధిగానీ, ప్రభుత్వంగానీ వారి మొర ఆలకించలేదు. ఈ నేపథ్యంలో ఎంపీ కల్వకుంట్ల కవిత, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చొరవ తీసుకోవటంతో.. 13,695 ఎకరాలకు సాగునీటి వసతి కల్పించేందుకు ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆరు లిఫ్టు పథకాలకు రూపకల్పన చేసింది. శ్రీరాంసాగర్ జలాశయం ఫోర్‌షోర్ నీటిని ఆధారం చేసుకొని వీటిని డిజైన్‌చేశారు.

త్వరితగతిన పూర్తిచేస్తాం

ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి

ఒక ప్రాజెక్టుకు భూములు త్యాగంచేసిన రైతులను ఆదుకోవటం ప్రభుత్వ ధర్మం. ఇన్ని దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోకపోవటం చాలా దుర్మార్గం. ఎంపీ కవిత, ఎమ్మెల్యే ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సానుకూలంగా స్పందించారు. ఆ రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఉన్నదని చెప్పారు. ఆ క్రమంలోనే ఐడీసీ తరపున ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతిరాగానే త్వరితగతిన ఆ పనులు పూర్తిచేసి, నిర్దేశిత ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తాం.

ప్రైవేటు స్కూళ్ల ఫీజులుంపై కొరడా

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేటుస్కూళ్లపై సర్కార్ సీరియస్
- నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం
- విద్యాశాఖ డైరెక్టర్ స్పష్టీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేటు స్కూళ్లు ముఖ్యంగా సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ, కేంబ్రిడ్జ్ అఫిలియేటెడ్ స్కూళ్లలో 2018-19 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచారు. 2018-19లో పాతఫీజులే ఉండాలని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య స్పష్టమైన ఆదేశాలు జారీచేసినప్పటికీ ప్రైవేటుస్కూల్ యాజమాన్యాలు వాటిని తుంగలో తొక్కాయి. ఫీజుపెంపు అంశంపై ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ నివేదిక ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదని, న్యాయశాఖ, విద్యాశాఖ ఆ సిఫారసులు అధ్యయనం చేస్తాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన స్కూల్స్‌పై అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రైవేటు స్కూల్స్ గత ఏడాది ఫీజుల మీద 20 నుంచి 30 శాతం వరకు పెంచాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తల్లిదండ్రుల సంఘాలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. ఈ విషయమై విద్యాశాఖ కసరత్తు చేస్తున్నది.

ప్రైవేటుస్కూళ్లకు నిబంధనల కాపీ

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ట్యూషన్ ఫీజులను పెంచుతూ స్కూల్ యాజమాన్యాలు తీసుకున్న నిర్ణయంపై పాఠశాల విద్యాశాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ వంటి ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యాలతో ఆ శాఖ డైరెక్టర్ జీ కిషన్ గురువారం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చే విద్యాసంవత్సరంలో ఫీజులను పెంచవద్దంటూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల ప్రతులను స్కూల్ యాజమాన్యాలకు అందజేశారు. నిబంధనల కాపీలు ముట్టినట్టుగా యాజమాన్యాల ప్రతినిధుల నుంచి సంతకాలను కూడా తీసుకున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు తమకు అందలేదని బడా పాఠశాలల యాజమాన్యాలు బుకాయిస్తున్న నేపథ్యంలో విద్యాశాఖ వారికి నేరుగా నిబంధనలను అందజేసింది. ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కల్పా స్కూల్, గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్, చిరాక్, ఓక్రిడ్జ్, శ్రీఅరబిందో ఇంటర్నేషనల్ వంటి పలు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ స్కూళ్లలో ఇప్పటికే అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో వారికి నిబంధనల కాపీని అందజేయాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలోని స్టేట్ సిలబస్‌కు చెందిన ప్రైవేటుస్కూళ్లకు కూడా విద్యాశాఖ నిబంధనలను రిజిస్టర్ పోస్టు ద్వారా పంపుతామన్నారు.

7000 మంది పన్ను ఎగవేతదారులకు నోటీసులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు పన్నులు చెల్లించని దాదాపు ఏడువేలమంది వ్యాపారులకు నోటీసులు ఇవ్వాలని వాణిజ్య పన్నులశాఖ నిర్ణయించింది. పన్నుఎగవేతదారుల నుంచి రాష్ట్ర ఖజానాకు రూ.708 కోట్ల ఆదాయం రావాల్సి ఉన్నది. ఏడువేల మంది వ్యాపారస్థులు వారి రిటర్న్‌లో వ్యాపారం చేసినట్టుగా చూపించి లావాదేవీలకు సరిపడా విలువ ఆధారిత పన్ను(వ్యాట్) చెల్లించలేదు. పన్ను బకాయిలను చెల్లించేందుకు పది రోజులు సమయం ఇవ్వనున్నారు. గడువులోగా పన్ను చెల్లించని వ్యాపారసంస్థలపై కఠినచర్యలు తీసుకోనున్నట్టు వాణిజ్యపన్నులశాఖ అధికారులు తెలిపారు.

గుట్కాపై నిషేధం పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో గుట్కా, పాన్ మసాలపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఈమేరకు గురువారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) డైరెక్టర్ శంకర్ ఆదేశాలు జారీచేశారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006 క్లాజ్ (ఏ) ఆఫ్ సబ్ సెక్షన్ (2) ఆఫ్ సెక్షన్ 30 రెడ్ విత్ 2, 3, 4 రెగ్యులేషన్ 2011 ప్రకారం రాష్ట్రంలో మరో ఏడాది పాటు పొగాకు, నికోటిన్‌తో కూడిన గుట్కా, పాన్ మసాలా, చాప్ టొబాకో, ప్యూర్ టొబాకో, ఖైనీ, ఖర్రా, సెంటెడ్ టొబాకో, ఫ్లేవర్డ్ టొబాకోపై నిషేధం కొనసాగనున్నది.

పెండింగ్ ఇండెంట్లపై

కృష్ణాబోర్డు నిర్ణయం

ఏపీకి 37.30, తెలంగాణకు 17టీఎంసీల నీటి విడుదలకు ఉత్తర్వులు

శ్రీశైలం నుంచి సాగర్‌కు 16 టీఎంసీలు విడుదల చేయాలని ఏపీకి ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణాజలాల పంపిణీలో భాగంగా పెండింగ్ ఇండెంట్లపై కృష్ణాబోర్డు నిర్ణయం తీసుకున్నది. ఆంధ్రప్రదేశ్‌కు 37.30 టీఎంసీలు, తెలంగాణకు 17 టీఎంసీల నీటి విడుదలకు బోర్డు అనుమతి ఇచ్చింది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 16 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఏపీని ఆదేశించింది. ఈ మేరకు బోర్డు సభ్యకార్యదర్శి పరమేశం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. రెండు రోజుల కిందట జరిగిన బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఈనెల 8 నాటికి శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి పరిమాణాన్ని దృష్టిలో ఉంచుకొని ఏపీకి 60, తెలంగాణకు 50 టీఎంసీలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పెండింగులో ఉన్న రెండు రాష్ట్రాల ఇండెంట్లను బోర్డు ఆమోదించింది. పోతిరెడ్డిపాడు ద్వారా ఏడు టీఎంసీలు కావాలని ఏపీ కోరింది. అయితే ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు 0.691 టీఎంసీలు వాడుకున్నందున దానిని మినహాయించి 6.309 టీఎంసీల విడుదలకు బోర్డు అనుమతించింది. అదేవిధంగా ఏపీ కోరికపై హంద్రీనీవాకు 5.50 టీఎంసీలు, సాగర్ కుడికాల్వ ద్వారా 16.50 టీఎంసీలు, కృష్ణాడెల్టాకు ఐదు టీఎంసీలు, సాగర్ ఎడమకాల్వ ద్వారా మరో నాలుగు టీఎంసీల నీటి విడుదలకు ఉత్తర్వులిచ్చింది. ఇక తెలంగాణలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2.50 టీఎంసీలు, ఏఎమ్మార్పీ నుంచి హైదరాబాద్‌కు తాగునీటి కోసం 4.60 టీఎంసీలు, సాగర్ ఎడమకాల్వకు 10 టీఎంసీలను మంజూరు చేసింది. తాజా నీటి విడుదల ఉత్తర్వులు జారీచేస్తున్న దరిమిలా శ్రీశైలం నుంచి సాగర్‌కు 16 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్‌ను బోర్డు ఆదేశించింది.

హైదరాబాద్‌లో మరో కీలక సమావేశం

- వచ్చేనెలలో ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీ సమావేశం
- ఏడుగురు సభ్యులతో సలహా కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మరో కీలక సమావేశాన్ని నిర్వహించబోతున్నారు. ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీ 62వ సమావేశాన్ని ఫిబ్రవరి మొదటివారంలో భాగ్యనగరంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏడుగురు సభ్యులతో సలహా కమిటీని ఏర్పాటుచేస్తూ విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సలహా కమిటీలో సభ్యులుగా మాజీ పోస్టు మాస్టర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఉస్మానియా వర్సిటీ మాజీ వీసీ సులేమాన్ సిద్ధికీ, ఓయూ హిస్టరీ డిపార్ట్‌మెంట్ మాజీ హెడ్ ఏ సత్యనారాయణ, కాకతీయ వర్సిటీ హిస్టరీ డిపార్ట్‌మెంట్ మాజీ హెడ్ ప్రొఫెసర్ సయ్యద్ అయూబ్ అలీ, ఎస్ శ్రీనాథ్, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీ సుమలత, రాష్ట్ర ఆర్కైవ్స్ డైరెక్టర్ డాక్టర్ జరీనా పర్వీన్ ఉన్నారు.

నగర పంచాయతీగా బాన్సువాడ

ఉత్తర్వులు జారీచేసిన పురపాలకశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కామారెడ్డి జిల్లా బాన్సువాడ గ్రామ పంచాయతీని నగర పంచాయతీగా మారుస్తూ పురపాలకశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి గురువారం ఉత్తర్వులు వెలువరించారు.

నేవీకి అంగుళం స్థలం కూడా ఇవ్వం

- పోష్ ఏరియాలో ఉండటం కాదు.. పాక్ సరిహద్దులో కాపలా కాయాలి
- నౌకాదళంపై కేంద్రమంత్రి గడ్కరీ మండిపాటు
- రక్షణశాఖ ప్రభుత్వం కాదని వ్యాఖ్య

ముంబై: ఇండో-పాక్ సరిహద్దులో కాపలా కాయకుండా.. సంపన్నులు నివసించే ప్రాంతాల్లోనే ఉండాలని నౌకా దళ సిబ్బంది ఎందుకు అనుకుంటున్నారని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారికి గృహ వసతి కల్పించేందుకు దక్షిణ ముంబైలో ఒక్క అంగుళం స్థలం కూడా ఇవ్వబోమని స్పష్టంచేశారు. దక్షిణ ముంబైలోని మలబార్‌హిల్ ప్రాంతంలో ప్రభుత్వం నిర్మించతలపెట్టిన రేవుకట్టకు నౌకాదళం అభ్యంతరం తెలిపింది. ఆ ప్రాంతంలోనే నీటిపై తేలియాడే ఒక హోటల్‌ను, సముద్ర విమాన సేవలను నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. అయితే ప్రభుత్వ ప్రణాళికలను నౌకాదళం అడ్డుకోవడంపై గడ్కరీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముంబైలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో గడ్కరీ వెస్టర్న్ నావల్ కమాండ్ చీఫ్ వైస్ అడ్మిరల్ గిరీశ్ లూత్రా సమక్షంలోనే ఈ వ్యాఖ్యలు చేశారు. 'వాస్తవానికి నౌకాదళం ఉగ్రవాదులు చొచ్చుకువచ్చే సరిహద్దుల వద్ద ఉండాలి. కానీ (నౌకాదళంలోని) ప్రతిఒక్కరూ దక్షిణ ముంబైలోనే ఎందుకు ఉండాలనుకుంటున్నారు? వారు (నేవీ సిబ్బంది) ఒక ప్లాట్ కావాలని అడిగేందుకు నా దగ్గరికి వచ్చారు. నేను వారికి ఒక్క అంగుళం స్థలం కూడా ఇవ్వను. దయచేసి నా వద్దకు రాకండి. దక్షిణ ముంబైలోని పోష్ ఏరియాలోనే ప్రతిఒక్కరు క్వార్టర్లు, ఫ్లాట్లు కట్టాలనుకుంటారు. మీరంటే (నేవీ) మాకు గౌరవం. కానీ, మీరు పాకిస్థాన్ సరిహద్దుకు వెళ్లి అక్కడ గస్తీ నిర్వహించాలి' అని గడ్కరీ



పేర్కొన్నారు. తూర్పువైపు సముద్రతీర ప్రాంతంలో మహారాష్ట్ర ప్రభు త్వం, ప్రభుత్వరంగ సంస్థ ముంబై పోర్ట్ ట్రస్ట్ కలిసి అభివృద్ధి చేసిన స్థలాన్ని స్థానికుల కోసమే వినియోగిస్తామని చెప్పారు. మలబార్ హిల్ ప్రాం తంలో జెట్టీ (రేవుకట్ట) నిర్మాణానికి హైకోర్టు అనుమతించినప్పటికీ, నౌకాదళం అడ్డుకున్నదని, అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం (నేవీకి) అలవాటైపోయిందని అన్నారు. అది ఒక ప్రైవేటు ప్రాంతమని, అక్కడ నౌకాదళానికి ఏమి పని అని నిలదీశారు. 'ప్రభుత్వం అంటే మేము. నౌకాదళం, రక్షణ మంత్రిత్వ శాఖ కాదు' అని పేర్కొన్నారు. దక్షిణముంబైలో నౌకాదళ సిబ్బంది గణనీయ సంఖ్యలో నివాసముంటున్నారు. అక్కడే పశ్చిమ నౌకాదళ కమాండ్ ప్రధాన కార్యాలయం ఉన్నది.

యూపీలో దళితులకు శిరోముండనం

ఆవుల చోరీ పేరుతో దాష్టీకం

బాలియా: ఆవులను దొంగిలించారనే ఆరోపణలపై దళిత సామాజికవర్గానికి చెందిన ఇద్దరికి గుండుకొట్టించి ఊరేగించిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని రస్రా పట్టణంలో చోటుచేసుకున్నది. హిందూ యువవాహిని కార్యకర్తలు వారిని పోలీసులకు అప్పగించడంతో వారిపై చోరీ కేసు నమోదుచేశారు. కాగా హిందూ యువవాహిని కార్యకర్తలు తమకు గుండు కొట్టించి ఊరేగించారని బాధితులు ఫిర్యాదు చేశారని పోలీసులు గురువారం వెల్లడించారు. తమ మెడకు టైర్లు వేసి 'మేం ఆవుల దొంగలం' అనే ప్లకార్డులతో వీధుల్లో తిప్పారని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. వారి ఫిర్యాదు మేరకు ఓ వ్యక్తితోపాటు మరో 15 మంది గుర్తుతెలియని వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు వివిధ సెక్షన్ల కింద వేర్వేరు కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ అనిల్‌కుమార్ వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను డీఎస్పీ స్థాయి అధికారికి అప్పగించినట్టు వివరించారు.

విద్యుత్ లెక్కలు వివరిస్తాం

- పీసీసీ చీఫ్, సీఎల్పీ నేత వస్తే సిద్ధం
- అసెంబ్లీలోనైనా చర్చిద్దాం రండి
- విశ్వసనీయతలేని వ్యక్తి రేవంత్‌రెడ్డి
- ఎంపీ బాల్క సుమన్, విప్ పల్లా, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు ఫైర్



టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ బాల్క సుమన్. చిత్రంలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ టీ భానుప్రసాద్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యుత్ ఉత్పత్తి, సరఫరా కోసం ప్రభుత్వం మూడున్నరేండ్లలో తీసుకున్న చర్యలు, చేసిన కృషిని వివరించడానికి సిద్ధంగా ఉన్నామని, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డి చర్చకు వస్తే లెక్కలు, ఆధారాలతో సహా నిరూపిస్తామని టీఆర్‌ఎస్ ప్రకటించింది. గురువారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఎంపీ బాల్క సుమన్, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ టీ భానుప్రసాద్‌రావు మీడియాతో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు లేదా సీఎల్పీ నేతల్లో ఎవరూ వచ్చినా విద్యుత్‌పై చర్చిస్తాం కానీ.. విశ్వసనీయత లేని వ్యక్తి, అబద్ధాల కోరు రేవంత్‌రెడ్డితో చర్చ ఏంటని ఎంపీ బాల్క సుమన్ ఎద్దేవాచేశారు. రేవంత్‌రెడ్డి గజదొంగని, ఓటుకు నోటు కేసులో పట్టుబడ్డ నీచుడితో చర్చనా? అంటూ తెలంగాణ సమాజం ప్రశ్నిస్తున్నదన్నారు. అన్ని పార్టీలు తిరుగుతూ కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తి రేవంత్ అని, మరోనేత టీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని, సంపత్‌కుమార్ ఎప్పుడు పార్టీ మారుతాడో తెలియదని అన్నారు. గోబెల్స్ ప్రచారానికి గాంధీభవన్‌ను వేదికగా చేసుకుని ఆ పార్టీ నాయకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఆరోపించినట్టుగా భద్రాద్రి పవర్ ప్లాంటుకు సంబంధించి 23 మందిపై కేసు నమోదు కాలేదని, కేవలం ఇద్దరిపైనే నమోదైందని చెప్పిన సుమన్ మీడియాకు ఎఫ్‌ఐఆర్ కాపీని చూపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక రెండింటితోనే విద్యుత్ ఒప్పందం చేసుకున్నదని, అందులో ఒకటి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాగా, మరొకటి కాంగ్రెస్ పార్టీ నేత టీ సుబ్బిరామిరెడ్డికి చెందిన థర్మల్ టెక్ సంస్థ అని చెప్పారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానని రేవంత్‌రెడ్డి అమరావతిలో ప్రకటించాడని, సామాజిక మాధ్యమాల్లో మాత్రమే లేఖపెట్టాడని, ఇంతకు ఆయన ఇప్పుడు ఎమ్మెల్యేనా? కాదా అని సుమన్ ప్రశ్నించారు. రైతులకు విజయవంతంగా వ్యవసాయానికి 24 గంటల సరఫరా చేస్తుండటంతో రైతులందరూ సంతోషంగా ఉన్నారని, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నారని, దాని దృష్టి మరల్చడానికే ఇలాంటి తప్పుడు ఆరోపణలు, చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

విషయ పరిజ్ఞానం లేకుండా విమర్శలు: పల్లా

విద్యుత్ విషయంలో కాంగ్రెస్ నాయకులు సరైన విషయ పరిజ్ఞానం, సమాచారం లేకుండా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన ఆరోపణల్లో ఒక్కటి కూడా వాస్తవం లేదన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1700 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, మరో 300 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి రైట్ ఆఫ్ వే అనుమతుల కోసం ఆగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎన్టీపీసీ ద్వారా యూనిట్ విద్యుత్‌ను రూ.17.80లకు కొనుగోలు చేశారని, 2013లో 351 మెగావాట్ల సరఫరాకు ఒక్కోయూనిట్‌కు రూ.6.49లతో ఒప్పందం చేసుకుందని తెలిపారు.

2.15 లక్షల మెగావాట్లు సబ్ క్రిటికల్ ద్వారానే: భానుప్రసాద్

దేశంలో 2.40 లక్షల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంటే ఇందులో 2.15 లక్షల మెగావాట్లు సబ్ క్రిటికల్ విధానం ద్వారానే అవుతుందని ఎమ్మెల్సీ టీ భానుప్రసాద్‌రావు చెప్పారు. సమయాన్ని ఆదా చేయడానికే భద్రాద్రి పవర్ ప్లాంటు నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం బీహెచ్‌ఈఎల్‌కు కేటాయించిందని, అప్పట్లో కేంద్ర ప్రభుత్వం సూపర్ క్రిటికల్ వినియోగించవద్దని చెప్పలేదన్నారు. ఆ సమయానికి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ప్రాజెక్టు నిర్మిస్తున్నారని అన్నారు. దేశంలో ప్రస్తుతం 28 ప్రాజెక్టులు సబ్ క్రిటికల్ విధానంలో నిర్మాణాలు సాగుతున్నాయన్నారు.

రేపటి నుంచి కైట్.. స్వీట్ ఫెస్టివల్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన పర్యాటకశాఖ మంత్రి చందూలాల్

గురువారం సచివాలయంలో అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి చందూలాల్. చిత్రంలో పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్రాంతి సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో ఈ నెల 13 నుంచి 15 వరకు తెలంగాణ పర్యాటకశాఖ కైట్, స్వీట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నదని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ పేర్కొన్నారు. స్వీట్ ఫెస్టివల్‌లో దాదాపు 1000 రకాల స్వీట్లను ఒకే వేదికపైన ప్రదర్శించనున్నట్టు చెప్పారు. మంత్రి అజ్మీరా చందూలాల్ గురువారం సచివాలయంలో పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రావెంకటేశంతో కలిసి అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న వివిధ రాష్ట్రాల, దేశాల ప్రజలు స్వయంగా తయారుచేసిన స్వీట్లను స్వీట్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు, విక్రయానికి ఉంచుతామని చందూలాల్ చెప్పారు. ప్రతిరోజు లక్ష మందికి పైగా సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నట్టు పర్యాటక, సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు.కైట్, స్వీట్ ఫెస్టివల్‌లో పాల్గొనేవారికి ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్లలో కనీస పింఛన్ 7,500!

- ఈపీఎఫ్ విధానానికి సవరణలు చేయనున్న కేంద్రం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) ద్వారా వివిధ కార్పొరేషన్ల నుంచి రిటైరయ్యే ఉద్యోగులకు కనీసం రూ.7,500 పింఛన్ వచ్చేవిధంగా కేంద్ర ప్రభు త్వం చర్యలు తీసుకుంటున్నది. ఈపీఎఫ్ విధానంలో మార్పులు తెస్తున్న నేపథ్యంలో కార్పొరేషన్ల నుంచి రిటైరయ్యే ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనున్నది. ప్రావిడెంట్ ఫండ్ నిబంధనల ప్రకారం మొదటిదశలో నవంబర్ 15, 1999 నుంచి 31 ఆగస్టు 2014 మధ్యకాలంలో రిటైరైన వారికి ఈ విధానం అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఈ మేరకు ఇప్పటికే ప్రావిడెంట్ అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. కేంద్రం ప్రకటించిన తేదీల్లో రిటైరైన ఉద్యోగులు తమ పూర్తి వివరాలను ఇచ్చేందుకు, తెలుసుకునేందుకు భవిష్యనిధిలో ప్రత్యేక సెల్‌ను అందుబాటులోకి తెచ్చారు. తొలిదశలో దేశవ్యాప్తంగా 200 పబ్లిక్‌సెక్టార్ సంస్థల నుంచి రిటైరైన 50 లక్షల మంది ఉద్యోగులకు ఈ ప్రయోజనం అందించేందుకు కేంద్రం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. కొత్త నిబంధనల ప్రకారం తెలంగాణలో ప్రభుత్వ గుర్తింపు పొందిన 70 కార్పొరేషన్లలో రిటైరైన ఉద్యోగులకు ఈ విధానం వర్తిస్తుంది. కార్పొరేషన్లలో మేనేజర్‌స్థాయిలో రిటైరైన ఉద్యోగికి కూడా ప్రస్తుత విధానంలో రూ.2500 పింఛనే వస్తున్నది. రిటైరైన తర్వాత ఉద్యోగికి కనీసంగా రూ.15 వేలు పింఛన్ లభించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులు, కార్మికులు ఆత్మగౌరవంతో బతికేవిధంగా పింఛన్ విధానం ఉం డాలని తెలంగాణ పబ్లిక్‌సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ జీవన్ విజ్ఞప్తిచేశారు. రాష్ట్రంలోని బేవరేజెస్ కార్పొరేషన్, ఆయిల్ ఫెడరేషన్ వంటి సంస్థల్లో రిటైరైన ఉద్యోగుల గణాంకాలను, వారు రిటైరయ్యే నాటికి తీసుకున్న జీతభత్యాలు తదితర వివరాలను సేకరిస్తూ జాబితాలను రూపొందిస్తున్నట్టు సమాచారం.

పోలీసుశాఖలో అంతర్రాష్ట్ర బదిలీలు

వివిధ క్యాటగిరీల్లో 84 మందికి స్థానచలనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం పోలీసుశాఖలో వివిధ క్యాటగిరీల్లోని 84 మంది పోలీసులను పరస్పర బదిలీ చేస్తూ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజీవ్ త్రివేది ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన కొందరు ఆంధ్రప్రదేశ్‌లో, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు తెలంగాణలో పని చేస్తున్నారు. తమ ప్రాంతానికి వెళ్తామని వీరు కొంతకాలంగా డీజీపీ ఎం మహేందర్‌రెడ్డికి విజ్ఞప్తిచేస్తున్నారు. స్పందించిన డీజీపీ.. ఏపీ పోలీసులతో మాట్లాడారు. పరస్పరం 90 మందిని బదిలీ చేసేందుకు అంగీకారానికి వచ్చారు. తెలంగాణలో 84 మంది మాత్రమే పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకోవడంతో వారిని రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది.

డీఎడ్ రెండో ఏడాది పరీక్షల తేదీలు ఖరారు

ఫిబ్రవరి 16 నుంచి నిర్వహణ.. షెడ్యూల్ జారీచేసిన పరీక్షల విభాగం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఎడ్) ద్వితీయ సంవత్సర పరీక్షలను వచ్చేనెల నుంచి నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 16 నుంచి 22 వరకు పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ తెలిపారు. దీనికి సంబంధించి షెడ్యూల్‌ను గురువారం జారీచేశారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని.. రోజుకు ఒక పేపర్‌చొప్పున ఆరు రోజులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

30 నుంచి టీసీసీ పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలను ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 2 వరకు నిర్వహించనున్నామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ తెలిపారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను గురువారం జారీచేశారు. డ్రాయింగ్, టైలరింగ్ వంటి టెక్నికల్ కోర్సులకు పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. పూర్తి వివరాల కోసం www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

టీఆర్టీ దరఖాస్తుల సవరణ గడువు 15 వరకు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీచర్ కొలువుల భర్తీ కోసం నిర్వహిస్తున్న టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ) దరఖాస్తుల సవరణ గడువును టీఎస్‌పీఎస్సీ పొడిగించింది. ఈ నెల 15 తేదీ వరకు దరఖాస్తుదారులు తమ వివరాలు సవరణ చేసుకోవచ్చునని టీఎస్‌పీఎస్సీ గురువారం వెల్లడించింది. ఈ నెల ఏడో తేదీతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియగా పదకొండో తేదీతో సవరణ గడువు పూర్తయింది. అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు పొడగింపునకు అవకాశం కల్పించారు. అయితే ఒక్కసారి మాత్రమే తప్పులు సవరించుకునే అవకాశం ఉన్నదని టీఎస్‌పీఎస్సీ ఇదివరకే స్పష్టం చేసింది.

Dwaraka



వాజపేయి, అద్వానీ కాలం నాటి బీజేపీ కాదిది. అప్పుడు ఒక సామాన్య కార్యకర్త కూడా పార్టీ అధ్యక్షుడిని కలిసే వీలుండేది. నేను ప్రధాని నరేంద్ర మోదీని కలిసి అనేక విషయాల గురించి చర్చించటం కోసం గత 13 నెలలుగా ప్రయత్నిస్తున్నాను. కానీ ప్రధాని నాకు సమయం ఇవ్వటం లేదు. ఇకనుంచి ప్రభుత్వంలోని ఏ ఒక్కరినీ కలువటానికి ప్రయత్నించను. నేను చెప్పదల్చుకునేది ఏదైనా ప్రజల ముందే చెబుతాను.

యశ్వంత్ సిన్హా, సీనియర్ బీజేపీ నేత

నలభై ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీని హిందూ వ్యతిరేక, ముస్లిం పార్టీగా బీజేపీ ప్రచారం చేసింది. నిజానికి బీజేపీనే నకిలీ హిందుత్వ పార్టీ. రామమందిరంతో రాజకీయాలు చేస్తుందే కానీ, రామాలయ నిర్మాణంపై శ్రద్ధ వహించడం లేదు. రాహుల్ దేవాలయాలను దర్శిస్తే వారి పునాదులు కదులుతున్నాయని వణికిపోతున్నది.

పరేశ్ ధనాని, గుజరాత్ ప్రతిపక్ష నేత



చరిత్రలో నేడు



1820
లండన్‌లో రాయల్ ఆస్ట్రానమికల్ సొసైటీ ప్రారంభం.

1896
మొదటిసారి అమెరికాలో 'ఎక్స్-రే' ఫొటో తీసిన డాక్టర్ హెన్రీ స్మిత్.





1948
ఇంగ్లండ్‌లో మొట్టమొదటి 'సూపర్ మార్కెట్' ప్రారంభం.

అవినీతి అంతమే తమ పంతమనీ, అవినీతిపై పోరాటమే ప్రథమ కర్తవ్యమని చెప్పుకొని కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. అధికారం చేపట్టి నాలుగేండ్లు కావస్తున్నా లోక్‌పాల్, లోకాయుక్త బిల్లులు పార్లమెంటులో ఆమోదం పొందడం లేదు. అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా నిర్మిస్తామన్న అత్యున్నత నిర్ణయాత్మక కమిటీ ఊసే లేదు. కానీ బీజేపీ మాత్రం అవినీతి వ్యతిరేక పోరాటం తమ సొంతమని చెప్పుకుంటున్నది. ఈ అవినీతి వ్యతిరేక పోరాట నినాదమే కాంగ్రెస్‌ను గద్దె దింపి బీజేపీకి పట్టం కట్టింది. సుప్రీం కోర్టు కూడా లోక్‌పాల్ నియామకం చేపట్టాలని సూచించినా మోదీ మీనమేషాలు లెక్కించటం శోచనీయం.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

అమెరికా హెచ్-1బీ వీసా సమస్య కొన్నేండ్లుగా భారతీయుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. తాజాగా ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు అమెరికాలోని 7.5 లక్షల మంది భారతీయులను మరింతగా భయకంపితులను చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ ప్రభుత్వం అమెరికా కాంగ్రెస్ ముందు 4 బిల్లులను పెట్టింది. వాటితో మరింతగా వలసలను నియంత్రించాలని ట్రంప్ భావిస్తున్నారు. అమెరికన్ల కోసమే అమెరికా అంటున్న ట్రంప్ భారతీయ నిపుణులను కాదని ఏం చేస్తాడో చూడాలి. ఏదేమైనా ట్రంప్ తాను ఎక్కిన కొమ్మనే నరుక్కోడనే ఆశిద్దాం.

ది హిందూ

క్రీడా దౌత్యం

ఉద్రిక్తతలతో అట్టుడుకుతున్న కొరియా ద్వీపకల్పంలో శాంతి వచనాలు వినిపించడం హర్షం కలిగిస్తున్నది. దక్షిణకొరియాలో వచ్చే నెలలో జరిగే శీతాకాల ఒలింపిక్స్‌కు తమ క్రీడా బృందాన్ని పంపాలని ఉత్తరకొరియా నిర్ణయించింది. రెండేండ్ల పాటు ఉభయ కొరియాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉన్నది. ఈ నేపథ్యంలో సౌహార్ద్ర సూచికలు ఏ మాత్రం కనిపించినా సంతోషమే. దక్షిణకొరియా ఒలింపిక్స్ చీఫ్ ఉత్తరకొరియా బృందాన్ని ఆహ్వానించిన నేపథ్యంలో అనుకూల ప్రతిస్పందన వెలువడింది. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ ఇటీవల కొత్త సంవత్సర ప్రసంగంలో తాము దక్షిణకొరియాలో జరిగే ఒలింపిక్స్‌లో తమ ఆటగాళ్ళను పంపాలని భావిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు అనుకూలంగా స్పందించిన దక్షిణకొరియా, రెండు దేశాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు సాగితే బాగుంటుందని అభిప్రాయపడ్డది. దక్షిణకొరియా అమెరికాతో కలిసి నిర్వహించే సంయుక్త సైనిక విన్యాసాలను ఒలింపిక్స్ పూర్తయేవరకు వాయిదా వేసినట్టయితే తాము చర్చలకు సిద్ధమని కిమ్ వెల్లడించారు. రెండు కొరియాల మధ్య నిస్సైనిక మండలంలోని పన్ముంజామ్ గ్రామంలో బుధవారం రోజంతా రెండు దేశాల అధికారుల మధ్య చర్చలు సాగాయి. ఇరుపక్షాల నుంచి ఐదేసిమంది అధికారులు చర్చలు సాగిస్తుంటే వారి దేశాధినేతలు సీసీటీవీ ద్వారా తిలకించారు. ఒలింపిక్స్ క్రీడల మధ్యలో కొరియనులు జరుపుకునే చాంద్రమాన ఉగాది రానున్నది. ఈ ఉగాది వేడుకల సందర్భంగా సరిహద్దుకు ఇరువైపులా ఉన్న కుటుంబాలను కలుసుకోవడానికి అవకాశం ఇవ్వాలని దక్షిణ కొరియా ప్రతిపాదించింది. అణ్వాయుధ నియంత్రణపై చర్చించాలని దక్షిణకొరియా భావిస్తున్నది. రెండు దేశాల మధ్య అత్యవసర చర్చల కోసం హాట్‌లైన్ ఇప్పటికే ఏర్పాటయింది. క్రీడల మూలంగా ఉద్రిక్తతలు సడలితే, ఏ అంశంపై అయినా చర్చించుకోవచ్చు.

దక్షిణ కొరియాలో సైనిక స్థావరాలను పెట్టినందుకు స్పందనగా చైనా ఉత్తరకొరియా ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నదనేది అమెరికాకు తెలుసు. ఈ వైరం అమెరికా, చైనా మధ్యనే తప్ప ఉభయకొరియాల మధ్య కాదు. అందువల్ల రెండు కొరియాలు తమ విభేదాలు మరిచి సౌహార్ద్ర సంబంధాలు నెలకొల్పుకోవడం మంచిది. గతంలో టేబుల్ టెన్నిస్ ద్వారా అమెరికా చైనా మధ్య సత్సంబంధాలు ఏర్పడ్డాయి. దీనికి పింగ్‌పాంగ్ దౌత్యం అని పేరు వచ్చింది. క్రీడల ద్వారా దేశాలు దగ్గరైన ఇతర ఉదంతాలు కూడా ఉన్నాయి.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ పరస్పరం బెదిరింపులకు దిగుతున్న సందర్భంలోనే, ఉభయ కొరియాల మధ్య సౌహార్ద్ర వాతావరణం నెలకొనడం గమనార్హం. నిజానికి ఉత్తర, దక్షిణ కొరియా ప్రజల మధ్య విద్వేషాలు ఏనాడూ లేవు. కొరియా ద్వీపకల్పం రెండు దేశాలుగా విడిపోవడానికి కారణం అంతర్జాతీయ రాజకీయాలే కానీ, ప్రజలు కాదు. రెండవ ప్రపంచ యుద్ధంలో అమెరికా, సోవియెట్ యూనియన్ ఒకే పక్షాన ఉండి పోరాడినప్పటికీ, ఎవరి వ్యూహం వారికి ఉన్నది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసీముగియగానే ఈ రెండు శిబిరాలు వివిధ ప్రాంతాలలో తమ ప్రాబల్యం కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా తలపడ్డాయి. ఈ క్రమంలో పుట్టిందే కొరియా సమస్య. కొరియా ద్వీపకల్పాన్ని తమ ప్రాబల్యంలోకి తెచ్చుకోవడానికి ఉత్తరం వైపు నుంచి కమ్యూనిస్టు దళాలకు మద్దతుగా చైనా సైన్యాలు రంగంలోకి దిగాయి. సోవియెట్ యూనియన్ కూడా వీరికి తోడ్పడ్డది. దక్షిణ ప్రాంతంలో పాశ్చాత్య దేశాలు తమ బలగాలను దింపాయి. విమానాలతో కూడా చరిత్రలో ఏనాడూ లేనివిధంగా హోరాహోరీగా పోరాటం నడిచింది. 1950 జూన్ 25న మొదలైన ఈ యుద్ధం 1953 జూలై 27న ముగిసింది. ఈ భీకర పోరాటంలో ఐదు లక్షల మంది సైనికులు, పౌరులు మరణించారు. కమ్యూనిస్టు దేశంగా ఉత్తర కొరియా, అమెరికా అనుకూల దేశంగా దక్షిణకొరియా ఏర్పడ్డాయి. ఆ తరువాత కాలంలో యుద్ధం జరుగనప్పటికీ, అధికారికంగా యుద్ధ విరమణ జరుగలేదు. దక్షిణ కొరియాలో, జపాన్‌లో, అక్కడికి సమీపంలోని గువామ్‌లో అమెరికా సైనిక స్థావరాలు ఉన్నాయి. ఈ సైనిక స్థావరాల పట్ల చైనా ఆగ్రహంగా ఉన్నది. ప్రత్యేకించి దక్షిణ కొరియాలోని సైనిక స్థావరం చైనా పక్కలో బల్లెం మాదిరిగా ఉన్నది. ఈ సైనిక స్థావరాలే ఉద్రిక్తతకు దారి తీస్తున్నాయి.

ఉత్తరకొరియా ఇప్పటివరకు ఇరవైకి పైగా క్షిపణులను పరీక్షించింది. ఇందులో అత్యంత ఆధునికమైనవి, సుదూర లక్ష్యాన్ని ఛేదించేవి కూడా ఉన్నాయి. అమెరికా మీదికి అణ్వస్త్రాలను కొంచబోగలిగే ఖండాంతర క్షిపణులను కూడా ఉత్తరకొరియా పరీక్షించడం విశేషం. అత్యంత శక్తిమంతమైన అణు పరీక్షలను కూడా ఉత్తరకొరియా విజయవంతంగా జరుపగలిగింది. చైనా తోడ్పాటు లేకుండా ఉత్తరకొరియా వంటి చిన్న దేశం అణు సంపత్తిని, క్షిపణి సామర్థ్యాన్ని సాధించుకోవడం అసాధ్యం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే– చైనాయే తెర వెనుక ఉండి ఉత్తరకొరియా ద్వారా అమెరికాను హెచ్చరిస్తున్నది. దక్షిణ కొరియాలో సైనిక స్థావరాలను పెట్టినందుకు స్పందనగా చైనా ఉత్తరకొరియా ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నదనేది అమెరికాకు తెలుసు. ఈ వైరం అమెరికా, చైనా మధ్యనే తప్ప ఉభయకొరియాల మధ్య కాదు. అందువల్ల రెండు కొరియాలు తమ విభేదాలు మరిచి సౌహార్ద్ర సంబంధాలు నెలకొల్పుకోవడం మంచిది. గతంలో టేబుల్ టెన్నిస్ ద్వారా అమెరికా చైనా మధ్య సత్సంబంధాలు ఏర్పడ్డాయి. దీనికి పింగ్‌పాంగ్ దౌత్యం అని పేరు వచ్చింది. క్రీడల ద్వారా దేశాలు దగ్గరైన ఇతర ఉదంతాలు కూడా ఉన్నాయి. ఉభయ కొరియాలు కూడా శీతల ఒలింపిక్స్ ద్వారా ఉద్రిక్తతలను తగ్గించుకొని, క్రమంగా సత్సంబంధాలు నెలకొల్పుకోవాలె. పెద్ద దేశాలు గీసిన సరిహద్దును చెరిపివేసుకోవాలె.

జనగళం

క్రీడలను ప్రోత్సహించాలి

ఒలింపిక్స్ పథకాలలో అగ్రస్థానంలో ఉన్న దేశాలు అందుకోసం ఏండ్ల తరబడి వాళ్ల క్రీడాకారులను తీర్చిదిద్దుతాయి. ఒలింపిక్స్ ప్రారంభానికి ఏడాది ముందే ఆయా రంగాల్లో వాళ్ల క్రీడాకారులకు తగిన శిక్షణ ఇప్పిస్తాయి. అయితే మన దేశంలోనూ పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతున్నది. కానీ వాళ్లు ఓ స్థాయి గుర్తింపు తెచ్చుకునేదాకా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రాధాన్యం దక్కడం లేదు. మన దేశం క్రీడల్లో ఇతర దేశాలకు దీటుగా రాణించాలంటే గ్రామీణస్థాయి నుంచి క్రీడాకారులను గుర్తించాలి. వాళ్లకు తగిన శిక్షణ ఇప్పించాలి.

- జి.రాజశేఖర్, నల్గొండ

పెరుగుతున్న డ్రాపౌట్లు

ప్రాథమిక విద్య స్థాయిలోనే డ్రాపౌట్ల సంఖ్య పెరిగిపోతున్నది. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు చేపట్టాయి. వాటివల్ల ఫలితాలు వస్తున్నాయి.అయితే డ్రాపౌట్లను తగ్గించడానికి ఇవి సరిపోవు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం దీన్ని సీరియస్‌గా పరిగణించాలి. ఏ రాష్ట్రాల్లో ఎక్కువ డ్రాపౌట్లు ఉంటున్నాయో సమగ్ర నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టాలి. అప్పుడే వంద శాతం అక్షరాస్యత సాధ్యమౌతుంది.

- చందన రవికుమార్, మహబూబ్‌నగర్

మేల్కోవాల్సిన సమయం

దేశంలోని ప్రధాన నగరాల్లో కాలుష్యం పెరిగిపోయిందని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. కాలుష్యం పెరిగిపోవడం వల్ల ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో ఢిల్లీలో ప్రజల ఇక్కట్లు మనకు కనిపించాయి. కాబట్టి ప్రభుత్వాలు, పౌర సమాజం మేల్కొవాలి. కాలుష్య నివారణకు కోసం చెట్లను విపరీతంగా పెంచాలి.

- డి.ప్రణీత, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

విశ్లేషణ



సబా నఖ్వీ

మహారాష్ట్ర ఘర్షణలు-వక్రీకరణలు

మహారాష్ట్రలో ఈ మధ్య జరిగిన ఘర్షణల విషయంలో మీడియా, కొంతమంది రాజకీయ నాయకుల వ్యక్తీకరణలు ఆందోళన కలిగించేవిగా ఉన్నాయి. దళితులు, మరాఠాల మధ్య జరిగిన ఘర్షణలుగా చిత్రీకరించే ప్రయత్నంలో వారు అసలు నిజాలను కావాలనే వక్రీకరణకు పాల్పడ్డారు. ఇక ఆ సమావేశంలో పాల్గొనడానికి వచ్చి ప్రసంగించిన జిగ్నేష్ మేవానీపై రెచ్చగొట్టే విధంగా ప్రసంగించాడనే ఆరోపణలతో కేసులు కూడా బనాయించారు. బీజేపీని కొత్త పీష్వాలుగా చిత్రీకరించి మేవానీ ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టాడని వారు ఆరోపించారు.

జిగ్నేశ్ మేవానీ మాత్రం తన పోరాటాన్ని 2019 దాకా కొనసాగించి వీధి పోరాటంగా మలుస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో జిగ్నేశ్ మేవానీ వాదనకు పూర్తి ప్రాసంగికత ఉన్నది. ఆయన చెబుతున్న విషయాలకు సహేతుకమైన పునాది ఉన్నది. బీజేపీ నేతలు చరిత్రను తవ్వి ముస్లిం రాజుల చరిత్రలను వారి సమాధుల నుంచి తవ్వి తీసి కొత్త భాష్యాలు చెబుతున్నారు. అది ఔరంగాజేబ్, బాబర్ నుంచి మొదలుపెట్టి టిప్పుసుల్తాన్ దాకా వారి పాలనా కాలం నుంచి విడదీసి అప్పటి ఘటనలకు కొత్త (వక్ర)భాష్యం చెబుతున్నారు. ఇదంతా కర్ణాటకలో రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ చేస్తున్న దాష్టీకమని మేవానీ ఆరోపిస్తున్నారు.

ఇదిలా ఉంటే.. బీజేపీ నేతలను, మరి కొంతమంది మీడియా వ్యక్తులను కొత్త పీష్వాలని ఎందుకు అంటున్నారో చూడాలి. దీనికోసం మనం కొంత చరిత్రలోకి పోయి చూడాలి. చరిత్రలో పీష్వాలు మహారాజ ఛత్రపతి శివాజీ పాలనలో ప్రధానులుగా పని చేశారు. కాలక్రమంలో ఈ చిత్పవన్ బ్రాహ్మణులే చిన్నచిన్న సామంత ప్రభువులుగా పాలనాధికారాన్ని చేజిక్కించుకున్నారు. వీరంతా ఇలా స్థానిక ప్రభువులుగా చలామణి అవుతూ చక్రవర్తి కింద తమ పాలనాధికారాలను చలాయించారు. ఇలా ఛత్రపతి రాజ్యంలో మెజార్టీ భూ భాగాన్ని పాలనలో తమ గుప్పిట పెట్టుకున్నారు. ఇలాంటి చరిత్ర నేపథ్యంతోనే సంజయ్‌లీలా బన్సాలీ 'బాజీరావ్ మస్తానీ' సినిమా తీశారు. ఈ కథానుసారం పీష్వా సామ్రాజ్యంలో బాజీరావు ఒక ప్రఖ్యాత మిలిటరీ హీరో. హిందూ పాదుషాగా పేరుగాంచారు. అయినా ఆయన తను రెండో భార్యగా మస్తానీని స్వీకరించి రాజ్యపాలన కొనసాగించాడు. ఇలాంటి చారిత్రక దాఖలాల నుంచే బీజేపీ చేస్తున్న కండబలం రాజకీయాలను చెప్పటానికి వారిని నయా పీష్వాలు అని పిలుస్తున్నారు. కానీ ఇప్పుడు బీజేపీ దీనికి విరుద్ధంగా లవ్ జీహాద్‌ను చేస్తున్నది.

చారిత్రక ఆధారాల ప్రకారం చూస్తే.. శివాజీ తన సైన్యంలో చాలా మందిని మహర్ల(దళితులు)ను సైనికులుగా నియమించారు. అయితే ఆయన పాలనలో అధికారం చలాయించిన పీష్వాలు పరమ క్రూరంగా పాలనాధికారాలు కొనసాగించారని తెలుస్తున్నది. ముఖ్యంగా దళితుల పట్ల చాలా హీనంగా, క్రూరంగా ప్రవర్తించారు. వారు దళితులను జంతువులకన్నా హీనంగా చూసేవారు. దళితులు నడిచిపోతున్న పాద ముద్రలు కనపడకుండా ఉండేందుకు వారి వెనుకాల చీపిరి కట్టి ఉండాలని కట్టడి చేశారు. ఇలాంటి పీష్వాల పీడన పాలనపై బ్రిటిష్ వారి గెలుపును తమ గెలుపుగా దళితులు భావించారు. ఆ క్రమంలోనే పీష్వాలమీద గెలుపును తమ ఆత్మగౌరవ ప్రతీకగా కూడా భావించారు. ఆ ఘటన జరిగిన 1818ని తమ విజయోత్సవంగా జరుపుకుంటున్నారు. ఈ విజయోత్సవ సభ పుణెకు 30 కిలోమీటర్ల దూరంలోని భీమా కోరేగావ్‌లో జరిగింది. ఈ సభ సందర్భంగానే ఇటీవలి మహారాష్ట్ర ఘర్షణలు.

ఇలాంటి చారిత్రక, వర్తమాన పరిస్థితుల నేపథ్యంలోంచే ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ శక్తులను ఆధునిక పీష్వాలని పిలువటం పరిపాటి అయ్యింది. ఇలా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులను జిగ్నేశ్ మేవానీ మాత్రమే మొదటిసారి అనలేదు. ఇంతకుముందు అనేకమంది సామాజిక శాస్త్రవేత్తలు, మేధావులు మతవాదశక్తులను పిలిచారు. ఆ నేపథ్యంలోంచే జిగ్నేశ్ వారిని ఆధునిక పీష్వాలు అని పిలిచారు. ఇలాంటి సామాజిక పరిస్థితులలోంచే ఆధునిక సామాజిక ఉద్యమకారులు జ్యోతిబాయి పూలే, సావిత్రిబాయి పూలే, అంబేద్కర్ లాంటి వారు మహర్ల హక్కుల కోసం ఉద్యమించారు. ఆధునిక బ్రాహ్మణీయ పీష్వాలకు వ్యతిరేకంగా పోరాడారు.



చుతూ ప్రజలను కూడగడుతూ హిందుత్వం వెనుక నిలబెట్టేందుకు పావులు కదుపుతున్నారు. ఈ సందర్భంగా మనకొక సామెత గుర్తుకు వస్తున్నది. 'షోలే' సినిమా నడుస్తున్న కాలంలో తల్లులు తమ పిల్లలను నిద్ర పుచ్చేందుకు గబ్బర్‌సింగ్ వస్తున్నాడని చెప్పి భయపెట్టి నిద్రపుచ్చేవారు. ఇప్పుడు కూడా అదే మరో రూపంలో జరుగుతున్నది. ఇప్పుడు గబ్బర్ సింగ్‌లు సామాజిక సమూహాలనే భయకంపితులను చేస్తున్నారు. కాకుంటే నేటి గబ్బర్‌సింగ్‌లు గడ్డంతో, తలపై టోపీతో ఉంటున్నారు.

ఈ సందర్భంగానే మనం గమనించాల్సిన విషయమేమంటే.. కోరేగావ్ ఘటన తర్వాత జరిగిన ఘర్షణలు, ఆ నేపథ్యంలో అక్కడి ప్రజలకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన జిగ్నేశ్ మేవానీ, జేఎన్‌యూ విద్యార్థి నేత ఉమర్ ఖలీద్ వచ్చారు. వారిపై టీవీ యాంకర్లు చేసిన దుష్ప్రచారం అంతా ఇంతా కాదు. దేశ విభజనకారులు వచ్చి ప్రజలను రెచ్చగొడుతున్నారని మీడియా ప్రజలను రెచ్చగొట్టింది. తప్పుడు సమాచారంతో వక్రమార్గం పట్టించింది. ప్రకాశ్ అంబేద్కర్ నిర్వహించిన సంఘీభావ సభలో పాల్గొని ప్రసంగించారు. దాన్నికూడా మీడియా వక్రీకరించటం చూస్తే ఆధునిక పీష్వాల తీరు ఎలా ఉన్నదో అర్థమవుతున్నది.

ప్రస్తుత పరిస్థితుల్లో దళితుల సమస్యలపై స్పందించటానికి ఏదో

దళితుల సమస్యలపై స్పందించటానికి ఏదో మూల దళిత నాయకత్వం ఉన్నది. అనేక రూపాల్లో దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను ప్రశ్నిస్తున్నారు. ఎదిరిస్తున్నారు.కానీ ముస్లింలపై జరుగుతున్న దాడుల గురించి మాట్లాడేవారే కరువయ్యారు. ఎవరు ముస్లింల గురించి గొంతెత్తినా వారి దేశభక్తిని శంకిస్తారు. ముస్లిం లు తమ హక్కులకోసం నినదిస్తే వారు సమాజాన్ని అస్థిరత్వం చేస్తున్నారని, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని చెబుతారు. ఇలాంటి దృక్పథం నుంచే దళితులు నిర్వహించుకునే భీమా కోరేగావ్ 200వ ఉత్సవాలపై హిందుత్వశక్తులు దాడులు చేశారు.

ఇవన్నీ గతకాలపు వాదనలని ఎవరైనా వాదించవచ్చు. కానీ వర్తమాన కాలంలో జరుగుతున్న హింసను గురించి ఆలోచించాల్సి ఉన్నది. హింసకు కారకులను గుర్తించాల్సి ఉన్నది. గత కొన్నేండ్లుగా ముస్లింలను లక్ష్యంగా చేసుకొని సాగిస్తున్న హింసాకాండ, దాడులను గురించి చర్చించాలి. గత మూడేండ్లుగానైతే ముస్లింలు లక్ష్యంగా అనేక సందర్భాల్లో దాడులు జరిగాయి, జరుగుతున్నాయి. దాడులు ముస్లింల వరకే పరిమితం కావటం లేదు. సమాజంలోని మేధా శక్తులను లక్ష్యంగా చేసుకొని దాడులు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోంచే నరేంద్ర దభోల్కర్, గోవింద్ పన్సారే, ఎంఎం కల్బుర్గీ లాంటి హేతువాద మేధావులను అంతమొందించారు. దేశవ్యాప్తంగా విమర్శనాత్మక మేధాశక్తులపై కనిపించని నిషేధం, దాడిని అమలు చేస్తున్నారు.

ఈ క్రమంలోనే హిందుత్వ శక్తులు ముస్లింలను లక్ష్యంగా చేసుకొని చేస్తున్న దాడులతో హిందువులను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే కుల ప్రాతిపదికపై ఒకరిపై ఒకరికి వ్యతిరేకత పెంమూల దళిత నాయకత్వం ఉన్నది. అనేక రూపాల్లో దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను ప్రశ్నిస్తున్నారు. ఎదిరిస్తున్నారు.కానీ ముస్లింలపై జరుగుతున్న దాడుల గురించి మాట్లాడేవారే కరువయ్యారు. ఎవరు ముస్లింల గురించి గొంతెత్తినా వారి దేశభక్తిని శంకిస్తారు. ముస్లింలు తమ హక్కులకోసం నినదిస్తే వారు సమాజాన్ని అస్థిరత్వం చేస్తున్నారని, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని చెబుతారు. ఇలాంటి దృక్పథం నుంచే దళితులు నిర్వహించుకునే భీమా కోరేగావ్ 200వ ఉత్సవాలపై హిందుత్వశక్తులు దాడులుచేశారు. ఇప్పటికైనా హిందుత్వావాదులు తమ వాదనలోని అసలు నిజాలను తెలుసుకోవాలి. దళిత, వెనుకబడినవర్గాలు చేస్తున్న హక్కుల పోరాటాలను గుర్తించాలి. గౌరవించాలి. ఇలా చేసినప్పుడే నిజమైన సామాజిక శాంతి నెలకొంటుంది. దళిత ఉద్యమాలను నిందాపూర్వకంగా తిరస్కరించినంత కాలం ఇలాంటి ఉద్యమాలు ఉబికి వస్తూనే ఉంటాయి.

(వ్యాసకర్త: రచయిత, ప్రముఖ జర్నలిస్టు) ndtv.com నుంచి..

స్కూలు బ్యాగు బరువు నివారించవచ్చు

విద్య

ప్రొఫెసర్ కనకదుర్గ దంటు

ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో కర్ణాటక రాష్ట్రంలో ఒకరోజు స్కూలు బ్యాగు లేకుండా పిల్లలకు స్కూలు నడిపే విధానాన్ని గురించిన వార్త వచ్చింది. ప్రభుత్వం తలుచుకుంటే ఈ స్కూలు బ్యాగు మోతకు శాశ్వత పరిష్కారాలు ఉన్నాయి. దానివల్ల విద్య కూడా గుణాత్మకంగా గరుపవచ్చు. ఒక హైస్కూలులో ఈ వ్యాసకర్త ఎకడమిక్ అడ్వైజర్‌గా పనిచేసినపుడు ఈ బ్యాగు బరువు తగ్గించే పద్ధతులు ప్రవేశపెట్టడమైనది. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించటానికి పూనుకున్నారు గనుక సమస్యను తేలికగా పరిష్కరించవచ్చు. అసలు సమస్య ఏమిటో చూద్దాం.

ఒకటో తరగతి నుంచి పదవ తరగతిదాకా కనీసం ఆరు సబ్జెక్టులు ఉంటాయి. మూడు భాషలు (తెలుగు, ఇంగ్లీష్, హిందీ), సామాన్య, సాంఘిక శాస్త్రాలు, లెక్కలు. ఈ టెక్స్ట్ బుక్స్ రోజూ విద్యార్థులు తీసుకెళ్లాలి. ఇంక వాటికి క్లాస్‌నోట్ బుక్స్ 6, హోంవర్క్ బుక్స్ 6, మొత్తం 6 టెక్స్ట్ బుక్స్, 12 నోట్‌బుక్స్. ఇంకా టెక్నో స్కూల్స్, ఈ–స్కూల్స్, మిషనరీ స్కూళ్లల్లో ఇంకో రెండు, మూడు సబ్జెక్టులు ఎక్కువగా ఉంటాయి. మినరల్ నాలెడ్జ్, మోరల్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అంటూ ఇంకో రెండు మూడు టెక్స్ట్ బుక్స్, వాటి నోట్‌బుక్స్ ఉంటాయి. ఇవి కాక 1 డైరీ, 1 రఫ్ నోట్‌బుక్! అంటే 18 నుంచి 24 దాకా!

ఇక రెండవ సమస్య ఒకరోజులో అని సబ్జెక్టులు చెప్పాలా అన్నది. నిజానికి మనో వైజ్ఞానికులు చెప్పే సిద్ధాంతం ప్రకారం ఒక అంశం నుంచి వేరొక అంశం మీదికి దృష్టి మరల్చాలంటే కనీసం 20 నిమిషాలు పడుతుంది. అలాంటిది మన పాఠశాలల్లో 40 లేక 50 నిమిషాల నిడివి ఉన్న పీరియడ్స్‌ను పెట్టి ఒకదాని తర్వాత ఒక సబ్జెక్టు చెప్పుకుంటూపోతే అసలు పిల్లలకు ఎంత అర్థమవుతుంది? వాళ్ళు టీచర్ చెప్పేదానిమీద ఎంత ఫోకస్ పెట్టగలుగుతారు? ఆ పీరియడ్ అయిపోయి, ఇంకో పీరియడ్ మొదలు పెట్టేసరికి ఎంత వారికి బుర్రకెక్కి, గుర్తుంటుంది? విద్యారంగం, మనో వైజ్ఞానిక రంగంలోని నిపుణులు, పరిశోధకులు చెప్పే ఒక అంశం గుర్తించటం చాలా ముఖ్యం. ఏదైనా ఒక అంశం నేర్చుకున్నప్పుడు, దాని మీద కొన్ని యాక్టివిటీస్ చేస్తే, ఎక్కువ సమయం దాని గురించి ఆలోచిస్తే ఆ అంశం మీద వారికి అవగాహన పెరిగి గుర్తుండిపోతుంది. అందుకే ప్రతి పీరియడ్ కనీసం గంటన్నర చేసిన ఒక అంశం మీద విద్యార్థులకు పూర్తి పట్టు వచ్చేవరకు రకరకాల యాక్టివిటీస్‌తో వారికి ఉత్సాహం కలిగేటట్టు ఆ అంశాన్ని బోధించాలి. ఉదాహరణకు ఆరు సబ్జెక్టులు–మూడు భాషలు, సాంఘిక, సామాన్య శాస్త్రాలు, లెక్కలు–ఉన్నాయనుకోండి. ఇప్పుడు టైంటేబుల్ ఈ విధంగా ఉంటుంది. రోజూ ప్రతి సబ్జెక్టు 50 నిమిషాల చొప్పున 6 పీరియడ్స్‌లో బోధించడం జరుగుతుంది. చిన్న పీరియడ్ వల్ల ఈ కింది నష్టాలు ఉంటాయి.

1.టీచర్లు తాము బోధించవలసిన అంశాలు బోధించడమే కానీ పిల్లలకు వాటిగురించి ఆలోచించే సమయం ఇవ్వలేరు, అంశం గురించి ఆలోచించే సమయంలో విద్యార్థులకు అవగాహన దాని అంశాల మీద ప్రశ్నలడిగే అవకాశం ఉండదు. ఒకదానివెంట ఒకటి అన్ని సబ్జెక్టులు చెప్పడంతో అవి పిల్లల మెదడులో కలగాపులగమౌతాయే కానీ సరైన అవగాహన రాదు. వారంలో ఒక పాఠం పూర్తిచేసి దానిమీద ప్రశ్నలడగాలన్నా యాక్టివిటీస్ చేయించాలన్నా మొదట చెప్పిన అంశాలు పిల్లల బుర్రల్లో మరుగున పడుతాయి. ఉదాహరణకు 6 పేజీల పాఠం ఉందనుకుంటే గంటన్నర పీరియడ్‌లో 1 పేజీ బోధించడం పూర్తిచేసి, దాని మీద ప్రశ్నలు, జవాబులు, కొత్త పదాలు, ఊహాజనితమైన ప్రశ్నలు అన్ని పూర్తి చేయవచ్చు. రోజూ చిన్న పీరియడ్లలో ప్రతి సబ్జెక్టు చెపితే వారానికి 6 పీరియడ్లు (300 నిమిషాలు) వస్తాయి. అలాగే గంటన్నర పీరియడ్స్ చేసి ప్రతి సబ్జెక్టు వారానికి 4 సార్లు బోధిస్తే అంతకంటే ఎక్కువ సమయం వస్తుంది (90X4=360) పైగా ఒక అంశం/ లెక్కను ధరోగా చదివి, అర్థం చేసుకొని, దానిమీద యాక్టివిటీస్ చేస్తే అది జ్ఞాపకం ఉంటుంది. ఉపాధ్యాయులకు కూడా ప్రతి యాభై నిమిషాలకు ఒక క్లాసు నుంచి ఇంకొక క్లాసులోకి మారడంతో వృథా అయ్యే సమయం కూడా కలిసివస్తుంది.

5వ తరగతి దాకా పిల్లలకు 3 భాషలూ మాట్లాడటం, చదువటం, రాయటం వచ్చేటట్టు బోధించాలి. లెక్కలు కూడా 5వ తరగతి దాకా బోధించాలి. కథలు చెప్పటం, పాటలు, పద్యాలు పాడటం, ఊహాజనిత విషయాల గురించి రాయటం వంటివి అప్పటిదాకా బోధించాలి, శిక్షణనివ్వాలి. స్పష్టంగా సరైన ఉచ్చారణ చేయటం, తప్పులు లేకుండా మూడు భాషలలోనూ తేలికపాటి పదాలు, వాక్యాలు ఉపయోగించి రాయటం, స్వయంగా చదువటం 5వ తరగతి అయ్యే సమయానికి గరిపితే, 6వ తరగతి నుంచి వారు విన్నది, చదివినది వారే అర్థం చేసుకుంటారు.

2. ఇక పుస్తకాల మోత గురించి కూడా సంస్కరణలు ప్రవేశపెట్టొచ్చు. విద్యార్థుల టెక్స్ట్ బుక్స్, క్లాసు నోట్‌బుక్స్ క్లాసులలోనే చదివి వెళ్లే ఏర్పాటుచేస్తే బాగుంటుంది. కూర్చున్న కుర్చీకి చిన్న డెస్క్ అమర్చి తాళం వేసుకునే సౌకర్యం కల్పిసే వారు ఆయా పీరియడ్స్‌లో అవి తీసుకొని ఉపయోగించుకుని మళ్లీ అందులోనే పెట్టుకొని తాళం వేసుకుంటారు. ఆ తాళాన్ని క్లాసు డైరీకి దారంతో కట్టే ఏర్పాటు చేయాలి. వారమంతా వారు క్లాసులో ఏం చదివారో, ఏమి అర్థమయిందో ప్రశ్నలు వారికి ప్రతిరోజూ క్లాస్ రఫ్ నోట్‌బుక్‌లో రాసుకొని ఇంటికెళ్లి హోంవర్క్ బుక్‌లో రాయమనాలి. అలా వారమంతా రాసినది వారంలో ఒకరోజు స్కూలుకు తీసుకురావాలి. ఆ హోంవర్క్ బుక్స్ తెచ్చేది కూడా రోజుకు మొదటి పీరియడ్ ఉన్న సబ్జెక్టు తెస్తే, ఆయా టీచర్లు ఆ రోజు మర్నాడు కరెక్షన్స్ పూర్తిచేసి ఇచ్చేస్తారు. ఈ విధంగా అయితే రోజూ విద్యార్థి పుస్తకాలు మాత్రమే మోసుకురావాలి. అవి.. క్లాస్ డైరీ, క్లాస్ రఫ్ నోట్‌బుక్, ఆ రోజు సబ్మిట్ చేయాల్సిన హోంవర్క్ నోట్‌బుక్. మళ్లీ ఇంటికి వెళ్లేటప్పుడు మూడు పుస్తకాలే ఉంటాయి.. క్లాస్ డైరీ, రఫ్ నోట్‌బుక్, టీచర్ కరెక్ట్ చేసి ఇచ్చిన హోంవర్క్ బుక్. ఈ రకంగా చేస్తే విద్యార్థులు హోంవర్క్ చేయటానికి తాము అవగాహన చేసుకున్న విషయాలు టెక్స్ట్ పుస్తకం, క్లాస్ నోట్ పుస్తకం లేకుండా రాయాలి కాబట్టి క్లాసులో ఎక్కువ దృష్టిని కేంద్రీకరిస్తారు. ఇంట్లో పెద్దవాళ్ళ పోరు లేకుండానే వెళ్ళగానే తన హోంవర్క్ తాను చేసుకుంటాడు (మర్చిపోతానేమో అన్న భయంతో). టీచర్ల ఇచ్చే ప్రశ్నలు కూడా వారి అవగాహన, విమర్శనాశక్తి, విశ్లేషణాశక్తి, ఊహాశక్తి ఉపయోగించి రాసేవిధంగా ఉంటే, ఇప్పుడు నడుస్తున్న రోట్ లర్నింగ్ పోయి, పిల్లల మేధ, ఆలోచనాశక్తి, ధారణ పెరుగుతాయి. ఎంతసేపు టెక్స్ట్ బుక్‌లోంచో, టీచర్ రాయించిన నోట్స్‌లోంచో కాకుండా తమ ఆలోచనలను విస్తృతం చేసుకునే అవకాశం పిల్లలకు ఇచ్చినట్టవుతుంది.

3. పైన చెప్పినవి జరుగాలంటే ఆ విధానాన్ని 6వ తరగతి నుంచి అమలుచేయాలి. 5వ తరగతి దాకా పిల్లలకు 3 భాషలూ మాట్లాడటం, చదువటం, రాయటం వచ్చేటట్టు బోధించాలి. లెక్కలు కూడా 5వ తరగతి దాకా బోధించాలి. కథలు చెప్పటం, పాటలు, పద్యాలు పాడటం, ఊహాజనిత విషయాల గురించి రాయటం వంటివి అప్పటిదాకా బోధించాలి, శిక్షణనివ్వాలి. స్పష్టంగా సరైన ఉచ్చారణ చేయటం, తప్పులు లేకుండా మూడు భాషలలోనూ తేలికపాటి పదాలు, వాక్యాలు ఉపయోగించి రాయటం, స్వయంగా చదువటం 5వ తరగతి అయ్యే సమయానికి గరిపితే, 6వ తరగతి నుంచి వారు విన్నది, చదివినది వారే అర్థం చేసుకుంటారు. దానిగురించి భయం, బెరుకు లేకుండా మాట్లాడగలుగుతారు, రాయగలుగుతారు.

ఈ విధానాలు ప్రవేశపెట్టి, అవి ఎలా పాటించి, బోధించాలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తే, తెలంగాణలో పాఠశాల విద్యారంగం చాలా బలోపేతమవుతుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నేడు నింగిలోకి ఇస్రో 100వ ఉపగ్రహం

మరో 30 శాటిలైట్లు కూడా • పీఎస్ఎల్వీ-సీ40కి కౌంట్‌డౌన్ ప్రారంభం



న్యూఢిల్లీ, జనవరి 11: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపడుతున్న 100వ ఉపగ్రహ ప్రయోగానికి అంతా సిద్ధమైంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి శుక్రవారం ఉదయం 9.28 గంటలకు పీఎస్ఎల్వీ-సీ40 నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈమేరకు 28గంటల కౌంట్‌డౌన్ గురువారం ఉదయం 5:29 గంటలకు ప్రారంభమైంది. గత ఏడాది ఆగస్టు 31న పీఎస్ఎల్వీ-సీ39 ప్రయోగం విఫలమైన నేపథ్యంలో ఈసారి ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు ఇస్రో అన్ని చర్యలూ తీసుకున్నది. పీఎస్ఎల్వీ -సీ40 వాహక నౌక ద్వారా 710 కిలోల బరువున్న స్వదేశీ వందో ఉపగ్రహం కార్టోశాట్-2ను శాస్త్రవేత్తలు ధ్రువ సూర్య అనువర్తిత కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. దీంతోపాటు 613కిలోల బరువున్న మరో 28 విదేశీ, రెండు స్వదేశీ ఉపగ్రహాలను ఒకేసారి రోదసిలోకి పంపనున్నారు. కార్టోశాట్‌తోపాటు నింగిలోకి ప్రవేశించనున్న రెండు దేశీయ ఉపగ్రహాల్లో ఒకటి మైక్రోశాటిలైట్ కాగా, మరొకటి నానో శాటిలైట్. ఇక విదేశీ ఉపగ్రహాల్లో అమెరికా, ఫ్రాన్స్, కెనడా, దక్షిణ కొరియా, బ్రిటన్, ఫిన్లాండ్ దేశాలకు చెందిన మూడు మైక్రో, 25 నానో శాటిలైట్లు ఉన్నాయి. షార్ డైరెక్టర్ పి కున్హికృష్ణన్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు (ఎల్ఆర్బీ) గురువారం ప్రయోగానికి సంసిద్ధత తెలిపింది.

సీఐఎస్‌సీఈ స్కూళ్లలో 10, 12వ తరగతుల పాస్ మార్కులు తగ్గింపు



కోల్‌కతా: ఈ విద్యాసంవత్సరం (2017-18) నుంచి 10వ, 12వ తరగతుల్లో పాస్ మార్కులను తగ్గిస్తున్నట్టు కౌన్సిల్ ఫర్ ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ (సీఐఎస్‌సీఈ) వెల్లడించింది. ఈ మేరకు సీఐఎస్‌సీఈ కార్యదర్శి, సీఈవో గెర్రీ అరాథూన్ గురువారం ఆదేశాలు జారీచేశారు. పదోతరగతి (ఐసీఎస్ఈ) విద్యార్థుల పాస్ మార్కులను 35 శాతం నుంచి 33 శాతానికి.. పన్నెండో తరగతి (ఐఎస్‌సీ) విద్యార్థుల పాస్ మార్కులను 40 శాతం నుంచి 35 శాతానికి తగ్గిస్తున్నట్టు పేర్కొన్నారు. పాస్ మార్కుల తగ్గింపు ఇదే విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి వస్తుందని వెల్లడించారు. ఈ నోటీసులను సీఐఎస్‌సీఈ ఆధ్వర్యంలోని అన్ని పాఠశాలలకు పంపించారు. పదోతరగతి పరీక్షలను ఫిబ్రవరి 26 నుంచి మార్చి 28 వరకు.. పన్నెండో తరగతి పరీక్షలను ఫిబ్రవరి 7 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్నారు. ఈ ఏడాది కొన్ని రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను బట్టి పరీక్షల తేదీలు మారే అవకాశం ఉన్నదని సీఐఎస్‌సీఈ అధికారులు వెల్లడించారు.

యండమూరి రఘునందన్‌కు వచ్చేనెల మరణశిక్ష

- ఫిబ్రవరి 23న అమెరికాలో అమలు
- బామ్మను, మనవరాలిని కిరాతకంగా చంపిన రఘునందన్ యండమూరి
- మారటోరియం వల్ల శిక్ష తప్పవచ్చు: మీడియా



న్యూయార్క్, జనవరి 11: ఓ వృద్ధురాలు, ఆమె మనవరాలిని కిరాతకంగా హత్య చేసిన కేసులో మరణదండనకు గురైన ప్రవాస భారతీయుడు రఘునందన్ యండమూరి (32)కి ఫిబ్రవరి 23న శిక్షను అమలు చేయనున్నామని పెన్సిల్వేనియా అధికారులు గురువారం ప్రకటించారు. ఓ ప్రవాస భారతీయుడికి అమెరికాలో మరణశిక్షను అమలు చేయడం ఇదే మొదటిసారి కానున్నది. విషపు ఇంజెక్షన్ ఇచ్చి రఘునందన్‌కు మరణశిక్ష అమలు చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇంజినీరింగ్ విద్యనభ్యసించిన ఆంధ్రప్రదేశ్ నివాసి రఘునందన్ హెచ్1బీ వీసాపై అమెరికాకు వెళ్లాడు. జూదం వ్యసనంతో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. దీంతో 2012లో డబ్బు కోసం వెన్న సాన్వీ అనే పది నెలల పాపను కిడ్నాప్ చేశాడు. ఈ క్రమంలో తనకు అడ్డు వచ్చిన పాప నాయనమ్మ వెన్న సత్యవతి (61)ని హత్య చేశాడు. పోలీసులు అరెస్టు చేసి విచారించినప్పుడు తనకు ఏ పాపం తెలియదని అన్నాడు. చివరికి, పాప ఏడుపును ఆపేందుకు ఆమెను ఒక సూట్‌కేసులో బంధించానని చెప్పాడు. అప్పటికి మూడు రోజులు గడువడంతో పాప సూట్‌కేసులోనే మృతి చెందింది. రఘునందన్‌పై రెండు హత్య అభియోగాలను మోపిన పెన్సిల్వేనియా కోర్టు 2014లో అతడికి మరణశిక్ష విధించింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల 23న శిక్షను అమలు చేయనున్నామని అధికారులు ప్రకటించారు. అయితే పెన్సిల్వేనియా గవర్నర్ టామ్ వుల్ఫ్ 2015లో మరణశిక్షలపై మారటోరియం (నిలుపుదల) విధించినట్టు స్థానిక 'టైమ్స్ హెరాల్డ్' పత్రిక గుర్తు చేసింది. మరణశిక్షలపై స్థానిక టాస్క్‌ఫోర్స్, సలహా కమిటీ అధ్యయనం చేస్తున్నాయని, వాటి నివేదిక అందేవరకు రఘునందన్‌కు శిక్ష అమలు కాకపోవచ్చని ఆ పత్రిక అభిప్రాయపడింది. పెన్సిల్వేనియాలో 1999 తరువాత ఇంతవరకు మరణశిక్షను అమలు చేయలేదు.

కేరళ సీఎంకు సుప్రీంకోర్టు నోటీసులు



ఢిల్లీ: కేరళ సీఎం పినరాయి విజయన్‌కు సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. 'ఎస్సెన్సీ లవలీన్' అవినీతి కేసులో నిందితులుగా ఉన్న విజయన్, మరో ఇద్దరికి గురు వారం నోటీసులు జారీ చేసింది. 1995లో విజయన్ విద్యుత్ శాఖమంత్రిగా ఉన్నప్పుడు రూ.374 కోట్ల విలువైన జల విద్యుత్ ప్రాజెక్టుల ఆధునీకరణ పనుల్లో కెనడా సంస్థకు అనుకూలంగా వ్యవహరించారని సీబీఐ కేసు పెట్టింది.

ఖైదీలు అవయవదానం చేయొచ్చు

కేరళ రాష్ట్రప్రభుత్వం అనుమతి

తిరువనంతపురం: కొన్ని షరతులకు లోబడి జైళ్లలో ఉన్న ఖైదీలు తమ అవయవాలను దగ్గరి బంధువులకు దానం చేయడానికి కేరళ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అవయవదానానికి వీలుగా కేరళ జైళ్ల చట్టానికి సవరణలు చేయనున్నారు. ఖైదీల అవయవదానానికి కోర్టు, వైద్యమండలి అనుమతి తప్పనిసరి. వారు దవాఖానలో ఉండే కాలాన్ని పెరోల్‌గా పరిగణిస్తారు.

ప్రధాని మార్ఫింగ్ ఫొటో షేర్ చేసినందుకు.. బీహార్‌లో పోలీసు అధికారి సస్పెన్షన్

ఖగారియా: అభ్యంతరకరంగా ఉన్న ప్రధాని మోదీ మార్ఫింగ్ ఫొటోను వాట్సాప్‌లో ఇతరులతో పంచుకున్నందుకు బీహార్‌లోని ఖగారియాలో ఓ పోలీసు అధికారి సస్పెండ్ అయ్యారు. ఉగ్రవాది హఫీజ్ సయీద్‌తో మోదీ కరచాలనం చేస్తున్నట్లున్న ఫొటోను జేడీయూ పార్టీ వాణిజ్య విభాగం వాట్సాప్ గ్రూప్‌లో ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఇస్లాం షేర్ చేశారు. దీంతో ఇన్‌స్పెక్టర్‌ను విధుల్లోంచి తొలిగించాలని డీఐజీ ఆదేశాలు జారీచేశారని ఎస్పీ మీను కుమారి తెలిపారు.

ఎయిర్‌పోర్ట్ రన్‌వేపై ఆవు సంచారం

రెండు విమానాలకు తృటిలో తప్పిన ప్రమాదం

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమానాశ్రయంలో రన్‌పైకి గురువారం ఉదయం ఓ ఆవు రావడంతో రెండు విమానాలకు తృటిలో పెనుప్రమాదం తప్పింది. పైలట్లు అప్రమత్తంగా వ్యవహరించి గల్ఫ్ నుంచి వచ్చిన అంతర్జాతీయ విమానంతోపాటు కార్గో విమానాన్ని కూడా దారి మళ్లించి ముంబైలో దింపారు. ఈ ఘటనను భారత విమానయాన సంస్థ చైర్మన్ గురుప్రసాద్ మహాపాత్ర ధ్రువీకరించారు. సరుకులు నిల్వ ఉంచే ప్రాంతం నుంచి ఓ ఆవు ఎయిర్‌పోర్ట్ లోపలికి ప్రవేశించిందని తెలిపారు.



సిక్కుల ఊచకోత కేసులపై.. జస్టిస్ ధింగ్రా నేతృత్వంలో సిట్

న్యూఢిల్లీ: సిక్కుల ఊచకోతకు సంబంధించిన 180కి పైగా కేసుల పునర్విచారణకు సుప్రీంకోర్టు గురువారం త్రిసభ్య ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ప్రకటించింది. ఢిల్లీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎన్ ధింగ్రా నాయకత్వం వహించనుండగా, ఐపీఎస్ అధికారి అభిషేక్ దులార్, రిటైర్డ్ ఐజీ రాజ్‌దీప్‌సింగ్ సభ్యులుగా ఉంటారు. మార్చి19 నాటికి స్టేటస్ రిపోర్టును అందజేయాల్సిందిగా ధర్మాసనం ఆదేశించింది.

ముల్లపెరియార్ రిజర్వాయర్‌కు ముప్పుపై ప్రత్యేక కమిటీలు: సుప్రీం

న్యూఢిల్లీ: కేరళలోని ముల్లపెరియార్ రిజర్వాయర్‌కు ముప్పు వాటిల్లితే ఎదుర్కొనే విషయమై మూడు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని కేంద్రంతోపాటు తమిళనాడు, కేరళ ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. రిజర్వాయర్ భద్రత, జీవితకాలం తదితర అంశాలను ప్రస్తుత కమిటీ చూసుకుంటుందని సీజేఐ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది.

హెలికాప్టర్ నుంచి జారిపడిన జవాన్లు

ముగ్గురికి తీవ్ర గాయాలు

న్యూఢిల్లీ: హెలికాప్టర్ నుంచి ప్రమాదవశాత్తు కింద పడటంతో ముగ్గురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈనెల 15న ఆర్మీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలో గురువారం ప్రాక్టీస్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పరేడ్ మైదానం వద్ద అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ ధ్రువ్ నుంచి తాడు సాయంతో దిగుతున్నప్పుడు బరువుకు తాడు తెగడంతో కొన్ని అడుగుల ఎత్తు నుంచి ముగ్గురు జవాన్లు నేల మీద పడ్డారు. ఈ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

ముంబైలో మెట్రో నిర్మాణ ప్రాంతంలో బాంబు

కార్మికుల అప్రమత్తతతో తప్పిన ముప్పు

ముంబై: ముంబైలో పెద్ద ప్రమాదం తప్పింది. 'మెట్రో-111' నిర్మాణ ప్రాంతంలో బుధవారం కార్మికులు పనిచేస్తుండగా ఓ బాంబు కనిపించింది. ఆ బాంబు ఇంకా పేలలేదు. దీనిని గుర్తించిన కార్మికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో బాంబు నిర్వీర్య బృందం రంగంలోకి దిగి బాంబు తీవ్రతను తగ్గించడంతో చిన్నపాటి పేలుడు సంభవించింది. అనంతరం క్లూస్‌టీం పోలీసులు బాంబు శాంపిల్స్‌ను సేకరించారు. వీటిని ప్రయోగశాలకు పంపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధాశ్రమంలో శేషన్ దంపతులు!



చెన్నై: దేశంలో ఎన్నికల సంస్కరణలను అమలులోకి తెచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్ టీఎన్ శేషన్, ఆయన భార్య జయలక్ష్మి ప్రస్తుతం చెన్నైలోని గురుకులం వృద్ధాశ్రమంలో జీవిస్తున్నారు. వారికి పిల్లలు లేకపోవడంతో కేరళలోని పాలక్కాడ్‌లో సొంతిల్లు ఉన్నా వృద్ధాశ్రమంలోనే జీవించాలని వారు నిర్ణయించుకున్నారు. తమకొచ్చే ఆదాయాన్ని కూడా ఆశ్రమానికే ఇస్తున్నారు.

కార్తి చిదంబరానికి మళ్లీ ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: 'ఐఎన్ఎక్స్ మీడియా' కేసులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పీ చిదంబరం తనయుడు కార్తి చిదంబరానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి సమన్లు జారీ చేసింది. ఇంతకుముందు ఆదేశాలు జారీ చేసినా కార్తి చిదంబరం ముందు హాజరు కాకపోవడంతో ఈడీ మరోసారి ఈ నెల 16న విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. గతేడాది మే నెలలో కార్తి చిదంబరంపై ఈడీ కేసు నమోదు చేసింది. ఆయనతోపాటు ఐఎన్ఎక్స్ మీడియా, దాని డైరెక్టర్లు పీటర్, ఇంద్రాణి ముఖర్జీయా తదితరులపై అక్రమ లావాదేవీల నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు పెట్టింది.

భారత టెకీలకు శుభవార్త

గ్రీన్‌కార్డుల కేటాయింపును పెంచాలని ట్రంప్ సర్కార్ నిర్ణయం

45 శాతం పెంపుతో ఏటా 55 వేలమందికి లబ్ధి • ప్రతినిధుల సభలో బిల్లు



వాషింగ్టన్, జనవరి 11:

అమెరికాలో శాశ్వత నివాసం ఏర్పరుచుకోవాలనుకునే భారత ఐటీ నిపుణులకు శుభవార్త. ప్రతిభ ఆధారిత వలసలను ప్రోత్సహిస్తూ గ్రీన్ కార్డుల కేటాయింపును ఏటా 45 శాతం మేర పెంచాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అమెరికా ప్రతినిధుల సభలో బుధవారం ఓ బిల్లును ప్రవేశపెట్టింది. 'అమెరికా భవిష్యత్ భద్రత' పేరుతో ఉన్న ఈ బిల్లు సభ ఆమోదం పొందితే భారతీయ సాంకేతిక నిపుణులు భారీగా లబ్ధి పొందుతారు. ఈ చట్టం వల్ల వలసల సంఖ్య తగ్గవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం ఏటా సగటున 10.05 లక్షల మంది అమెరికాకు వలస వస్తుండగా, వీరి సంఖ్య 2.60 లక్షలకు తగ్గిపోవచ్చని అంచనా. కాగా గ్రీన్ కార్డుల కేటాయింపును 45 శాతం పెంచడం వల్ల ఏటా వాటిని పొందే వారి సంఖ్య 1.20 లక్షల నుంచి 1.75 లక్షలకు పెరుగనుంది. హెచ్1బీ వీసాలపై అమెరికాకు వచ్చి గ్రీన్‌కార్డును కోరే ఇండియన్-అమెరికన్ సాంకేతిక నిపుణులు లేదా శాశ్వత నివాస హోదా పొందాలనుకొనే వారు అమెరికా భవిష్యత్ భద్రత చట్టం ద్వారా లబ్ధి పొందనున్నారు. ఓ అనధికార అంచనా ప్రకారం గ్రీన్‌కార్డుల కోసం సుమారు ఐదు లక్షల మంది భారతీయులు ఎదురుచూస్తున్నారు. వీరు ప్రతి ఏటా తమ హెచ్1బీ వీసాలను పొడిగించుకుంటున్నారు. మరికొంత మంది కొన్ని దశాబ్దాలుగా గ్రీన్‌కార్డుల కోసం వేచి చూస్తున్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. హెచ్1బీ కార్యక్రమం కింద విదేశీ సాంకేతిక నిపుణులకు అమెరికా ప్రస్తుతం తాత్కాలిక వీసాలను జారీ చేస్తున్నది. గ్రీన్‌కార్డు పొందినవారు అమెరికాలో శాశ్వత నివాసం కలిగి, అక్కడే పనిచేసుకోవచ్చు. అయితే భద్రత చట్టంలోని గొలుసు వలసల నిర్మూలన నిబంధన భారతీయ అమెరికన్లపై ప్రభావం చూపవచ్చని భావిస్తున్నారు. ఈ నిబంధన వల్ల తమ జీవిత భాగస్వాములను, మైనర్లయిన పిల్లలను తప్ప ఇతర కుటుంబ సభ్యులను అమెరికాకు తెచ్చుకొనే అవకాశం ఉండదు. ప్రతిభ ఆధారిత వలస విధానం వల్ల ప్రపంచంలోని అత్యుత్తమమైన నిపుణులు మాత్రమే తమ దేశంలోకి ప్రవేశించగలరని ట్రంప్ ప్రభుత్వం భావిస్తున్నది. ఈ విధానం భారత్, చైనా వంటి దేశాలకు చెందిన సాంకేతిక నిపుణులకు లబ్ధి చేకూర్చగలదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ఉత్తర కొరియాతో చర్చలకు సిద్ధం: ట్రంప్



ఉత్తర కొరియాతో చర్చలకు తాను సిద్ధమని, అయితే సరైన సమయంలో, సానుకూల పరిస్థితుల్లోనే ఆ దేశంతో మాట్లాడుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆయన దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌తో జరిపిన ఫోన్ సంభాషణలో వెల్లడించారు. ఫోన్ సంభాషణ వివరాలను వైట్‌హౌస్ మీడియాకు విడుదల చేసింది. మూన్ జే ఇన్‌తో ఫోన్‌లో మాట్లాడానని, ఉత్తర కొరియాతో జరుగుతున్న చర్చల వివరాలను ఆయన తనతో చెప్పారని. వారి చర్చలు ఎటువంటి ఫలితాలనిస్తాయో చూడాలని ఆ తరువాత ట్రంప్ మీడియాతో చెప్పారు.

భారత్ వంటి దేశాలతో కలిసి పనిచేయడం చాలా మంచిది

భారత్, రష్యా, చైనా వంటి దేశాలతో కలిసి పనిచేయడం మంచే కాని, చెడు కాదని ట్రంప్ వ్యాఖ్యానించారు. రష్యాతో సంబంధాలను పెంచుకోవాలన్న తన ఆకాంక్షపై విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ట్రంప్ స్పందించారు. నార్వే ప్రధాని ఎర్నా సోల్‌బర్గ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రపంచం చుట్టూ ఉన్న దేశాలతో కలిసి పనిచేయడం మంచిదేనని అన్నారు. బలమైన సైన్యం, భారీ చమురు, గ్యాస్ నిక్షేపాలు, సమృద్ధిగా ఇంధనం కలిగి ఉండటం తన లక్ష్యమని చెప్పారు. ఉత్తర కొరియా సమస్యను ఎప్పుడో పరిష్కరించి ఉండాల్సిందని అన్నారు. ఇందుకు మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ కారణమని ఆరోపించారు. బలమైన సైన్యాన్ని ఆమె సమర్థించలేదని విమర్శించారు. ఉత్తర కొరియా విషయంలో చైనాతో కలిసి పనిచేస్తున్నామని, ఇతర దేశాలతో కూడా సమన్వయం కలిగి ఉన్నామని ట్రంప్ పేర్కొన్నారు.

పాక్‌లో 'నిర్భయ' ఘటన

- ఏడేండ్ల చిన్నారిపై దారుణమైన లైంగిక దాడి, హత్య
- దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన ప్రజా ఉద్యమం.. రెండో రోజుకు చేరిన ఆందోళన



తన కూతురితో టీవీ యాంకర్ కిరణ్ నాజ్



లాహోర్, జనవరి 11: పాకిస్థాన్‌లో 'నిర్భయ' వంటి ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దేశవ్యాప్తంగా ప్రజాగ్రహం వెల్లువెత్తుతున్నది. వరుసగా రెండో రోజు ప్రజలు పెద్దసంఖ్యలో ఆందోళనకు దిగారు. ఒక ప్రజాప్రతినిధి ఇంటిపై నిరసనకారులు దాడి చేశారు. రెండు కార్లకు నిప్పు పెట్టారు. ఈ నెల ఐదోతేదీన పంజాబ్ రాష్ట్రంలోని జిల్లా కేంద్రమైన కసూర్ పట్టణంలో ఏడేండ్ల బాలిక జైనాబ్ అన్సారీ ట్యూషన్‌కు వెళ్లి వస్తుండగా ఒక దుండగుడు ఎత్తుకెళ్లి.. పదేపదే లైంగిక దాడి జరిపి తర్వాత హత్యచేశాడు. మంగళవారం చిన్నారి మృతదేహం ఒక చెత్తకుప్పలో లభించింది. ఆ చిన్నారిని ఎత్తుకెళ్లిన వ్యక్తి సీరియర్ కిల్లర్ అని ఒక ప్రత్యక్ష సాక్షి చెప్పాడని, ఆగంతకుడికి ఇప్పటి వరకు ఎనిమిది ఇతర హత్య కేసులతో సంబంధం ఉన్నదని సీనియర్ పోలీసు అధికారి జుల్ఫికర్ హమీద్ తెలిపారు. బాలిక తండ్రి మహ్మద్ అమీన్ మీడియాతో మాట్లాడుతూ పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే తన కూతురు ప్రాణాలు దక్కేవని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మిలిటరీ ఇంటెలిజెన్స్, ఐఎస్ఐతో దర్యాప్తు చేయించాలని కోరారు. చిన్నారిని తీవ్రంగా హింసించినట్లు ముఖంపైనా, శరీరంలోని ఇతర భాగాలపైనా గుర్తులు కనిపిస్తున్నాయి. ఈ దారుణ హత్యపై యావత్ పాకిస్థాన్ భగ్గుమన్నది. ఆందోళనకారులు రోడ్లపై బైఠాయించడంతో మెట్రో బస్సు సర్వీసులు నిలిపేశారు. నిరసనకారులపై పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన పాక్ సుప్రీంకోర్టు.. బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితులను పట్టుకోవాలని పాక్ సైనికాధిపతి, ఐఎస్ఐ, మిలిటరీ ఇంటెలిజెన్స్‌ను ఆదేశించింది. కాగా నిందితుల ఆచూకీ తెలిపిన వారికి రూ.కోటి నగదు బహుమతి ఇస్తామని పంజాబ్ ప్రభుత్వం ప్రకటించింది. కిరణ్ నాజ్ అనే టీవీ యాంకర్ తన కూతురుతో కలిసి టీవీ వార్తా ప్రసారాల కార్యక్రమంలో పాల్గొని నిరసన తెలిపారు. 'ఈ రోజు నేను మీ యాంకర్‌ను కాదు. తల్లిగా నా కూతురుతో కలిసి కూర్చున్నా' అని భావోద్వేగపూరితంగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వ అసమర్థతే ఈ ఘటనకు కారణమని, ఈ హత్య మానవత్వంపైనే దాడి అని అన్నారు. కాగా, ఈ నెల నాలుగో తేదీన కిడ్నాప్ కావడానికి ముందు బాలిక రాసిన కవితను 'జియో టీవీ' చానెల్ ప్రసారం చేసింది.

సుప్రీంకోర్టు జడ్జిగా ఇందు మల్హోత్రా!

- మహిళా న్యాయవాది నేరుగా సుప్రీంకోర్టు జడ్జి కావడం ఇదే ప్రథమం
- ఇందు మల్హోత్రా, జస్టిస్ కేఎం జోసెఫ్‌ను ఎంపిక చేసిన కొలీజియం



న్యూఢిల్లీ, జనవరి 11: హైకోర్టు జడ్జిగా సేవలందించకుండానే నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎన్నికైన మొదటి మహిళగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రా రికార్డు సృష్టించనున్నారు. ఆమెతోపాటు ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేఎం జోసెఫ్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా సుప్రీంకోర్టు కొలీజియం ఎంపిక చేసినట్టు తెలుస్తున్నది. ఇందు మల్హోత్రా 2007 నుంచి సీనియర్ న్యాయవాదిగా సేవలు అందిస్తున్నారు. జస్టిస్ ఎం ఫాతిమా బీవి 1989లో సుప్రీంకోర్టు తొలి మహిళా న్యాయమూర్తిగా నియమితులు కాగా, అత్యున్నత న్యాయస్థానంలో ఇప్పటివరకు ఆరుగురు మహిళా న్యాయమూర్తులు పనిచేశారు. ప్రస్తుతం జస్టిస్ ఆర్ భానుమతి న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. జస్టిస్ కేఎం జోసెఫ్ 2016లో ఉత్తరాఖండ్‌లో రాష్ట్రపతి పాలనను ఎత్తివేస్తూ సంచలనాత్మక తీర్పునిచ్చి అందరి దృష్టినీ ఆకర్షించారు.


భారత్-పాక్ భద్రత సలహాదారుల చర్చలు నిజమే

ధ్రువీకరించిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ, జనవరి 11: భారత్, పాకిస్థాన్ భద్రత సలహాదారుల మధ్య చర్చలు జరిగాయని పక్షం రోజుల తరువాత విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. భారత్, పాక్ జాతీయభద్రతా సలహాదారులు అజిత్ దోవల్, లెఫ్టినెంట్ జనరల్ నాజర్‌ఖాన్ జంజువాలా మధ్య థాయ్‌లాండ్‌లో చర్చలు జరిగాయని విదేశాంగ ప్రతినిధి రవీశ్‌కుమార్ గురువారం వెల్లడించారు. ఉగ్రవాద నిర్మూలన, సీమాంతర ఉగ్రవాదంపై వారు చర్చలు జరిపారని తెలిపారు. ఓ వైపు ఉగ్రవాద చర్యలకు పాల్పడుతూ, మరోవైపు చర్చలు జరుపడం సాధ్యం కాదని, సీమాంతర ఉగ్రవాదాన్ని నిరోధించాలని భారత్ తేల్చి చెప్పిందని ఆయన చెప్పారు. భారత్-పాక్‌ల మధ్య వివిధ స్థాయిల్లో చర్చలు జరుగుతూనే ఉన్నాయని అన్నారు.

ఉగ్రవాది అఫ్జల్‌గురు కుమారుడికి ఇంటర్‌లో 88 శాతం మార్కులు

డిస్టింక్షన్‌లో పాసైన గాలిబ్ గురు



గాలిబ్‌గురును అభినందిస్తున్న తల్లి తబస్సుమ్

శ్రీనగర్: భారత పార్లమెంట్‌పై దాడి వ్యూహకర్త అఫ్జల్ గురు కుమారుడు గాలిబ్ గురు ఇంటర్‌లో 88శాతం మార్కులు సాధించి డిస్టింక్షన్‌లో పాసయ్యాడు. జమ్ముకశ్మీర్ బోర్డ్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవంబర్‌లో నిర్వహించిన 12వ తరగతి వార్షిక పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేయగా గాలిబ్ గురుకు 441 మార్కులు వచ్చాయి. బోర్డు పరీక్షల్లో మొత్తం 61.44 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా ఇందులో బాలికలదే పైచేయి కావడం విశేషం. 2001లో పార్లమెంట్‌పై దాడికి వ్యూహ రచన చేసిన అఫ్జల్‌గురుకు 2013లో మరణశిక్ష అమలు చేశారు. అతడి కుటుంబం ప్రస్తుతం బారాముల్లా జిల్లా సోపోర్‌లో నివసిస్తున్నది. ఫలితాలు వెలువడగానే కుటుంబ సభ్యులు, స్నేహితులు గాలిబ్‌ను అభినందించారు. గాలిబ్ కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని తనను తాను నిరూపించుకున్నారని ప్రతిపక్ష నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధికార ప్రతినిధి సరాహ్ హయత్ ట్విట్టర్‌లో అభినందించారు.

ఆధార్ విషయంలో కావాలనే దుష్ప్రచారం



నీలేకని

బెంగళూరు, జనవరి 11: ఆధార్ గోప్యత విషయంలో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని భారత విశిష్ట ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) మాజీ చైర్మన్ నందన్ నీలేకని చెప్పారు. ఆధార్ వివరాలను తెలుసుకోవడం అంత సులభం కాదని, ఈ వివరాల గోప్యతకు చాలా భద్రతపరమైన ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. గురువారం బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆధార్ వివరాలు భద్రం కావంటూ ఇటీవల వచ్చిన వార్తలను ఆయన కొట్టివేశారు. ఆధార్‌కు గుర్తింపు ఉన్నది కాబట్టే కోట్లాది మంది భారతీయులు ఈ విశిష్ట సంఖ్యను పొందారని, తమ బ్యాంకు ఖాతాలకు అనుసంధానించుకున్నారని తెలిపారు. ఆధార్ గోప్యత కోసం యూఐడీఏఐ తీసుకొచ్చిన వర్చువల్ ఐడీ విధానాన్ని నీలేకని సమర్థించారు. ఎవరైన తమ ఆధార్ వివరాలను గుర్తింపు పొందిన సంస్థలకు ఇవ్వడానికి ఇష్టం లేకుంటే ఈ వర్చువల్ ఐడీ నంబర్‌ను ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

ఆధార్ అత్యంత భద్రం: రవిశంకర్ ప్రసాద్

ఆధార్ కార్డు కోసం సేకరించిన వేలుముద్రలు, ఐరిస్ వివరాలు చాలా భద్రంగా ఉన్నాయని, వాటిని దుర్వినియోగ పర్చడం, తస్కరించడం అస్సలు సాధ్యం కాదని కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. ఆధార్ వివరాలు భద్రం కావంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో ఆయన స్పందించారు.

2020 అమెరికా అధ్యక్ష బరిలో ఓప్రా విన్‌ఫ్రే!



వాషింగ్టన్, జనవరి 11: మీడియా అధిపతి, టాక్ షో నిర్వాహకురాలు, నటి, నిర్మాత, దాత ఓప్రా విన్‌ఫ్రే 2020లో జరుగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో బరిలోకి దిగనున్నట్టు తెలుస్తున్నది. డెమోక్రటిక్ పార్టీ తరఫున ఆమె బరిలోకి దిగవచ్చని విన్‌ఫ్రేకు సన్నిహితులైన ఇద్దరు వ్యక్తులు ఇటీవల వెల్లడించారు. అధ్యక్ష పదవికి పోటీ చేయాలని ఆమె అంతరంగికులు కూడా ఒత్తిడి చేస్తున్నట్టు చెప్పారు. అయితే ఇంతవరకు ఓప్రా తన నిర్ణయాన్ని వెల్లడించలేదని తెలుస్తున్నది. డెమోక్రటిక్ పార్టీ నుంచి అధ్యక్ష పదవికి పోటీపడే వారి వివరాలు అధికారికంగా ఈ ఏడాది మధ్యలో వెల్లడయ్యే అవకాశాలున్నాయి. అయితే ఇప్పటికే పలువురు ఆశావహులు ఐయోవాలోని పార్టీ కార్యాలయానికి చక్కర్లు కొడుతున్నారు. గత ఆదివారం జరిగిన గోల్డెన్ గ్లోబ్ అవార్డుల కార్యక్రమంలో ఓప్రా విన్‌ఫ్రే చేసిన ఉద్వేగభరితమైన ప్రసంగం నేపథ్యంలో ఆమె 2020 అధ్యక్ష ఎన్నికల బరిలోకి దిగే అవకాశాలున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఆ ప్రసంగంలో ఆమె 'కనుచూపు మేరలో మీకు మంచి రోజులు రానున్నాయి' అంటూ చేసిన వ్యాఖ్య, ఆమె అధ్యక్ష పదవికి పోటీ చేయనున్నారనడానికి సంకేతమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ఉదారవాద సెలబ్రిటీలు, ప్రేక్షకులు కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడించారు. ఆమెకున్న పేరు ప్రతిష్ఠలు, సంపదను బట్టి డెమోక్రటిక్ పార్టీలో విన్‌ఫ్రేనే సరైన అభ్యర్థి కాగలరని అని పలువురు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అయితే అమెరికన్లు వరుసగా రెండోసారి ఓ టీవీ స్టార్‌ను (ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ కూడా ఒకప్పటి టీవీ ప్రముఖుడే) తమ దేశాధినేతగా ఎన్నుకుంటారా అని మరికొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే విన్‌ఫ్రే అభిమానులు మాత్రమే ఆమె కచ్చితంగా అధ్యక్ష బరిలోకి దిగాలని ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారు.

ఫడ్నవీస్‌కు ఐదోసారి తప్పిన ముప్పు




ముంబై, జనవరి 11: హెలికాప్టర్ ప్రమాదం నుంచి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మరోసారి తృటిలో తప్పించుకున్నారు. కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో కలిసి ముంబైకి సమీపంలోని భయందర్‌లో గురువారం ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. స్కూలు ఆవరణలో హెలికాప్టర్ ల్యాండ్ కావాల్సి ఉండగా, అక్కడ వైర్ ఉండటాన్ని గుర్తించి పైలెట్ హెలికాప్టర్ని వెనకకు మళ్లించారు. సమీపంలోని మరో ప్రాంతంలో హెలికాప్టర్‌ను సురక్షితంగా దించారు. ఈ ఘటనపై మహారాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. హెలికాప్టర్ ప్రమాదం నుంచి సీఎం ఫడ్నవీస్ బయటపడడం ఇదే తొలిసారికాదు. గత ఏడాది మే 10, మే 25, జూలై 7, డిసెంబర్ 9 తేదీల్లో ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి.

హజ్ కోటా మరో 500 సాధిస్తాం

పెంచేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తాం ■ ముఖ్యమంత్రి ద్వారా లేఖ పంపిస్తాం ■ రాష్ట్ర హజ్ కమిటీకి రూ.3 కోట్లు మంజూరు చేయిస్తాం

ఆన్‌లైన్ డ్రా ప్రారంభ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ ■ తెలంగాణ నుంచి 3,558 మంది యాత్రికులు హజ్‌కు ఎంపిక


గురువారం నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో ఆన్‌లైన్ డ్రాను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రం నుంచి ఈసారి హజ్ కోటాలో మరో 500 సీట్లు వరకు పెరిగే అవకాశాలున్నాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ చెప్పారు. అదనపు కోటా కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని, ఈ మేరకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో లేఖ రాయిస్తామని అన్నారు. హజ్‌యాత్రకు తెలంగాణ నుంచి కేంద్ర హజ్ కమిటీ ద్వారా వెళ్లే యాత్రికులను తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ (టీఎస్‌హెచ్‌సీ) గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో ఆన్‌లైన్ డ్రా ద్వారా ఎంపిక చేసింది. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ ప్రారంభించారు. రిజర్వ్ క్యాటగిరీలో 508 సీట్లుపోను మిగతా 3,558 సీట్ల కోసం ఆన్‌లైన్‌లో డ్రా ద్వారా యాత్రికులను ఎంపిక చేశారు. అనంతరం హజ్ యాత్రికులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఈసారి హజ్ కోసం రాష్ట్రం నుంచి 17,130 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 508 మంది రిజర్వ్ క్యాటగిరీ (72 వయసు దాటిన) నుంచి ఉన్నందున ఆన్‌లైన్ డ్రా నుంచి మినహాయించామని చెప్పారు. 16,622 మంది దరఖాస్తుదారుల కోసం డ్రా కార్యక్రమం చేపట్టినట్టు ఆయన తెలిపారు. కేంద్ర మైనారిటీ సంక్షేమశాఖ, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా(హెచ్‌సీఐ) తెలంగాణకు 4,066 కోటాను కేటాయించాయని పేర్కొన్నారు. ముస్లింల సంక్షేమం, హజ్ యాత్రికుల విషయంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్ర క్యాబినెట్‌లో ఒక ముస్లింను డిప్యూటీ సీఎంగా నియమించడం, హజ్ శిబిరంలో కల్పిస్తున్న సౌకర్యాలు, యాత్రికులకు ఇస్తున్న ప్రత్యేకత ఇందుకు నిదర్శనమన్నారు. హైదరాబాద్ జిల్లా నుంచి అత్యధికంగా 10,908 మంది హజ్ కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. హజ్ శిబిరం నిర్వహణ, సౌకర్యాల కల్పన కోసం రూ.5 కోట్లు ఇవ్వాలని తెలంగాణ హజ్ కమిటీ ప్రభుత్వాన్ని కోరిందని, రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ ఎస్ఏ షుకూర్, ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఏకే ఖాన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్, ఎమ్మెల్యే మెహరాజ్ హుస్సేన్ జాఫర్, హాఫెజ్ సాబెర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

వనరులున్న జిల్లాల్లో పరిశ్రమలకు ప్రోత్సాహం

- వరంగల్ విజన్ డాక్యుమెంట్-2028 విడుదల
- అరగంటలో అక్కడికి చేరుకునేలా రవాణా సౌకర్యాలు
- ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్


గురువారం హైదరాబాద్‌లో సీఐఐ రూపొందించిన వరంగల్ విజన్ డాక్యుమెంట్-2028ను విడుదల చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో సీఐఐ అధ్యక్షుడు రాజన్న, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు ఉన్నారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వనరులున్న జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తామని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. ఇందుకు ప్రత్యేక రాయితీలతో కూడిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని పరిశ్రమలశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కోఠిలోని ఎస్బీఐ కార్యాలయంలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో రూపొందించిన వరంగల్ విజన్ డాక్యుమెంట్-2028ను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే తరహాలో అన్ని జిల్లాలకు విజన్‌పై డాక్యుమెంట్లు రూపొందించాలని సీఐఐకి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో దాదాపుగా అన్ని జిల్లాలు రవాణాపరంగా అనువైనవని, రెండు మూడు గంటల్లోనే ఏ జిల్లాకైనా చేరుకోవచ్చునన్నారు. హైదరాబాద్- వరంగల్ రూట్‌లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని కేంద్రానికి ఇప్పటికే విన్నవించామని తెలిపారు. వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ కాకపోయినా ఎయిర్ స్ట్రిప్‌ను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ నుంచి అప్ అండ్ డౌన్ చేస్తూ వరంగల్‌లో విధులు నిర్వహించే రోజులు వస్తాయని చెప్పారు. 30 నుంచి 45 నిమిషాల్లో వరంగల్ చేరుకునే రవాణా సదుపాయం వస్తుందని మంత్రి కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. వరంగల్ పురావస్తు, చారిత్రక నేపథ్యం ఉన్న నగరమని తెలిపారు. మన దేశంలో పర్యాటక రంగాన్ని సరియైన విధంగా వినియోగించుకోవడంలేదని కేటీఆర్ చెప్పారు. మలేషియా, శ్రీలంక, మాల్దీవ్‌లు పర్యాటక రంగాన్ని పెద్ద ఎత్తున ఉపయోగించుకుంటున్నాయన్నారు. వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.300 కోట్లు కేటాయిస్తుందని చెప్పారు. దీనితోపాటుగా హృదయ్, స్మార్ట్ సిటీ పథకాల ద్వారా నిధులు వస్తున్నాయన్నారు. వరంగల్‌లో ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థలు, మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్‌ఆర్‌ఐలను కూడా వరంగల్ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని, ఇందుకు వారు ముందుకు వస్తారని ఆశిస్తున్నామని అన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు.

బంగారు తెలంగాణలో వజ్రాల వరంగల్

సీఐఐ అధ్యక్షుడు రాజన్న మాట్లాడుతూ బంగారు తెలంగాణలో వజ్రాల వరంగల్ పేరుతో స్థానిక వనరుల ఆధారంగా భవిష్యత్ ఆవిష్కరించే విధంగా నివేదిక తయారు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, లీడ్ బ్యాంకు చైర్మన్ జే స్వామినాథన్, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ సలహాదారు యెర్రం రాజు, వనిత దాట్ల తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ నిధులను మార్చిలోగా వినియోగించండి

- అధికారులకు బీసీ సంక్షేమ కమిటీ సూచన
- బీసీ పథకాలపై అధికారులతో బీసీ సంక్షేమ కమిటీ చైర్మన్ సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీసీల్లోని ఆయా వర్గాల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో మార్చి 31 నాటికి ఖర్చుచేయాలని తెలంగాణ అసెంబ్లీ బీసీ సంక్షేమ కమిటీ సంబంధితశాఖల అధికారులను కోరింది. సీఎం కేసీఆర్ ఆకాంక్ష మేరకు అధికారులు బీసీలకు ప్రయోజనం చేకూర్చాలని తెలిపింది. అసెంబ్లీ కమిటీహాల్‌లో బీసీ సంక్షేమ కమిటీ చైర్మన్ గంగాధర్‌గౌడ్.. బీసీ పథకాలపై అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు విఠల్ రెడ్డి, ఆర్ కృష్ణయ్య, ఫారుక్‌హుస్సేన్, బాలసాని లక్ష్మీనారాయణ, బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, కమిషనర్ అనితా రాజేందర్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు, డిప్యూటీ సెక్రటరీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇంతకుముందు 19 బీసీ గురుకుల విద్యాలయాలు ఉండగా సీఎం వాటి సంఖ్యను 142కు పెంచారని గంగాధర్‌గౌడ్ గుర్తుచేశారు. ప్రభుత్వం అందించే ఆర్థికసాయంతో ఐదు దేశాలకు వెళ్లే విద్యార్థులు.. మరో ఐదు దేశాలకు విస్తరించాలని అభిప్రాయపడ్డారు. ఏడాదికి 300 మంది విద్యార్థులనే విదేశాలకు పంపాలనే నిబంధన సడలించి అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న 10 బీసీ స్టడీ సెంటర్ల ద్వారా ఏడాది పొడవునా ఎస్సై, టీచర్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే ఉద్యోగ పోటీ పరీక్షలకు ఏడాది పొడవున శిక్షణ ఇవ్వాలని కోరారు. సివిల్స్ కోసం సన్నద్ధమయ్యే విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలతో హైదరాబాద్‌లో ఒక శిక్షణ కేంద్రం ఏర్పాటుచేయాలని.. కల్యాణలక్ష్మీ పథకం కింద పెండ్లి సమయంలో రూ.75 వేల అందజేస్తున్నారని.. కులాంతర వివాహం చేసుకునే బీసీలకు రూ.10 వేలతో సరిపెట్టకుండా రూ.2 లక్షలు అందజేయాలనే ప్రతిపాదన సమావేశంలో వ్యక్తమయింది.

ఏపీ మంత్రి దేవినేనితో ప్రాణహాని ఉంది

- రక్షణ కల్పించాలని పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: ఏపీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర్‌రావుతోపాటు ఆయన బంధువుల నుంచి తమకు ప్రాణహాని ఉన్నదని గురువారం ఓ మహిళ బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. యూసుఫ్‌గూడలో నివాసముంటున్న అట్లూరి ప్రవీజ అనే యువతికి, ఏపీ మంత్రి దేవినేని ఉమా సోదరులు, ఇతర బంధువులతో స్థల వివాదం కొనసాగుతున్నది. ఈ విషయమై విజయవాడలో కేసు నమోదైంది. ఈ కేసును వాపస్ తీసుకోవాలని బెదిరిస్తున్నారని ప్రవీజ బంజారాహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదుచేశారు.

చిన్నారుల సాక్ష్యం నమోదులో

నిబంధనలు పాటించాలి

- దిగువ కోర్టులకు హైకోర్టు సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: క్రిమినల్ కేసుల్లో చిన్నారుల సాక్ష్యం పరిగణనలోనికి తీసుకునే వ్యవహారంలో నిబంధనలు పాటించాలని దిగువకోర్టులకు హైకోర్టు స్పష్టం చేసింది. చిన్నారులు ఇచ్చే వాంగ్మూలం లేదా సాక్ష్యాన్ని రికార్డు చేయడమే సముచితమని న్యాయస్థానం అభిప్రాయపడింది. చిన్నారులు ఏ భాషలో వాంగ్మూలం ఇస్తారో అదేబాషలో రికార్డు చేయాలని తేల్చిచెప్పింది. ఈ విషయంలో క్రిమినల్ ప్రొసిజర్ కోడ్‌లోని సెక్షన్ 277, 278లలోని నిబంధనలను పాటించాలని స్పష్టం చేసింది. అదేవిధంగా సాక్షులుగా ఉన్న చిన్నారుల అవగాహనను, మానసికస్థితిని మేజిస్ట్రేట్‌లు, జడ్జీలు తప్పనిసరిగా ప్రశ్నలు వేసి నిర్ధారించుకోవాలని, సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాలను పాటించాలని తెలిపింది. చిన్నారుల వాంగ్మూలం ప్రభావాలకు లోనైందా? అనేది తెలుసుకోవాలని హైకోర్టు స్పష్టంచేసింది. హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భార్య హత్యకేసులో శ్రీనివాస్ అనే వ్యక్తికి జీవితఖైదు శిక్ష విధింపు వ్యవహారంలో పిల్లల వాంగ్మూలం తీసుకోవడాన్ని సవాల్‌చేస్తూ హైకోర్టులో దాఖలైన వ్యాజ్యంలో ఉమ్మడి హైకోర్టు ఈ మేరకు పలు సూచనలు చేసింది.

నేడు ప్రధానితో ఏపీ సీఎం భేటీ

హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. శుక్రవారం ఉదయం 10.40 గంటలకు ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. గురువారం సాయంత్రం చంద్రబాబు ఢిల్లీకి బయలుదేరివెళ్లారు. నియోజకవర్గాల పునర్విభజన, రెవెన్యూలోటు, పోలవరం, రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలపై ఆయన ప్రధాని మోదీతో చర్చించనున్నారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీకి కేంద్రబడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరనున్నారు. ఇప్పటికే ఈ నెల 5న టీడీపీ ఎంపీలు మోదీని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఏపీ సచివాలయానికి సైకిల్‌పై సీపీఐ నారాయణ

- గేటు వద్ద అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బంది

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: సీపీఐ నారాయణ అంటే ఎప్పుడూ ఏదో ఒక సంచలనానికి తెరతీస్తుంటారు. గురువారం ఉదయం ఏపీ సచివాలయానికి సైకిల్‌పై వెళ్లారు. లోనికి వెళ్తుండగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడంతో చేదు అనుభవం ఎదురైంది. ఈ సమయంలో ఎవరూ ఉండరని, సైకిల్‌పై లోపలికి అనుమతించలేమని భద్రతా సిబ్బంది నారాయణను బయటకు పంపేశారు. అధికార పార్టీ టీడీపీ గుర్తు అయిన సైకిల్‌పై తాను వస్తే అనుమతించకపోవడం ఏమిటని ఆయన విసుక్కున్నారు. అసెంబ్లీ, సచివాలయం ముందు కాసేపు సైకిల్‌పై చక్కర్లు కొట్టి తిరిగి వెళ్లిపోయారు.

ఐటీ కాంగ్రెస్‌కు ప్రధాని?

మొదటిపేజీ తరువాయి... అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్ గురువారం సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ గత ఏడాది నవంబర్‌లో హైదరాబాద్ వేదికగా 'గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్' నిర్వహించి అంతర్జాతీయ చూపును తమవైపు తిప్పుకొన్నామని.. అంతటి గుర్తింపును దక్కించే మరో ప్రతిష్ఠాత్మక సదస్సు 'వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' అని తెలిపారు. వచ్చేనెల 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా నిర్వహించనున్న ఈ సదస్సుకు ఇప్పటికే నాస్కాం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తిచేసినట్టు పేర్కొన్నారు. ఏడాదిన్నరగా ఈ కార్యక్రమ నిర్వహణ గురించి నాస్కాంతో కలిసి పనిచేస్తున్నట్టు వివరించారు. గత సంవత్సరం తైవాన్‌లో విజయవంతమైన ఈ సదస్సును మొట్టమొదటిసారిగా భారత్‌లో.. హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తుండటం పట్ల మంత్రి కేటీఆర్ సంతోషం వ్యక్తంచేశారు. గత పాతికేండ్లుగా ముంబై వేదికగా నిర్వహిస్తున్న నాస్కాం ఇండియా లీడర్‌షిప్‌ఫోరంను కూడా తొలిసారి హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌తో సమాంతరంగా ఈ సదస్సు సాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పలు ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్టు వెల్లడించారు. ఐటీ పరిశ్రమకు చెందిన నిపుణులు, పారిశ్రామికవేత్తలు, అనలిస్టులు ఈ ప్రతిష్ఠాత్మక వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో పాల్గొంటారని నాస్కాం అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఇప్పటికే 30 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నట్టు నిర్వాహకులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. సీఈవోల చర్చలు, బోర్డ్ రూమ్ సమావేశాలు వంటివి నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సదస్సులో 24 పవర్‌ప్యాక్ సెషన్లను ఏర్పాటుచేసి, ఐటీ పరిశ్రమకు చెందిన ప్రతి అంశాన్ని చర్చించనున్నట్టు వివరించారు. సమావేశం ప్రారంభానికి ప్రధాని నరేంద్రమోదీని ఆహ్వానించామని, ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వాల్సి ఉన్నదని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎక్స్‌పీరియన్స్ ఏజ్, ఇన్నోవేషన్, న్యూగ్లోబలైజేషన్, ఫ్యూచర్ ఆఫ్ వర్క్, స్పోర్ట్స్ అండ్ టెక్నాలజీ అనే అంశాల్లో ప్రధానంగా చర్చాగోష్ఠులు ఉంటాయని చెప్పారు. 60 ఇన్నోవేషన్ కంపెనీలతోపాటు దాదాపు 500 మంది విదేశీ ప్రతినిధులు సదస్సుకు హాజరుకానున్నట్టు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఐటీ కాంగ్రెస్ నిర్వహణకు, నాస్కాం సదస్సుకు పెద్దఎత్తున సహకారం అందిస్తున్నదని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, డిజిటల్ మీడియా డైరెక్టర్ దిలీప్ కొణతం పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్

వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సందర్భంగా హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్ ఏర్పాటుపై ప్రకటన వెలువడనున్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, నాస్కాం ప్రతినిధులు చర్చలు జరిపినట్టు సమాచారం. ఇటీవలి కాలంలో ఐటీరంగాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావితంచేస్తున్న నేపథ్యంలో ఈ కేంద్రం హైదరాబాద్‌లో నెలకొల్పడం వల్ల రాబోయేకాలంలో వచ్చే అవకాశాలను ఒడిసిపట్టుకునే అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు.

రాజస్థాన్‌కు మహిళా శిశు సంక్షేమ కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల చివరి నాటికి రాజస్థాన్ పర్యటనకు వెళ్లాలని తెలంగాణ అసెంబ్లీ మహిళా శిశుసంక్షేమ కమిటీ నిర్ణయం తీసుకున్నది. రాజస్థాన్ ప్రభుత్వం మహిళ, శిశు సంక్షేమానికి అమలుచేస్తున్న కార్యక్రమాలను అధ్యయనం చేయాలని కమిటీ భావిస్తున్నది. అసెంబ్లీ కమిటీహాల్‌లో మహిళా శిశు సంక్షేమ కమిటీ చైర్మన్ రేఖానాయక్ అధ్యక్షతన కమిటీ గురువారం సమావేశమైంది. ఈ సమావేశానికి సభ్యులు ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల లలిత, చింతల రామచంద్రారెడ్డి, అంజయ్య యాదవ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి జగదీశ్వర్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్య హాజరయ్యారు. రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై కమిటీ చర్చించింది.

7. జిందగీ
Life is Beautiful
నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
శుక్రవారం 12 జనవరి 2018
WWW. NTNEWS.COM

తలలో ఓ పువ్వు పెట్టుకుంటే ఆ జడకు వచ్చే అందమే వేరు.. అవే పూలు.. ఇప్పుడు బట్టల మీదకెక్కితే..
సొగసు చూడతరమా అనకుండా ఉండగలమా? ఫ్లోరల్ ప్రింట్‌తో వచ్చిన లెహంగాలను చూసి..
పువ్వుల్లో దాగున్న ఆ అందమే అతిశయం అని పాడుకోవాల్సిందే!
పండుగ పూట మరింత కొత్తగా.. సంప్రదాయంగా.. ఉండేందుకు ఈ లెహంగాలను వేసేద్దామా!

పువ్వులేసేద్దామా!



ఎర్రని ప్యూర్ సిల్క్ ఫ్యాబ్రిక్‌ని లెహంగాగా కుట్టాం. దానికి గోల్డ్ కట్ వర్క్ నక్షీ బార్డర్‌ని వేశాం. తెల్లని ఫ్లోరల్ టస్సర్ సిల్క్‌ని బేస్ బార్డర్‌గా వేశాం. ఇక దుపట్టాకి మింట్ గ్రీన్ కలర్ ఫ్లోరల్ ప్రింట్ వచ్చిన దుపట్టాని ఎంచుకున్నాం. దీనికి కూడా కట్‌వర్క్ చేసిన నక్షీ బార్డర్‌ని వేయడంతో అందంగా మెరిసిపోతున్నది. బ్లౌజ్‌కి పింక్ కలర్ రాసిల్క్ ఫ్యాబ్రిక్ మీద కట్‌దానా మెటీరియల్‌తో చెక్స్ వచ్చేలా హ్యాండ్ వర్క్ చేయించాం.

తెల్లని ఫ్లోరల్ ప్రింట్ వచ్చిన టస్సర్ సిల్క్ లెహంగా ఇది. దీనికి కట్ వర్క్ చేసిన నక్షీ బార్డర్‌ని వేశాం. దీనికి కింద బేస్ బార్డర్‌గా పీచ్ రాసిల్క్‌ని జతచేశాం. ఎర్రని నెట్ దుపట్టాకి గోల్డ్ కలర్ కట్ వర్క్ నక్షీనే బార్డర్‌గా వేశాం. పింక్ కలర్ ప్యూర్ రాసిల్క్‌ని తీసుకొని దాన్ని బ్లౌజ్‌గా కుట్టాం. దీని మీద క్రీపర్ హ్యాండ్ వర్క్ డిజైన్‌తో చిన్న చిన్న బుటీస్ ఇచ్చాం. నెక్ లైన్, హ్యాండ్స్ దీనికి అదనపు ఆకర్షణగా నిలిచాయి.


వినీషా రావు
ఫ్యాషన్ డిజైనర్
కర్మన్‌ఘాట్, హైదరాబాద్
9704994151
ethniccouturevr@gmail.com

తెల్లని టస్సర్ సిల్క్ ఫ్యాబ్రిక్‌ని లెహంగాగా కుట్టాం. దీనికి గోల్డ్ కట్ వర్క్ నక్షీ బార్డర్, ప్యూర్ రాసిల్క్ బార్డర్‌లని జతచేశాం. ఎర్రని రాసిల్క్ బ్లౌజ్ మీద హెవీ క్రీపర్ హ్యాండ్ వర్క్‌తో నింపేశాం. మధ్యలో పింక్ బీడ్స్, యాంటిక్ నక్షీ రావడంతో మరింత అందంగా మెరిసిపోతున్నది. ఎర్రని నెట్ దుపట్టా మీద కూడా ఇదే వర్క్‌తో, చిన్న చిన్న బుటీలు రావడంతో డ్రెస్ అందాన్ని మరింత పెంచింది.

చిలుకల కొలికిలా ఉండేందుకు ఈ చిలుకపచ్చ లెహంగా వేయాల్సిందే! ప్యూర్ సిల్క్ లెహంగా మీద థ్రెడ్ వర్క్, నక్షీలతో అందమైన పువ్వులను కుట్టాం. లెహంగా మొత్తం ఈ పూలు కనిపిస్తాయి. గోల్డ్, యాంటిక్ నక్షీ బార్డర్‌ని వేయడంతో మెరిసిపోతున్నది. ఎర్రని నెట్ దుపట్టా మీద కూడా లెహంగా మీదలాంటి వర్క్‌తో కంటిన్యూ చేశాం. ఎర్రని నెట్ బ్లౌజ్‌ని బోట్ నెక్‌తో హైలైట్ చేశాం. దీనిమీద పువ్వుల బుటీలతో నింపేశాం.

సిరిముగ్గు

17 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకు



సీహెచ్. జ్యోతి
బాలాజీ నగర్,
కూకట్‌పల్లి,
హైదరాబాద్



యవ్వనంగా కనిపించాలా?



- గుడ్డు తెల్లసొన, రెండు చెంచాల నిమ్మరసం కలిపి ముఖానికి, చేతులకు రాయాలి. 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి. వారంలో రెండుసార్లు ఇలా చేస్తే ఫలితం ఉంటుంది.
- రెండు చెంచాల ఓట్‌మీల్‌లో గుడ్డు తెల్లసొన కలుపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకొని 10నిమిషాల తర్వాత తడిబట్టతో తుడువాలి. ఇలా వారంలో ఒకసారి చేయాలి.
- అరస్పూన్ మొక్కజొన్న పిండి, టీ స్పూన్ రోజ్‌వాటర్, గుడ్డు తెల్లసొన బాగా కలుపాలి. ముఖానికి, మెడకు రాసుకొని 10 నిమిషాల తర్వాత కడిగితే ముఖం మృదువుగా మారుతుంది.
- గుడ్డు తెల్లసొన, రెండు చెంచాల తేనెను కలుపాలి. తర్వాత ముఖానికి పెట్టుకొని 15 నిమిషాల తర్వాత కడుగాలి. ఇలా చేస్తే చర్మం బిగుతుగా మారుతుంది.
- గుడ్డు తెల్లసొన, రెండు చెంచాల బియ్యం పిండిని బాగా కలిపి ముఖానికి, మెడకు రాసుకొని 15 నిమిషాల తర్వాత కడుగాలి. వారంలో రెండుసార్లు ఇలా చేస్తే.. మీరు యవ్వనంగా కనిపిస్తారు.

Dwaraka

నమస్తే తెలంగాణ

చింతన

[హైదరాబాద్]


శుక్రవారం 12 జనవరి 2018

బుద్ధమార్గం

ధనంతో కొలువలేం!

వారణాసి రాజు సుసేనుడు యుద్ధంలో ఓడిపోయాడు. అతని సైన్యం చెల్లాచెదురైపోయింది. అతని గుర్రం అదుపు తప్పి అడవిలోకి పారిపోయింది. దారితప్పి మహారణ్యంలో ఒంటరిగా మిగిలిపోయాడు. కత్తి దెబ్బలు తీవ్రంగా బాధిస్తున్నాయి. రెండు రోజులు అలా తిరిగి తిరిగి దుమ్ము కొట్టుకుపోయి, కళ తప్పి చివరికి ఒక కొండ ప్రాంతం చేరాడు. అక్కడ ఒక చిన్న గూడెం ఉంది. గూడెం చివర పూరి గుడిసె ముందు దీనంగా నిలబడ్డాడు. ఆ ఇంటి యజమాని అతణ్ణి సైనికుడు అనుకున్నాడు. చేరదీసి సపర్యలు చేశాడు. తన దుస్తులు ఇచ్చాడు. తాము తినకుండా రాజుకు ఆహారం పెట్టారు. కటిక పేదవాడు అయినా వారం రోజులు రాజుకి సేవచేశాడు. రాజు కోలుకుని బయలుదేరేవేళ దారిలో తినడానికి పిండివంటలు చేసి మూటగట్టి సాగనంపాడు.

'మిత్రమా! నన్ను ఆదుకున్నావు. నీవు ఎప్పుడైనా మన రాజధానికి వచ్చి, దక్షిణ ద్వారం దగ్గర ఉండే ద్వారపాలకునితో 'మహా అశ్వారోహుని ఇల్లు ఎక్కడ?' అని అడుగు. నా దగ్గరకు తీసుకువస్తాడు' అని చెప్పి వెళ్లిపోయాడు.



అతను రాజు అని ఆ గ్రామవాసికి తెలియదు. చాన్నాళ్లకి ఏదో పని మీద అతను రాజధానికి పోవలసి వచ్చింది. తన పనికి సహాయం చేస్తాడనుకొని పోయి, ద్వారపాలకునితో 'మహా అశ్వారోహుని ఇల్లు ఎక్కడ?' అని అడిగాడు. తనకు ముందే రాజు ఈ విషయం చెప్పి ఉండడంతో ఆ గ్రామవాసిని ద్వారపాలకుడు రాజు దగ్గరకు తీసుకుపోయాడు.

సింహాసనం మీద ఉన్న రాజును చూసి గ్రామవాసి నిర్ఘాంతపోయాడు. రాజు లేచి, సింహాసనం దిగి వచ్చి, అతణ్ణి కౌగిలించుకున్నాడు. తన మందిరానికి తీసుకుపోయాడు.

'మిత్రమా! నాకోసం ఏం తెచ్చావు?' అని అడిగి, అతను తెచ్చిన పిండివంటల్ని బంగారు పళ్లెంలో పెట్టించాడు. అతను తెచ్చిన ముతక బట్టల్ని కట్టుకున్నాడు. అతనితో కలిసి భోజనం చేశాడు. తన సరసన సభలో కూర్చోబెట్టుకున్నాడు. విలువైన కానుకలు ఇచ్చి పంపాడు. రాజు ప్రవర్తన చూసి రాణులూ, మంత్రులూ ఆశ్చర్యపోయారు. అదే విషయాన్ని అడిగారు. రాజు తాను దీన స్థితిలో ఉన్నప్పుడు అతను చేసిన సహాయాన్ని చెప్పి,

'ఆరోజు అతని కుటుంబం తాము తినే తిండి మాని, నాకు పెట్టారు. నేను బ్రతికుండకపోతే తిరిగి ఇక్కడికి వచ్చేవాణ్ణి కాదు. మరలా యుద్ధం చేసేవాణ్ణి కాదు. విజయం పొంది, ఈ రాజ్యాన్ని నిలబెట్టుకునేవాణ్ణే కాదు. ఈనాటి నా స్థితికి అతని సహాయమే కారణం. నిజం చెప్పాలంటే ఈ రాజ్యమే అతనిది. మనం ఎన్ని రకాలుగా ఎన్నెన్ని కానుకలు ఇచ్చినా అతని సహాయానికి సరితూగవు' అని చెప్పాడు.

...✍ బొర్రా గోవర్ధన్

తిరుప్పావై



ధనుర్మాస వ్రతం పూర్తి కావొస్తున్నది. భోగినాడు గోదా కల్యాణంతో తిరుప్పావై వ్రతం పూర్తవుతుంది. గోదాదేవి చెప్పిన చివరి మూడు పాశురాలు ఇవి.

28వ పాశురం

కఱవైగళ్ పిన్‌శెన్ఱుకానమ్ శేర్ న్దుణ్బోమ్
అఱివొన్ఱు మిల్లాద ఆయ్‌కులత్తు – ఉన్దన్నై
పిఱవి పెఱున్దనై పుణ్ణియమ్ యాముడైయోమ్
కుఱై వొన్ఱు మిల్లాద గోవిన్దా! ఉన్దన్నోడు
ఉఱవేల్ నమక్కి ఙ్గొళిక్క వొళియాదు!
అఱియాద పిళ్ళై గళోమ్ అన్బినాల్ ఉన్దన్నై
శిఱు పేరళైత్తనవుం శీఱి యరుళాదే
ఇఱైవా! నీతారాయ్ పఱయేలో రెమ్బావాయ్.

భావం

ఆలమందలతో కలిసి అడవుల్లో పడి తినే కుడిఎడమ తెలియని గోపకులము. నీవు తోడ బుట్టిన పుణ్యం మాది. లోకమర్యాదల లోతు ఎరుగని లేమలము. నిన్ను ప్రేమతో పిలుస్తున్నాము. కోపగించుకోకుండా కరుణించు స్వామీ. జగతికే మంగళం చేకూర్చు మన శ్రీవ్రతం.

29వ పాశురం

శిత్తుం శిరుకాలే వన్దు ఉన్నై చ్చే విత్తు, ఉన్
పొత్తామరై యడియే పోట్రుమ్ పొరుళ్ కేళాయ్
పెత్తం మేయ్ త్తుణ్ణుం కులత్తిల్ పిఱన్దు – నీ
కుత్తేవల్ ఎజ్గలై క్కొళ్ళామల్ పోగాదు
ఇత్తైప్పఱై కొళ్వానన్ఱుకాణ్ గోవిన్దా!
ఎత్తైక్కుమ్ ఏళేళుపిఱవిక్కుమ్, ఉన్దన్నోడు
ఉత్తోమేయావోం ఉనక్కేనామాట్చెయ్‌వోమ్
మత్తైనజ్కామజ్గల్ మాత్తేలో రెమ్బావాయ్.

భావం

తెల్లవారకముందే వచ్చి నిన్ను సేవిస్తున్నాము. నీ సుందర పాదారవిందాలను ప్రస్తుతి చేస్తున్నాము. మా గోకులంలో అవతరించి మన్ననలు పొందిన నీకు మేము చేసే సేవ వద్దనడం తగదు. ఏడేడు జన్మలకు.. ఎప్పటికీ నీతోనే వీడని బంధం కావాలి. నీ సేవల్లో తరించాలి. చిల్లర కోరికలు మాకొద్దు.

30వ పాశురం

వఙ్గక్కడల్ కడైన్ద మాదవనైక్కేశవనై
త్తిఙ్గల్ తిరుముగత్తుచ్చేయిళై యార్ శెన్ఱిఱైంజి
అఙ్గప్పఱైకొణ్డ వాత్తై అణిపుదువై
పైఙ్గమల త్తణ్డెరియల్ ప్పట్టర్ పిరాన్ కోదైశొన్న
శఙ్గత్తమిళ్ మాలై ముప్పదున్తప్పామే
ఇఙ్గపరిశురై పార్ ఈ రిరణ్డు మాల్వరైత్తోళ్
శఙ్గణ్ తిరుముగత్తు చ్చెల్వత్తిరుమాలాల్
ఎగుం తిరువరుళ్ పెత్తు ఇన్బుఱువరెమ్బావాయ్

భావం

ఓడల కడల కడలిని చిలికిన మాధవుడిని, కేశవుడిని చంద్రాననలు కోరి చేరి స్తుతించారు. వ్రేపల్లెలో పరను పొందారు. అదేవిధంగా భట్టనాథుని కోసం గోద చెప్పిన ముప్పది పాటలను క్రమం తప్పక పాడేవారు చతుర్భుజుడు, దివ్యముఖారవిందుడైన శ్రీమన్నారాయణుని కరుణను పొంది బ్రహ్మానందాన్ని అనుభవించుదురు గాక!

ఆండాళ్ తిరువడిగళే శరణమ్!



పర్వం..



పుష్యమాసంలో అన్ని రోజులూ పండుగ రోజులే. ముఖ్యంగా సంక్రాంతి. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన సంక్రాంతిని పండుగగా జరుపుకొంటాం. అందుకే దీన్ని రవి సంక్రాంతి అని కూడా అంటారు. సంక్రాంతి వస్తున్నదంటే ముందు నెల రోజుల నుంచే పండుగ హడావిడి మొదలవుతుంది. ఒకపక్క ధనుర్మాస వ్రతం, మరో పక్క రంగవల్లులతో ప్రతి ఇంటా ఆధ్యాత్మిక వాతావరణమే కనిపిస్తుంది. సకల శోభలను తీసుకువచ్చే సంక్రాంతి పండుగ ఆరోగ్యాన్నీ తెస్తుందంటారు. ముగ్గుల్లో ఆరోగ్యం, ఇంటికొచ్చిన పంటల్లో కొత్త వాసనలు, ఆత్మీయుల సమ్మేళనం, అప్పాల ఘుమఘుమలు.. సంక్రాంతి వేడుకలు ఇంతింతని చెప్పలేం. దేశ వ్యాప్తంగా కూడా పలుచోట్ల సంక్రాంతి పండుగను రకరకాల సంప్రదాయాలతో జరుపుకొంటారు. ఈ సంక్రాంతి స్పెషల్‌గా పండుగ విశేషాలు...



ఆరోగ్యం.. ఆధ్యాత్మికం..

సంక్రాంతి సంబురం

ఉత్తరాయణ పుణ్యకాలంలో మార్గశిర, పుష్యమాసాల్లో సంక్రాంతి వస్తుంది. సూర్యుడు ఒక్కొక్క నెలలో ఒక్కొక్క రాశిలోనికి వస్తూ మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. అలా సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడాన్నే మకర సంక్రమణం లేదా మకర సంక్రాంతి అంటారు. మన పూర్వులు సూర్యుని సంచారాన్ని రెండు భాగాలుగా విభజించారు. సూర్యుడు భూమధ్యరేఖకు ఉత్తర దిశలో ఉన్నప్పుడు ఉత్తరాయణమనీ, దక్షిణ దిశలో ఉన్నప్పుడు దక్షిణాయణమనీ అన్నారు. సంక్రమణ అంటే ఒకచోటి నుంచి మరో చోటికి జరిగే మార్పు అని అర్థం. సూర్యుడు తన నిరంతర కాల ప్రయాణంలో ధనూరాశిని వీడి మకర రాశిలోకి ప్రవేశిస్తాడో ఆ రోజును మకర సంక్రాంతిగా జరుపుకుంటారు.

సంక్రాంతి పండుగలో ముందుగా వచ్చేది భోగి పండుగ. భోగం గలది కాబట్టి భోగి అంటారు. భోగిరోజున బాగా గుర్తుండేవి భోగి పళ్లు, భోగి మంటలు. ఈరోజు కొత్త బియ్యం, పెసర పప్పు కలబోసి కిచిడి తయారుచేసి భోగి పురుషునికి నైవేద్యం పెడుతారు. భోగి పండుగ నాడు తెల్లవారుజామున స్నానానంతరం ప్రతి ఇంటి ముంగిట మంటలు వేస్తారు. ఈ మంటలలో ధనుర్మాసం నెల రోజులూ పెట్టిన గొబ్బెమ్మలను ఎండబెడితే వచ్చే పిడకలను దండలుగా గుచ్చుతారు. వాటిని, పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తని అక్కరకురాని చెట్టు మొద్దుల్ని గుండంలో పడేసి భోగి మంటలు వేస్తారు. ఈ భోగి మంటలతో పాతకు స్వస్తి చెప్పి, కొత్తకు స్వాగతం చెబుతారు. ఇది భోగ వాంఛ గలవారు చేసే అగ్ని పూజ. దీన్ని చేస్తే యజ్ఞం చేసినట్లు. 'శ్రీయమిచ్ఛేత్ హుతాశనాత్' అనేది వైదిక మంత్రం. అగ్ని నుండి సిరి సంపదల్ని ఆశించాలని ఆ మంత్రానికర్థం.




సాయంత్రం బొమ్మల కొలువు పెడుతారు. ఇంట్లో ఉన్న చిన్న పిల్లలకు భోగిపళ్లు పోస్తారు. నానబెట్టిన శనగలు, పూల రేకులు, చిన్న రేగుపళ్లు, చిల్లర పైసలు, అక్షింతలు కలిపి చంటి పిల్లల తల చుట్టూ మూడుసార్లు తిప్పి తల మీద పోస్తారు. వీటితో పాటు చెరుకు ముక్కల్నీ పోస్తారు. ఈ కార్యక్రమం ఆహ్లాదకరాన్ని ఇవ్వడమే గాక భోగిపళ్లలో కొన్ని ఔషధ గుణాలు కూడా ఉంటాయి.

ముగ్గుల్లో సైన్స్!

ఈ రోజుల్లో తెలుగు వాకిళ్లలో కళాకాంతులు నింపే ముగ్గులు ఆత్మనివేదన రూపాలని భావిస్తారు. దీనిలో ఆరోగ్య, ఖగోళ, జ్యోతిష విజ్ఞాన రహస్యాలెన్నో దాగి ఉన్నాయి. ఈ నెల రోజుల పాటు వాకిట్లో వేయాల్సిన ముగ్గులను గురించి పురాణాలు వర్ణించాయి. ఈ ముగ్గుల సంకేతాలలో సైన్స్ దాగివుందని అర్చనా శాస్త్రి అనే రచయిత్రి తన పరిశోధనలో నిరూపించారు. ఈ ముగ్గులలో పాము ముగ్గులు, చుక్కల ముగ్గులని ముఖ్యంగా రెండు రకాలుంటాయి. కేరళలో పాముల ముగ్గులకు పాశస్త్యం ఎక్కువ. తెలుగువాళ్లు చుక్కల ముగ్గులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. చుక్కని సంస్కృతంలో బిందువు అంటారు. బిందువు అనేది రూపం కావొచ్చు, నాదం కావొచ్చు. అది కూడా సృష్టికి సంకేతమే. ముగ్గు వేయడం ఒక కళాత్మక విజ్ఞానమని దానిలో ప్రకృతి పరిశీలన, ఆత్మ నివేదన ఉన్నాయని తాత్త్వికులు అంటారు.

మకర సంక్రాంతికి సాదరంగా రథంపై వీడ్కోలు చెప్పినట్లుగా ఉండే రథం ముగ్గును కనుమ రోజున వేస్తారు. భోగిరోజు బలి చక్రవర్తి భూలోకంలోకి వస్తాడని, సంక్రాంతి రోజు రాజ్యం ఏలి, కనుమనాడు వెళ్లిపోతాడని ఓ కథ కూడా ప్రాచుర్యంలో ఉంది.

పేడ నీళ్లతో గృహ ప్రాంగణాన్ని అలికి, శుభ్రం చేసి, గుల్ల సున్నపు పిండితో ముగ్గులు వేస్తారు. పేడ, ముగ్గులలోని కాల్షియం క్రిమి కీటకాల సంహారానికి తోడ్పడుతుంది. శరీరంలోని అనేక రోగాలను నిగ్రహించే శక్తిని దీని వాసన ప్రసాదిస్తుంది. ముగ్గులలోని కళాత్మకత, కళ్లకు సంబంధించిన నరాలను ప్రేరేపించి, సంతోష భావాన్ని మెదడుకు అందిస్తుంది. మొత్తానికి రంగవల్లులను దిద్దడం అనేది ఒక కళయే కాకుండా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని ప్రసాదించే మహత్తర సాధనం.



దేశవ్యాప్తంగా సంక్రాంతి...

- మహారాష్ట్రలో తీల్‌గూల్ అనే పేరుతో నువ్వులతో హల్వా చేసి, ఇంటింటికీ పంచుతారు. నువ్వులు, బెల్లం, చక్కెర కలిపి ఆల్‌గుడ్, ఆల్‌లడ్డూలు అని చేస్తారు. వీటిని 'ఆల్‌గుళ్‌ఘ్యా, గోడ్ గోడ్ బోలా' అని ఒకరికొకరు చెప్పుకుంటూ పంచుకుంటారు. పాత కోపాలు మరిచిపోయి స్నేహంగా ఉండాలని దీని అర్థం. పెళ్లయిన ఆడవాళ్లకు ఒక కొత్త పాత్రను బహుమతిగా ఇస్తారు. ఈ వేడుకను 'హల్దీ కుంకుమ్' అంటారు. మన దగ్గర పసుపుబొట్లు లాగ అన్నమాట.



- గుజరాతీలు కూడా నువ్వులు, మిఠాయిలు పంచిపెడతారు. పండుగ నాడు పెద్దలందరూ చిన్నవాళ్లకు బహుమతులు ఇవ్వడం ఇక్కడి ఆచారం. అహ్మదాబాద్‌లో అంతర్జాతీయ గాలిపటాల ఉత్సవం కూడా జరుగుతుంది. రాత్రిపూట 'తుకల్' అనే దీపాల గాలిపటాలను ఎగరేస్తారు.
- పంజాబ్‌లో ఈరోజున మిఠాయిలతో గోపాల వ్రతం చేస్తారు. మకర సంక్రాంతికి ముందురోజున 'లోడి' అనే ఉత్సవం జరుపుతారు. ఈరోజున వారు హోలి పండుగ లాగా ప్రతీచోట మంటలను వేసి, వాటిలో కాలుతున్న కట్టెలను నేలపై బాదుతూ ఆనందిస్తారు. భోగి పండుగను 'లోహరి'గా జరుపుకొంటారు. పెద్ద పెద్ద మంటలు వేసి, వాటిలోకి మిఠాయిలు, చెరుకు గడలు, బియ్యం విసిరేస్తారు. అక్కడ మకర సంక్రాంతి ఉత్సవాన్ని 'మాఘీ' అంటారు. చిన్నా పెద్దా అందరూ కలిసి భాగ్రా నృత్యం చేసి, విందు చేసుకుంటారు.
- ఉత్తర్ ప్రదేశ్‌లో సంక్రాంతిని పుణ్యదినంగా భావిస్తారు. గంగ, యమున, సరస్వతి నదులు కలిసే ప్రయాగలో స్నానం చేయడం అక్కడి ఆచారం. అలా చేయకపోతే వచ్చే జన్మలో గాడిదగా పుడతారని నమ్ముతారు. అక్కడి సంక్రాంతిని 'కిచెరి' అంటారు.
- ఒరిస్సాలోని గిరిజనులకు సంక్రాంతితో కొత్త ఏడాది మొదలవుతుంది. పెద్ద పెద్ద మంటలు వేసి, కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతారు.
- గంగానది సముద్రంలో కలిసే ప్రాంతమైన 'గంగాసాగర్'లో స్నానం చేయడం బెంగాల్ వాళ్ల ఆచారం. సగరుని కొడుకులను బూడిదగా మార్చిన కపిల మహర్షి ఆశ్రమం ఇక్కడికి దగ్గర్లోనే ఉంది. అందుకనే ఇక్కడ స్నానం చేస్తే పాపాలన్నీ తొలగిపోతాయని నమ్ముతారు.
- తమిళనాడులో సంక్రాంతిని పొంగల్ పేరుతో నాలుగు రోజుల పాటు జరుపుకొంటారు. భోగి రోజున కొత్త బియ్యం, పాలతో పాయసం చేసి, ఇంద్రునికి నైవేద్యం పెడతారు. మరుసటి రోజు సూర్య పొంగల రోజున సూర్యుడిని పూజిస్తారు. మట్టు పొంగల్ నాడు పశువులను అలంకరిస్తే కన్యా పొంగల రోజున పొంగల్ నైవేద్యం ముద్దలను పక్షులకు ఆహారంగా పెడతారు. సంక్రాంతి రోజున ఎడ్ల కొమ్ములను డబ్బులు కట్టి పరిగెత్తించి, వాటిని విప్పుకుని వచ్చే పోటీలు పెడుతారు.

స్నేహం పెంచే పండుగ

సంక్రాంతి రోజు ఉదయం నువ్వులు, బెల్లం తింటారు. బెల్లం లాగా తియ్యగా మాట్లాడుతూ, సహృదయంతో, పరోపకార బుద్ధితో జీవించాలని అర్థం. నువ్వుల నుండి నూనె వస్తుంది. నూనెకు స్నేహం అనే పేరుంది. స్నేహంగా అందరూ కలిసిమెలిసి జీవించాలని నువ్వులు చెప్తున్నాయి. వైద్యశాస్త్రంలో కూడా చలిని అణచడానికి నువ్వులు, నూనె ప్రయోగం గురించి చెప్పబడింది. సంక్రాంతి సమయంలో ఏయే దానాలు చేస్తారో ఆ వస్తువులన్నీ సూర్యప్రసాదం వల్ల పై జన్మలో లభిస్తాయని నమ్మకం. సంక్రాంతి వెళ్లిన మరునాడు కనుమ పండుగ. ఇది పశువుల పండుగ. మనకు ఎంతో మేలు చేసే పశువులకు కృతజ్ఞతగా పశువుల కొమ్ములకు, బండ్లకు రంగులు వేస్తారు. పశువులను పూజిస్తారు. మరుసటి రోజు ముక్కనుము. సంక్రాంతి పండుగ మూడు రోజులు వెళ్లిన అనంతరం మహిళలు చేసే వ్రతం సావిత్రి గౌరీ వ్రతం. దీనినే బొమ్మల నోము అని కూడా అంటారు.

...✍ వనిత విజయ కుమార్ ద్యాప

సువార్త



పరిపూర్ణుడిని చేసే పరీక్షలు!


పరీక్షకు గురికాకుండా ఏదీ రుజువు కాదు. కఠిన వ్యాయామం ద్వారా మన శరీర కండరాలు గట్టిపడుతాయి. ఉధృతంగా వీచే బలమైన గాలులను తట్టుకోవటం ద్వారా చెట్ల వేళ్లు బలపడుతాయి. భూగర్భంలో ఒత్తిడికి గురైన బొగ్గు వజ్రంగా మారుతుంది. కొలిమిలో కాలిస్తే ఉక్కు దృఢమవుతుంది. కానీ మానవులు కఠిన పరీక్షలు ఎదురవగానే వాటి నుంచి సాధ్యమైనంత త్వరగా తప్పుకొనే ప్రయత్నం చేస్తారు. ఇది మానవులకు ఉండే సహజమైన గుణం. దేవుడే మానవులకు కొన్నిసార్లు పరీక్షలు పెడుతుంటాడని పెద్దలు చెప్తుంటారు. ఆ సమస్యల నుండి బయటపడే మార్గాన్ని కూడా దేవుడే చూపిస్తాడు. ఈ పరీక్షా సమయం మానవులలో సహనాన్ని పెంపొందించి, ఆధ్యాత్మికంగా ఎదిగేందుకు దోహదపడుతుంది. 'శోధన సహించువాడు ధన్యుడు; అతడు శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించువారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును' (యాకోబు 1:12) అని బైబిల్ చెప్తుంది. దేవుడు మానవులకు కీడు కలుగజేసేందుకు వారిని శోధించడు. వారిని మరింత బలపరచడానికే పరీక్షలు పెడుతాడు.

కొన్నిసార్లు మానవుల్లోని దురాశ, దుర్బుద్ధి వారికి కష్టాలనుతెచ్చి పెడుతాయి. మనలోని దురాశలే పాపము చేసే దుర్బుద్ధిని కలిగిస్తాయి. దురాశలను నెరవేర్చుకోవడానికి మోసాలకు పాల్పడుతాము. ఈ మోసం అవిధేయతకు దారి తీస్తుంది. ఈ అవిధేయత దేవునికి దూరంగా మానవుని పతనం వైపు నడిపిస్తుంది. దక్షిణ అమెరికాలో మెటడార్ (చంపునది లేక నాశనం చేయునది) అనే ఒక వింత తీగ ఉన్నది. ఆ తీగ ఏదైనా ఒక చెట్టు మొదలులో ప్రారంభమై క్రమంగా పైకి ఎగబాకుతుంది. ఈ తీగ క్రమంగా పెరుగుతూ తాను పాకుతున్న చెట్టును నాశనం చేసేస్తుంది. చివరి వరకూ పెరిగిన తరువాత ఒక పూవు పూస్తుంది. మానవుల్లో పుట్టే దురాశ కూడా వారిని పతనం వైపే నడిపిస్తుంది. 'ప్రతివాడు తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడును. దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును' అని బైబిల్ చెప్తుంది (యాకోబు 1:14–15). మన దురాశ వల్ల కలిగే సమస్యలు మనలను అంతమొందించకముందే ప్రారంభంలోనే వాటిని కూకటివేళ్లతో పెకిలించి వేయాలి. దురాశ, దురాలోచనల వల్ల పరీక్షలు ఎదురైనప్పుడు దేవునివైపుచూడాలి. డేగపై కాకులు మూకుమ్మడిగా దాడి చేసినప్పుడు ఆ డేగ తిరిగి ప్రతిదాడి చేయదు. అది తెలివిగా అందనంత ఎత్తుకు ఆకాశం వైపు ఎగిరిపోతుంది. కాకులు అంత ఎత్తుకు ఎగురలేవు గనుక ఆ డేగను వెంటాడం మానేస్తాయి. దురాశలు, దురాలోచనలు మనలను చుట్టిముట్టినప్పుడు వాటికి దూరంగా, దేవునికి దగ్గరగా దైవ చింతనలో గడిపేందుకు ప్రయత్నించాలి.

ఉపనిషత్సుధ- 5

శ్రీరామకృష్ణ గురుదేవులు అంటారు, 'సముద్రం ఒడ్డున నిల్చుండి ఎంతకాలం ఎదురుచూసినా అది ఎదురుచూపుగానే మిగిలిపోతుంది. ఎన్నాళ్లున్నా చివరకు దొరికేవి గవ్వలు, గులకరాళ్లు మాత్రమే. ముత్యం కావాలంటే లోపలికి దూకాలి. ఈదాలి. వెదకాలి. ఆల్చిప్పలను పట్టాలి. అప్పుడే కొన్నైన ముత్యాలు లభిస్తాయి' ఎంతటి మార్గదర్శనం!

అంతరాన్వేషణ



అన్నిటికి మూలం ఆత్మే అని ఆగిపోకుండా, ఆ ఆత్మను, దాని మూలాలను వెతుక్కుంటూ ఉండాలి. ఎందుకు వెతకాలి? అదే అసలు మనం కనుకా!

'లోచూపు' కావాలి. 'లోనారసి' అంటే లోపలకు వెళ్లి, చూచి, అనుభవించి, అనుభూతిని పొంది, విభూతి స్థాయిని అందుకోవాలి. నమ్మకమే లేని స్థితి, నమ్మీ నమ్మని స్థితి, నమ్మకమే నడిపించే స్థితి మానవ జీవితంలో అనివార్యమైన స్థితులు.

తెలియదంటున్నవాడు, తెలిసి తెలియనట్లు ఉన్నదన్నవాడు, తెలుసుకుంటున్నానన్న వాడు ఉన్నారు. తెలుసుకున్న వాడు మాత్రం ఏమీ అనటం లేదు. అన్నిటికీ సాక్షిగా ఉన్నాడు. మాటలను దాటి మౌనం ద్వారా ప్రసారం చేస్తున్నాడు. అన్నింటికీ అతీతంగా ఉన్నాడు. మనం ఉంటున్న ఇదే ప్రపంచంలో ఉన్నా, తనతో తాను ఉంటున్నాడు. కానీ ప్రపంచంలో జరుగుతున్న సమస్త కార్యకలాపాలను ఏ ప్రమేయం లేకుండా చూస్తున్నాడు. సర్వానందమయ స్థితిని అనుభవమయం చేసుకుంటున్నాడు. తామరాకుపై నీటిబొట్టు వలె అంటక ఉండగలుగుతున్నాడు. ప్రతి చర్యలోనూ చైతన్యాన్ని, చైతన్యం వెనుక ఉన్న ఆత్మశక్తిని నిత్యానుభవం చేసుకుంటున్నాడు.

వస్తువు వెనుక ఉన్న యదార్థాన్ని దర్శిస్తున్నాడు. ఆ కారణంగా పైపైన జరుగుతున్న విషయాలను, అవి కలిగించే ప్రభావాలను గుర్తించకుండా తత్త్వానుభూతిని పొందుతున్నాడు. ఆ అనుభవమే, ఈ అభ్యాసమే ప్రకృతి రహస్యాలను చూడగల, చూపించగల ఆధ్యాత్మిక శాస్త్రవేత్తను చేస్తున్నది. ఆ కారణంగా జాతి, మత, వర్గ, వర్ణాతీతమైన మానవతావాదం, శాస్త్రంగా రూపుదిద్దుకొని ప్రకృతి మూలాలలో ఇమిడి ఉన్న సహజ సౌందర్యాన్ని బహిర్గతం చేస్తుంది. అప్పుడే జగత్తు సంపూర్ణంగా ఆవిష్కృతమవుతుంది.

ఆత్మాన్వేషణను ముందుగా స్థూల శరీర పరిమితులను విశ్లేషించుకుంటూ ప్రారంభించి, ఆపై సూక్ష్మ శరీరాన్ని ఆపై కారణ శరీరాన్ని దాటుకొని మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అనేబడే స్థితులను అధిగమించగలిగితే మిగిలేది ఆత్మే!

ఇదంతా నిత్య పరిశీలన, అనుష్ఠానం, సాధన వల్ల సాధ్యమయ్యేదే. సర్వత్రా ఆత్మనే దర్శించగల స్థితి కలిగిన తరువాత ద్వంద్వాలు లేవు. గుణగుణాలు లేవు. అనేకం లేవు.. ఏమీ లేవు.. ఉన్నదంతా ఆత్మే అన్న స్థిర భావన స్థిరమవుతుంది. ఆనందం స్వభావమవుతుంది. ఆనంద సాగరంలో తాను నిశ్చలుడై ఉంటాడు. ఎన్ని అలలు పుట్టనీ, ఎన్ని కెరటాలు ఎగిసిపడనీ, ఎన్ని తుంపరులు తాకనీ, తాను మాత్రం అచలుడై ఉంటాడు. 'కేనోపనిషత్' ప్రశ్నించుకుంటూ సమాధానం పొందమంటుంది. సాధ్యమైతే, నీ అంతట నీవే ప్రయత్నించమంటుంది. సాధ్యం కాకపోతే గురువును ఆశ్రయించమంటుంది. ఆత్మోన్నతి కలిగించే గురువును అనుసరించమంటుంది. ఆత్మను ఎరిగినవాడు మృత్యు భావనను జయిస్తాడు. భయం లేకుండా ఉంటాడు. ఎందరినో ఆ దారిని నడిపించగల నాయకుడు అవుతాడు, కర్తృత్వ భావన లేకుండా.

...✍ వి.యస్.ఆర్.మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

9.
నమస్తే తెలంగాణ
విహారం
[హైదరాబాద్]
శుక్రవారం 12 జనవరి 2018

ట్రావెలాగ్-3

ఢిల్లీ టు షాంఘై..

గేటు దగ్గర సెక్యూరిటీ గార్డు మా టిక్కెట్లు, పాస్‌పోర్ట్ చెక్ చేసి లోపలికి పంపించాడు. మానిటర్‌లో చూస్తే చైనా ఈస్ట్రన్ ఎయిర్‌లైన్స్ కౌంటర్ డిపార్చర్ లాంజ్‌లోని డి ఏరియాలో ఉందని తెలిసింది. కౌంటర్ ముందు క్యూలోకి వెళ్తూంటే యూనిఫాం లోని ఓ చైనా ఈస్ట్రన్ ఎయిర్‌లైన్స్ ఉద్యోగిని మా గమ్యం అడిగి తెలుసుకుంది. ఇమిగ్రేషన్ కార్డ్‌ని ఇచ్చి నింపమంది. హ్యాండ్ బ్యాగ్స్‌కి కట్టడానికి టేగ్స్ ఇచ్చింది.



మా లగేజ్‌ని బుక్ చేసుకుని రెండు బోర్డింగ్ పాస్‌లు ఇచ్చేదాకా షాంఘైలో విమానం మారాలని నాకు తెలీదు. టిక్కెట్‌లో ఫ్లయిట్ నెంబర్ యంయు 264 బీజింగ్ అని ఉండడంతో డైరెక్ట్ ఫ్లయిట్ అనుకున్నాను. కానీ అదే ఫ్లయిట్ నంబర్‌తో ముందు షాంఘైలో దిగి, ఇంకో విమానంలో బీజింగ్ వెళ్లాలని రెండు బోర్డింగ్ పాస్‌లని చూశాక తెలిసింది. సాధారణంగా అన్ని ఎయిర్‌లైన్స్ ఇలా విమానం మారాల్సిన సంగతిని ముందుగా సూచిస్తాయి. కానీ చైనా ఈస్ట్రన్ ఎయిర్‌వేస్ మాత్రం ఒకే ఫ్లయిట్ నంబర్ ఇచ్చి ఆ పని చేయలేదు. నిజానికి ఎస్ఓటిసి రిప్రజెంటేటివ్ అక్కడికి వచ్చి బోర్డింగ్ పాస్‌లు తీసుకునేదాకా మాకు సహాయం చేయాలి. కానీ బ్రీఫింగ్ షీట్‌లో పేర్కొన్న రూబీ అనే అతను రానేలేదు. పూర్వానుభవం వల్ల ఇమ్మిగ్రేషన్ కార్డులను నింపి, ఇమ్మిగ్రేషన్ కౌంటర్స్ దగ్గరికి వెళ్లాం. క్యూలోని నా వెనుక నార్త్ ఇండియన్ యువకుడు 'ఇమ్మిగ్రేషన్ ఫాం ఎలా నింపాలి?' అని అడిగాడు. అతను వెళ్లేది కెనడాకి. 'ఈ విమానం కెనడాకి వెళ్లదు. బీజింగ్ వెళ్తుంది' అని నేను చెప్తే, తాను షాంఘై దాకానే వచ్చి అక్కడి నుంచి టొరంటోకి విమానం మారి వెళ్తున్నానని చెప్పాడు. ఎందుకంటే అలా వెళ్తే చవక అవుతుందట.

అతను ఇమ్మిగ్రేషన్ కౌంటర్‌కి వెళ్లిపోయాక అక్కడే మా వంతు కోసం నిలబడ్డాం. ఏదైనా కౌంటర్ చూపించి వెళ్లమని చెప్పేదాకా వెళ్లకూడదన్నది నియమం. మా వంతు వచ్చాక ఇమ్మిగ్రేషన్ ఆఫీసర్‌కి బోర్డింగ్ పాస్‌ని, పాస్‌పోర్ట్‌ని చూపించాం. మా చైనీస్ వీసాలను చెక్ చేసి అతను మా రెండు పాస్‌పోర్ట్‌లలో ఇమ్మిగ్రేషన్ స్టాంప్ కొట్టి వెనక్కి ఇచ్చేశాడు. తర్వాత సెక్యూరిటీ చెక్. డొమెస్టిక్ సెక్యూరిటీ చెక్ పద్ధతే ఇక్కడ కూడా. ఓ యూరోపియన్ హేండ్ బేగేజ్‌ని సెక్యూరిటీ వాళ్లు తెరిచి వెదికితే అందులోంచి చాకు బయటపడింది. ఎందుకు పెట్టావని అడిగితే, 'ఏపిల్ కోసుకోవడానికి' అని చెప్పాడతను. దాన్ని తీసేసి మళ్లీ ఆ బేగ్‌ని స్కానింగ్‌కి పంపారు. పదునైన వస్తువులను హేండ్ లగేజ్‌లో అనుమతించరు.

అప్పుడు రాత్రి 12.30.

మానిటర్ చూస్తే విమానం అరగంట లేటని తెలిసింది. డిపార్చర్ గేట్ లాంజ్‌లో కూర్చున్న మా దగ్గరికి ఒకతను వచ్చి, 'మీరు ఎస్ఓటిసి గ్రూప్‌లో చైనాకి వస్తున్నారా?' అని అడిగాడు. తన పేరు గుప్తా అనీ, భార్యతో కలిసి వస్తున్నాననీ, గుర్‌గావ్ నుంచనీ చెప్పాడు. మా బేగ్ మీది ఎస్ఓటిసి అక్షరాలని చూసి మమ్మల్ని గుర్తుపట్టాడట. కొత్త అనే జంకు లేకుండా చనువుగా మాట్లాడే స్వభావం అతనిది. టూర్‌లోని అందరితో అతను కలివిడిగానే ఉన్నాడు. మాకు అప్పుడు పరిచయం లేదు గానీ వీరిద్దరూ గాక మరో ఇద్దరు కూడా మా టూర్‌కి అదే ఫ్లయిట్‌లో వస్తున్నారు.

అతను ఎస్ఓటిసి బేగ్‌తో ఉన్న మరో జంటని 'మీరూ చైనా టూర్‌కేనా?' అని అడిగాడు. తాము వెళ్లేది అమెరికా టూర్ అనీ, వయా షాంఘై, న్యూయార్క్ వెళ్తున్నామనీ చెప్పాడు. ఇలా వయా షాంఘై వెళ్లే ఇంకొక వ్యక్తిని చూసిన తరువాత చైనా ఈస్ట్రన్ ఎయిర్‌వేస్ టిక్కెట్లు చవక అని గ్రహించాను.

డిపార్చర్ గేట్ లాంజ్‌లో కూర్చున్న అందర్నీ చైనా ఈస్ట్రన్ ఉద్యోగస్థులు బయటికి పంపి, మళ్లీ క్యూలో లోపలికి రమ్మన్నారు. లోపలికి వచ్చేటప్పుడు అందరి బోర్డింగ్ పాస్‌లని చెక్ చేశారు. బోర్డింగ్ పాస్‌ని స్కాన్ చేసేటప్పుడు 'మాకు వెజిటేరియన్ మీల్స్ బుక్ అయిందా?' అని అడిగాను. చైనీస్ సంగతి తెలిసిన వాళ్లు వారి విమానంలో నాన్ వెజ్ తినరనుకుంటూ విమానం మొత్తం వెజిటేరియన్ మీల్స్ ఇస్తారని చెప్పాడు. సీట్ల వరుసల ప్రకారం ప్రయాణికులను విమానంలోకి అనుమతించారు. చైనా ఈస్ట్రన్ ఇన్ ఫ్లయిట్ మేగజైన్ మొత్తం చైనీస్ భాషలోనే ఉంది. ఒక్క ఫ్లయిట్ సేఫ్టీ కార్డులో మాత్రం చైనీస్‌తో పాటు ఇంగ్లీష్ కూడా ఉంది.

విమానం ఆలస్యంగా 3.40కి బయలుదేరింది. డిన్నర్‌గా జీరా రైస్, శనగల కూర, బన్, వెజ్ సలాడ్ (కీరా, టమాట ముక్కలు) ఇచ్చి, కాఫీ, టీ లేదా జ్యూస్‌లను సర్వ్ చేశారు. టీవీ ఉంది గానీ అన్నీ చైనీస్, కొరియన్ సినిమాలే. వేటికీ సబ్ టైటిల్స్ లేవు. కాబట్టి చూడలేదు. ఢిల్లీ నుంచి షాంఘైకి 4,876 కిలోమీటర్లు. మా విమానం కాన్పూర్, ఢాకా, కున్‌మింగ్, గుయాంగ్‌ల మీదుగా షాంఘైకి చేరుకోవడానికి ఐదున్నర గంటలు పట్టింది.

(ఇంకా ఉంది)

...✍ మల్లాది వెంకట కృష్ణమూర్తి



టూర్ ప్లానింగ్ టైమ్ ఉన్న వాళ్లెవరైనా వేస్తారు..
దమ్మున్నవాళ్లే సాహస యాత్రలకు పూనుకొంటారు..
ఆ అడ్వెంచరస్ ట్రిప్‌లో మాంచి కిక్ ఉందంటారు..
అలాంటి ట్రిప్పుల కోసం ఉత్సాహం చూపిస్తుంటారు.
ఆ అడ్వెంచరస్ టూరిస్టుల కోసమే.. ఈ అడ్వెంచర్ టూర్‌స్పాట్ల వివరాలు..

'సాహస' మేరా యాత్ర

లడక్‌లో ట్రెక్కింగ్ :

జమ్మూకశ్మీర్‌లోని ఎత్తయిన పర్వతప్రాంతాల్లో ఒకటి లడక్. కున్లున్ పర్వతాల నుంచి దక్షిణ హిమాలయాల వరకు విస్తరించి ఉన్న ప్రాంతంలో ఇండోఆర్యన్ సంతతికి చెందిన ప్రజలు ఎక్కువగా నివసిస్తారు. ఇక్కడి ఇండస్‌లోయ చూడదగిన ప్రదేశం.



కొండలపై ఉండే నిర్మాణాలు చూడముచ్చటగా ఉంటాయి. కొండలు ఎక్కేసమయంలో ఉండే మలుపు రోడ్లపై ప్రయాణం పర్యాటకులకు సరికొత్త అనుభూతినిస్తుంది. ఇక్కడి జాంస్కర్ వ్యాలీలో ఉన్న ఫ్రోజెన్ ట్రైల్ ట్రెక్ ప్రత్యేకమైనది. మంచుతో కప్పబడిన ఈ నదిపై నడువడం నిజంగా సాహసమే. చుట్టూ గుహలు.. అదొక అందమైన అనుభూతి. ముఖ్యంగా అడ్వెంచరస్ ట్రిప్స్ ఇష్టపడేవాళ్లకు ఇది మంచి విజిటింగ్ స్పాట్.

ఎలా వెళ్లాలి
దేశరాజధాని ఢిల్లీ నుంచి జమ్మూ వరకు రైలులో వెళ్లి, అక్కణ్నుంచి బైకుల మీద, కార్లలో, జీపుల్లో వెళ్లొచ్చు. ఢిల్లీ నుంచి లడక్‌కు బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ.. సుమారు నలభై గంటల ప్రయాణం అవుతుంది. అయితే ఇక్కడికి సొంత వాహనాల్లోనూ వెళ్లొచ్చు.

ఎయిర్ బెలూనింగ్@జైపూర్

రాజస్థాన్ అంటేనే పెద్దపెద్ద కోటలకు, ప్యాలెస్‌లకు కేరాఫ్ అడ్రస్. అలాంటి కోటలను, అందమైన ప్యాలెస్‌లను మామూలుగా చూడడం వేరు.. ఆకాశంలో విహరిస్తూ చూడడం వేరు. అలాంటి స్పెషల్ ఎక్స్‌పీరియన్స్ ఇప్పుడక్కడ అందుబాటులో ఉన్నది. అదే ఎయిర్ బెలూనింగ్. భారీ బెలూన్‌కు కింది భాగంలో అరేంజ్ చేసిన ఒక క్యాబిన్‌లో కూర్చుని.. ఈ సాహస ప్రయాణం చేయవచ్చు. అందమైన జైపూర్ వీధుల్ని మరింత అందంగా కెమెరాల్లో బంధించవచ్చు. అక్కడ ఈ రైడ్స్ ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తారు.

ఎలా వెళ్లాలి: జైపూర్‌కు హైదరాబాద్ నుంచి అన్ని రకాల రవాణాసౌకర్యం అందుబాటులో ఉన్నది. విమానం, ట్రైన్, బస్ ప్రయాణాల ద్వారా అక్కడికి చేరుకోవచ్చు.



ఎగిరే పక్షుల్లా..



అబ్బ! వినడానికి ఎంత బాగుందో కదా! మనుషులు పక్షుల మాదిరి ఆకాశంలో విహరించడమంటే ఫీలింగ్ అలాంటే ఉంటుంది మరి. అలాంటి అడ్వెంచర్ ఫీట్‌ను చేయాలంటే.. మైసూర్ వెళ్లాల్సిందే. అక్కడ ఇలాంటి స్కైడైవింగ్‌లు ఆఫర్ చేస్తున్నాయి కొన్ని సంస్థలు. ప్రొఫెషనల్స్ సమక్షంలో శిక్షణ ఇప్పించి మరీ.. ఈ డైవ్స్ చేయిస్తున్నారు. అంటే విమానంలో కొంత ఎత్తుకు వెళ్లిన తర్వాత.. తగిన డ్రెస్సును ధరించి అక్కణ్నుంచి గుంపులుగా దూకేయడం ఈ ఫీట్‌లో ఒక మధురమైన అనుభూతి. గాల్లో అలా తేలియాడుతుంటే ఆ ఫీలింగే వేరబ్బా. త్వరలోనే మీ అడ్వెంచరస్ టూర్ లిస్టులో మైసూర్‌ను కూడా చేర్చుకోవడం మర్చిపోకండి మరి.

ఎలా వెళ్లాలి: హైదరాబాద్ నుంచి మైసూర్‌కు విమానం, ట్రైన్ లేదా బస్సు ద్వారా వెళ్లవచ్చు. సొంత వాహనాల్లోనూ రోడ్డు మార్గం ద్వారా అక్కడికి చేరుకోవచ్చు.

ఇసుక దిబ్బలపై నడుక

జైసల్మేర్‌లో ఇసుక దిబ్బలపై నడుక సూపర్ ఎక్స్‌పీరియన్స్. కేవలం అక్కడి ఎడారిలో దారిని ఏర్పరిచేందుకే ఈ దిబ్బలు. వీటి మీది నుంచి నడువడం ఒక మరిచిపోలేని అనుభూతి. దిగబడిపోయే ఈ ఇసుక దిబ్బల్లో నడువడం నిజంగా ఒక అడ్వెంచర్.

ఎలా వెళ్లాలి: హైదరాబాద్ నుంచి జైసల్మేర్‌కు డైరెక్ట్ ఫ్లైట్స్ ఉన్నాయి. రైళ్లలో వెళ్లదలచుకొంటే, అహ్మదాబాద్ వరకు వెళ్లి, అక్కణ్నుంచి బస్సుల్లో జైసల్మేర్ చేరుకోవచ్చు. దేశరాజధాని ఢిల్లీ నుంచి కూడా విమాన, రైలు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.



మీ కాళ్ల కిందే ప్రపంచం



హిమాచల్ ప్రదేశ్‌లోని బిర్‌బిల్లింగ్‌లో పారాగ్లైడింగ్ ఒక అద్భుతమైన అనుభూతినిస్తుందునడంలో ఎలాంటి సందేహం లేదు. మంచు కొండలపై నుంచి ప్యారాచూట్ సాయంతో ఎగురుతుంటే.. మన కాళ్లకిందే ప్రపంచం ఉన్నట్టు అనిపిస్తుంది. ప్రొఫెషనల్స్ పర్యవేక్షణలో ఈ అడ్వెంచరస్ ఫీట్లు జరుగుతాయి కాబట్టి కంగారు పడాల్సిందేమీ ఉండదు. సూపర్ ఫన్ మీ సొంతమవుతుంది.

ఎలా వెళ్లాలి: ఈ ప్రదేశానికి డైరెక్టుగా వెళ్లేందుకు రవాణా సదుపాయం లేదు. న్యూఢిల్లీ, హైదరాబాద్ సహా ఇతర నగరాల నుంచి ట్రైన్ ద్వారా షిమ్లా చేరుకొని అక్కణ్నుంచి లోకల్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా బిర్‌బిల్లింగ్ చేరుకోవచ్చు.

స్క్యూబా డైవింగ్ ఇన్ అండమాన్



రెగ్యులర్‌గా స్విమ్మింగ్ చేసేవారు స్క్యూబా డైవింగ్ అంటే చాలా ఇష్టపడుతారు. కాకపోతే లోతైన, శుభ్రమైన సముద్రపు నీటిలో చేస్తేనే.. దాంట్లో కిక్ ఉంటుంది. అలాంటి ప్లేస్‌లకు పెట్టింది పేరు అండమాన్. ఈ ద్వీపాలలో చాలా డైవింగ్ సైట్లు ఉన్నాయి. ముఖ్యంగా హేవ్లాక్ దీవులు స్క్యూబా డైవ్ చేయడానికి చక్కని స్పాట్‌గా చెప్పొచ్చు. పేరుకు తగ్గట్టే ఈ ఐస్‌ల్యాండ్ మిమ్మల్ని అక్కడే ఉండేలా లాక్ చేసేస్తుంది. ఇక్కడ వాటర్ జైంట్స్‌తో ఈతకొట్టడం మధురానుభూతిని మిగులుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. సాహస యాత్రలు చేయాలనుకొనే వారికి.. ఇది తప్పకుండా మంచి డెస్టినేషన్ అవుతుంది.

ఎలా వెళ్లాలి: పోర్ట్‌బ్లెయిర్ నుంచి ప్రభుత్వ పర్యాటక శాఖ నడిపే పడవల్లో, ప్రైవేట్ క్రూయిసెస్‌లో హ్యావ్‌లాక్ ఐస్ల్యాండ్‌కు చేరుకోవచ్చు.

ఫ్లైబోర్డ్ ఎట్ గోవా



సముద్రంలో డాల్ఫిన్ల మాదిరిగా ఎగురుతూ హ్యాపీగా గడపాలనుందా? అయితే తప్పకుండా మీరు గోవాలోని బైనా బీచ్‌కు వెళ్లితీరాల్సిందే. ఇప్పుడు ఇండియాలో క్రేజీ వాటర్ స్పోర్ట్‌గా మారిన ఫ్లైబోర్డ్ గేమ్‌ను సూపర్‌గా ఎంజాయ్ చేయొచ్చు. కాళ్లకు చెక్కలాంటి ఒక మిషన్‌ను అమర్చుకొని అలా అలలపై దూసుకెళ్లిపోవచ్చు. దీనికి అమర్చిన వాటర్ ప్రెషర్ పంపుల సాయంతో.. నీటిపై సుమారు పదిహేను మీటర్ల ఎత్తువరకు ఎగిరి మళ్లీ యథాస్థితిలో నీటిపై దూసుకెళ్లొచ్చు. యంగ్‌స్టర్స్‌కు ఇది మంచి అడ్వెంచరస్ అండ్ ఫన్ గేమ్ ఫ్లైబోర్డ్.

ఎలా వెళ్లాలి: గోవాకు ఎలా వెళ్లాలి అనే విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు. అన్ని నగరాల నుంచీ గోవాకు విమాన, రైలు, రోడ్డు మార్గాల ద్వారా ట్రాన్స్‌పోర్ట్ అందుబాటులో ఉంది. అక్కణ్నుంచి లోకల్ వెహికిల్స్‌లో బైనా బీచ్‌కు చేరుకోవచ్చు.

బంగీ జంప్ ఇన్ రిషికేష్:

సుమారు 80 మీటర్ల ఎత్తున్న పెద్ద కొండను ఎక్కి కిందికి చూస్తే వామ్మో కళ్లు తిరుగుతున్నాయ్ అంటారు. అలాంటి అంత ఎత్తు నుంచి జంప్ చేస్తే ఎలా ఉంటుంది? అదేంటి! అలా చేస్తే ప్రాణాలు ఉంటాయా? అని అనుకుంటున్నారా. అదేం లేదు.. ఇదొక భంగీ జంప్ లాంటిది. ఫుల్ ప్రొటెక్టివ్‌గా ఉంటుంది. ఇంతకీ ఎక్కడ అంటారా? ఇంకెక్కడ ఉత్తరాఖండ్‌లోని ఆధ్యాత్మిక క్షేత్రం రిషికేష్‌లో. సాహసాలు చేయాలనుకొనే వారికి.. ఈ ఔట్‌డోర్ అడ్వెంచర్ కచ్చితంగా నచ్చుతుంది. టైమ్ చూసుకొని ప్లాన్ చేసుకోవచ్చు.



ఎలా వెళ్లాలి: న్యూ ఢిల్లీ నుంచి రిషికేష్‌కు బస్ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. ఆరు నుంచి ఏడు గంటల సమయం పడుతుంది.


డిఫరెంట్ ట్రెక్కింగ్@అపాటనీ

ట్రెక్కింగ్ అంటే తెలియని వాళ్లుండరు. కానీ ఇక్కడ చేసే ట్రెక్కింగ్ ప్రత్యేకమైనది. సరైన రోడ్డు లేకుండా కొండలు, లోయలు ఎక్కిదిగాల్సి ఉంటుంది. కానీ అదొక డిఫరెంట్ ట్రెక్కింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను మిగులుస్తుందనడంలో సంశయం అవసరం లేదు. ఈ దారిలో అతి ప్రాచీనమైన గిరిజన తెగ అపాటనీని కలుసుకోవచ్చు. వారి ప్రత్యేకమైన జీవనశైలి విశేషంగా ఆకట్టుకుంటుంది. అదే ఈ ట్రెక్కింగ్ స్పెషాలిటీ.

ఎలా వెళ్లాలి: అరుణాచల్ ప్రదేశ్‌లోని దిబ్రుగర్ ఎయిర్‌పోర్టు చేరుకున్నాక, అక్కణ్నుంచి షిలాపత్‌పూర్ వెళ్లాలి. అక్కణ్నుంచి లోకల్ ట్రాన్స్‌పోర్ట్ సాయంతో జిరోకు చేరుకోవచ్చు.



పురాతన కొండ గుహలు



ప్రాచీనమైన కొండ గుహలకు పెట్టింది పేరు మేఘాలయ. భూమ్మీద థ్రిల్‌ను పంచే అందమైన గుహలు ఉన్నాయంటే అది ఒక్క మేఘాలయలోనే. కొన్ని చిమ్మ చీకట్లను కలిగి ఉంటే, మరికొన్ని నీటి నిల్వలతో ఉంటాయి. మీ అటెన్షన్‌ను ఏమాత్రం వాటి మీద నుంచి తిప్పుకోనివ్వకుండా చేస్తాయి.

ఎలా వెళ్లాలి: న్యూ ఢిల్లీ నుంచి షిల్లాంగ్ చేరుకొని అక్కణ్నుంచి కేవ్స్ ఉండే ప్రాంతానికి లోకల్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా వెళ్లవచ్చు.

నా ప్రయాణం

మీరు తరచుగా ప్రయాణాలు చేస్తుంటారా? దేశవ్యాప్తంగా ఊళ్లు చుట్టి వస్తుంటారా? పుణ్యక్షేత్రాలైనా, విహారయాత్రలైనా... వినోదం కోసమైనా, విజ్ఞానం కోసమైనా... మీరు చేసిన ప్రయాణం మాకెంతో ప్రియమైనది. మీ ప్రయాణానుభవాలు మరెందరికో ఉపయోగపడవచ్చు. సరదాగా నిరంతర ప్రయాణాలు చేస్తున్నా, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం అప్పుడప్పుడూ టూర్లు వెళ్తున్నా... మీరు వెళ్లిన ప్రదేశం, దాని విశిష్టత, అక్కడి మీ అనుభవాలు, వెళ్లడానికి కారణాలు... వివరంగా మాకు రాసి పంపండి. మీ భాశాలూ, భావోద్వేగాలు, అనుభవాల సమాహారాన్ని పేపర్‌పై పెట్టండి. అక్షరబద్ధం చేయండి. అంతేకాదు.. మీ ఊళ్లో, మీ చుట్టుపక్కల ప్రదేశాల్లో ఏమైనా ప్రత్యేకతలున్నా, పుణ్యక్షేత్రాలూ, జాతరలూ, ప్రత్యేక సంప్రదాయాలున్నా మాకు తెలుపండి. మీ పేరుతో ప్రచురిస్తాం.

మరింకేం.. రాయడం మొదలుపెట్టండి.

మా చిరునామా
విహారం (నా ప్రయాణం)
నమస్తే తెలంగాణ
తెలంగాణ పబ్లికేషన్స్ ప్రై. లిమిటెడ్
రోడ్ నెం. 10, బంజారాహిల్స్
హైదరాబాద్ - 500 034
viharam@ntdaily.news

సుడోకు

డైలీ సుడోకు 97 సమాధానం

5	6	7	3	2	1	8	4	9
4	3	9	5	7	8	6	2	1
1	2	8	9	6	4	5	3	7
2	1	4	6	3	7	9	8	5
7	8	3	4	5	9	2	1	6
6	9	5	8	1	2	4	7	3
8	4	6	7	9	3	1	5	2
9	7	1	2	4	5	3	6	8
3	5	2	1	8	6	7	9	4

డైలీ సుడోకు -98

7			1	5				8
		4			2			
					4	5	6	
6							2	9
5		2				8		4
3	4							1
	3	8	6					
			2			9		
1				8	7			3

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

నా ప్రయాణం

ప్రయాణంలో పదనిస!

వందలు, వేల కిలోమీటర్ల పాటు చేసే వాటినే ప్రయాణాలు అనాలా! వాటిలోనే విశేషాలుంటాయని అనుకోవడం కరెక్ట్ కాదు. ఎందుకంటే స్థానికంగా జరిగే నిత్యప్రయాణాల్లోనూ అలాంటి అనుభూతులు, అంతకు మించి నవ్వుతెప్పించే సంఘటనలూ జరుగొచ్చు. అలాంటిదే నా ఈప్రయాణం.

అప్పుడు డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నా. అందరు అబ్బాయిల్లాగే నాకూ కాలేజ్‌కి బైక్‌పై వెళ్లాలన్న ఆసక్తి ఏర్పడింది.ఎన్నో అలకలు, ఉపవాసదీక్షలు చేశాక నాన్న బండి కొనిచ్చాడు.

నాన్న ఉద్యోగం, మా చదువులరీత్యా మేముండేది సంగారెడ్డిలో. మా స్వస్థలం జహీరాబాద్ దగ్గర ఒక ఊరు. ఊళ్లో మా నాన్నమ్మ ఒక్కత్తే ఉంటుంది. అక్కడ ఉండే మా పొలాల్లో జరుగుతున్న పనుల్ని చూసుకొనేందుకు ప్రతీ వీకెండ్‌లో నాన్న వెళ్లొచ్చేవాడు. బైక్ కొనిచ్చాక.. ఆయనను నేనే తీసుకెళ్లడం ప్రారంభించా. అలా నాన్నకు నా రూపంలో మంచి డ్రైవర్ దొరికాడు (నిజానికి నాకూ బైక్ నడుపాలని సరదా). ఎప్పటిలాగే ఆ వీకెండ్‌లో నాన్నను బైక్‌పై ఎక్కించుకొని మా ఊరికి వెళ్తున్నా. ఇక ఈ ప్రయాణమే నన్ను మా ఇంట్లో వాళ్లందరి ముందూ తల దించుకొనేలా చేసింది. మతిమరుపు మారాజుగా ముద్ర వేసేసింది. సంగారెడ్డి నుంచి మా ఊరు వెళ్లాలంటే ముంబై హై వే మీద సుమారు నలభై కిలోమీటర్ల ప్రయాణం. ఆ మార్గమధ్యంలోనే మా అమ్మమ్మా వాళ్ల ఊరు ఉంటుంది. ' మీ అమ్మమ్మావాళ్లను ఓసారి పలుకరించి వెళ్దాం పదా' అని నాన్న అనడంతో బండిని ఊళ్లోకి పోనిచ్చా (మామూలుగా అయితే వద్దులే అనేవాణ్నేమో, కొత్తబండితో బిల్డప్ ఇవ్వాలనే ఉత్సాహం నాది). అసలే మా నాన్న పెద్దల్లుడు. మర్యాదలు మామూలు రేంజ్‌లో ఉండవు కదా. కాళ్లు కడుక్కున్నాం. భోజనాలు కానిచ్చేశాం. అలా మధ్యాహ్నం వరకూ అక్కడే గడిచిపోయింది. ఇక బయల్దేరడానికి సిద్ధమయ్యాం. అసలే వాళ్లిల్లు ఒక గుట్టమీద కోటలా ఉంటుంది. సాగనంపేందుకు కిందకు దిగిరావాలి. బండేమో కిందనే పార్క్ చేశాను. సాగనంపేందుకు వస్తున్న మా మామలు నాన్నతో మాట్లాడుతూ మెల్లగా నడుస్తూ కిందికి దిగొస్తున్నారు. నేనేమో ముందే పరిగెత్తుకొచ్చి బండిని స్టార్ట్ చేయడానికి రెడీగా ఉన్నా. ఇంతలో నాన్న వాళ్లు వస్తున్నట్టు మాటల శబ్దం విని గుర్తించాను. బండి కిక్ కొట్టాను. వాళ్లతో నాన్న 'ఇక పొయ్యొస్తా' అని చెప్పడం వినబడిందంతే..! 'నాన్న ఎక్కేశాడనుకొని బండిపై రుయ్యున దూసుకెళ్లిపోయానంతే'. కనీసం నాన్న ఎక్కాడా లేదా అని కూడా చూసుకోలేదు. మెయిన్‌రోడ్డు మీద నిలబడిన మా చిన్న మామ కూడా ఒంటరిగా వెళ్తున్నాడేంటని అనుమానం వచ్చి పిలిచాడట. (అయినా పట్టించుకోలేదట. తర్వాత కలిసినప్పుడు చెప్పారు.) అయినా పట్టించుకోలేదు. అక్కణ్నుంచి మా ఊరు సుమారు 20 కిలోమీటర్లు. అంత దూరం ఒక మనిషి వెనుకాల కుర్చున్నాడా లేదా అని పట్టించుకోకుండా వెళ్లడం నిజంగా నాకే చెల్లుతుందేమో. ఆ మొత్తం దూరంలో ఒక్కసారి కూడా నాకు అనుమానం రాలేదు. వెనుక నాన్న ఉన్నాడా లేడా, మాటలేం వినబడడం లేదు అనే అనుమానమే రాలేదు. మధ్యాహ్నం సమయం కావడం, అప్పుడే భోజనం చేయడం వల్ల మత్తు ఆవహించిందేమో! ఇంటికెళ్లి బైక్ పార్క్ చేస్తూ లోపలికి వెళ్తుండగా.. మా నాన్నమ్మ 'ఏం రా మీ అప్ప రాలేదా?' అని అడిగింది. అప్పటికీ నాకింకా స్ట్రైక్ కాలేదు విషయం. చేసిన నిర్వాకం చాలదన్నట్టు.. తిరిగి మా నాన్నమ్మనే దబాయించా.. దమాక్ కరాబ్ అయిందా అని. అప్పుడు అసలు విషయం అర్థమైంది.. అసలు అమ్మమ్మా వాళ్ల ఊళ్లో బైక్‌పై నాన్న ఎక్కనేలేదని. ఆయన ఎక్కక ముందే బైక్‌మీద దూసుకొచ్చేశానని. వెంటనే నాన్న మొబైల్‌కు కాల్‌చేశా. అప్పుడు చూడాలి మా నాన్న రియాక్షన్. లైఫ్‌లో మర్చిపోలేను. ఇంటికొచ్చాక అమ్మావాళ్లకు చెబితే.. పడిపడి నవ్వడం వాళ్ల ఒంతయ్యింది. బిక్క మొహం వేసుకొని కూసోవడం నా వంతైంది. కొత్త బైక్ అనే ఉత్సాహమా, లేక మధ్యాహ్నం భోజనంతో నిద్ర ఎఫెక్టా.. లేక నామీద ఆ సమయంలో ఏమైనా అదృశ్యశక్తి పూనిందా.. అనే విషయం ఇప్పటికీ నాకర్థం కాని బిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ అనుభవం గుర్తొచ్చే.. పెళ్లయిన తర్వాత మా ఆవిడతో కలిసి భద్రాచలం వెళ్తుంటే మా నాన్న ఆమెను పిలిచి 'మీ ఆయనతో కాస్త జాగ్రత్త, చేయిని అస్సలు విడువకు. పక్కనున్న మనిషిని కూడా మార్చిపొయ్యొస్తాడు' అని జాగ్రత్త చెప్పాల్సొచ్చింది. అసలు విషయం తెలిసి నా అర్ధాంగి కూడా పగులబడి నవ్వుకున్నది. ఆరోజలా జరిగిన నా బైక్ ప్రయాణం.. ఒక అందమైన నవ్వుల జ్ఞాపకాన్ని మిగిల్చింది. అది గుర్తొచ్చినప్పుడల్లా మరిచిపోలేని నా మతిమరుపు సంగతి గుర్తొస్తుంది.



...✍ నరేశ్


సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రై.) లిమిటెడ్
నేడే విడుదల
సంక్రాంతి కి సందడి
జై సింహా
సి. కళ్యాణ్ కె.యస్. రవికుమార్
సి. వెంకటేశ్వరరావు - పత్స నాగరాజా చిరంతన్ భట్
యం.రత్నం సి.రాంప్రసాద్ రామ్-లక్ష్మణ్ ప్రవీణ్ ఆంథోని అన్‌బరివు వెంకట్ నారాయణరెడ్డి వంశీ శేఖర్
ADITYA
U/A

పెట్టుబడి పథకం మార్గదర్శకాలపై కసరత్తు

- క్షేత్రస్థాయి అధికారులతో విస్తృత చర్చలు
- వారం రోజుల్లో ఖరారు కానున్న విధివిధానాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎకరానికి రూ.4 వేల పెట్టుబడి సొమ్మును చెక్కులరూపంలో అందజేసేలా మంత్రివర్గ ఉపసంఘం తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేసేందుకు విధివిధానాల రూపకల్పనపై వ్యవసాయశాఖ కసరత్తు మొదలుపెట్టింది. సాగుభూమి ఉన్న ప్రతీ రైతుకు ఎకరానికి రూ.4వేల చొప్పున అందించాలని ఉపసంఘం నిర్ణయించిన విషయం తెలిసిందే. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 1.42 కోట్ల ఎకరాల సాగు భూమి ఉన్నట్టు అధికారులు తేల్చారు. రైతులకు 71 లక్షల బ్యాంకు ఖాతాలున్నాయని గుర్తించారు. ఉపసంఘం నిర్ణయాలకు అనుగుణంగా పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించే పనిలో వ్యవసాయాధికారులు నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో రైతుల సంఖ్య, గ్రామంలో ఎంతమంది రైతులు, ఎంత సాగుభూమి ఉన్నది? గ్రామసభలు ఎలా నిర్వహించాలి? అనే అంశాలతోపాటు చెక్కుల పంపిణీలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా మార్గదర్శకాలను పకడ్బందీగా రూపొందించనున్నారు. ఇందుకోసం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, జిల్లా సహాయ, మండల అధికారులు గురువారం సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే పరిస్థితులు, అందుకు అనుసరించాల్సిన మార్గాలపై విస్తృతంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో సాగు చేసేవారిని ప్రోత్సహించాలని, పంటల సమయంలో పెట్టుబడికి సొమ్మును సమకూర్చి వారికి సాయపడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. భూ యజమానులందరికీ డబ్బులిస్తే.. ప్రజాధనం వృథా అవుతున్నదన్న అపప్రద ప్రజల్లో వ్యాప్తి చెందకుండా వ్యవసాయానికి దూరంగా ఉన్న వారికి సొమ్ము ఇవ్వకపోవడమే మంచిదనే ప్రతిపాదనపై అధికారులు చర్చించారు. సాధ్యమైనంత వరకు సేద్యం చేసేవారికే సొమ్ము అందేలా మార్గదర్శకాలను రూపొందించనున్నారు. రాళ్లు, రప్పలున్న బీడు భూములకు పెట్టుబడి సొమ్ము ఇవ్వడం అనవసరమని అధికారులు భావిస్తున్నారు. సాగులో ఉన్న భూములకే ఇచ్చేలా మార్గదర్శకాలు రూపొందించే అవకాశాలున్నాయి. రెవెన్యూ లెక్కల ప్రకారం రాష్ట్రంలో కనీసం పది లక్షల ఎకరాల్లో వ్యవసాయం చేయడం లేదు. కాగా వారంరోజుల్లో మార్గదర్శకాల రూపకల్పనను పూర్తి చేసి.. సీఎం కేసీఆర్‌కు నివేదిక అందజేస్తామని వ్యవసాయ శాఖ వర్గాలు వెల్లడించాయి.



గురువారం మంత్రి కేటీఆర్‌తో సమావేశమైన నేషనల్ హ్యాండ్లూమ్ కమిషనర్ కవితాగుప్తా. చిత్రంలో జయేశ్‌రంజన్, శైలజ రామయ్యర్

మరమగ్గాల ఆధునీకరణకు సహకారం

కేంద్ర టెక్స్‌టైల్ కమిషనర్ కవితాగుప్తాతో మంత్రి కేటీఆర్ భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మరమగ్గాల ఆధునీకరణకు కేంద్రప్రభుత్వం సహకరిస్తుందని కేంద్ర టెక్స్‌టైల్ కమిషనర్ కవితాగుప్తా వెల్లడించారు. గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమశాఖల మంత్రి కేటీఆర్‌తో ఆమె భేటీ అయ్యారు. కేంద్రపథకాలను సద్వినియోగం చేసుకోవాలని.. పవర్‌లూంకు ముద్రరుణాలు పొందే విధంగా చొరవ తీసుకోవాలని సూచించారు. నేతన్నల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి కేటీఆర్ ఆమెకు వివరించారు. ఈ భేటీలో ఐటీ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ సంపత్, టెక్స్‌టైల్ డైరెక్టర్ శైలజారామయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం కొత్త టెండర్లు వాయిదా

స్పిల్‌వే పనులపై అసంతృప్తి వ్యక్తం చేసిన పోలవరం సీఈవో

అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీలోని పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి శుక్రవారం తెరువాల్సిన కొత్త టెండర్లు మరోవారం రోజులపాటు వాయిదా పడ్డాయి. ఈ నెల 18వ తేదీ వరకు టెండర్ల గడువును పొడిగించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రభుత్వానికి సూచించింది. ఈ నెల 16న మరోమారు భేటీ అయి పీపీఏ టెండర్లపై వివిధ అంశాలను పరిశీలించాలని నిర్ణయించింది. విజయవాడలోని జలవనరుల కార్యాలయంలో గురువారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. 60-సీ నిబంధన కింద కొన్ని పనులను విడదీసి రూ.1395 కోట్ల పనులకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. స్పిల్‌వేలోని కాంక్రీట్ పనులు, స్పిల్, పైలెట్ చానళ్ల నిర్మాణం తదితర పనులను ప్రధాన కాంట్రాక్టరు నుంచి తప్పించి కొత్తవారికి అప్పగించాలని ఏపీ సర్కార్ నిర్ణయించింది. ప్రాజెక్టు నిర్మాణానికి కొత్త టెండర్లను తెరిచే విషయంలో ముందుకు వెళ్లాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్టు పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో ఎస్కే హల్దర్ చెప్పారు. కొత్త టెండర్లు, పునరావాస, పరిహార ప్యాకేజీ, వ్యాప్కోస్‌కు నిర్వహణ బాధ్యతల అప్పగింత వంటి అంశాలపై సమావేశంలో చర్చించినట్టు తెలిపారు. ప్రాజెక్టు వద్ద జరుగుతున్న స్పిల్‌వే పనులు ఆశించినంత వేగంగా జరుగడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఆఖరులోగా నీరు ఇవ్వడంపై ఇప్పుడే ఏమీ చెప్పలేమని, పెరిగిన అంచనాలను పరిశీలిస్తున్నామని హల్దర్ తెలిపారు. 2019 నాటికి పోలవరం పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, వారంలోగా టెండర్లు ఓపెన్ చేసి కొత్తవారికి పనులు అప్పగిస్తామని ఆయన పేర్కొన్నారు.



గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ కో ఆపరేటివ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

సహకారశాఖ సేవలు ప్రశంసనీయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర సహకారశాఖ బలహీనవర్గాలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు వీ శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. గురువారం హైదరాబాద్ గృహకల్పలోని సహకారశాఖ కార్యాలయంలో తెలంగాణ కో ఆపరేటివ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని ఆయన ఆవిష్కరించారు. సహకారశాఖ టీజీవో అధ్యక్షుడు ఏ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఓంప్రకాశ్, టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం నాయకులు రాజేశ్ మిట్టల్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. సంక్రాంతి నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ వారు ఎక్కువ చార్జీలు వసూలు చేస్తున్నారని.. గురువారం ఆయన ఆర్టీసీ ఎండీ రమణారావు, రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మకు వినతిపత్రమిచ్చారు.



టీఎస్ ఈపీఅండ్‌జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ టేబుల్ క్యాలెండర్‌ను గురువారం విద్యుత్ సౌధలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఎండీ శ్రీనివాస్‌రావు, జీఎం (సీసీ) విజయ్‌కుమార్, జేఏస్ఎస్ శోభారాణి, టీఎస్ పీఅండ్‌జీ అసోసియేషన్ అధ్యక్షుడు గణేశ్ పాల్గొన్నారు.
– హైదరాబాద్, నమస్తే తెలంగాణ

భగీరథ ఎలక్ట్రో పనులపై ప్రత్యేక దృష్టి

ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, వర్క్‌ఏజెన్సీలతో ఈఎన్సీ సురేందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ భగీరథలో కీలకమైన ఎలక్ట్రోమెకానికల్ పనులను త్వరగా పూర్తిచేయడంపై గ్రామీణ తాగునీటి సరఫరాశాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎలక్ట్రోపనులు చేస్తున్న కంపెనీలు, సివిల్ పనులు చేస్తున్న ఏజెన్సీల సహకారం, సమన్వయంతో పంపులు, మోటర్ల బిగింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. గురువారం చీఫ్ ఇంజినీర్లు, ఎలక్ట్రో పనులు చేస్తున్న వర్క్ ఏజెన్సీలతో ఈఎన్సీ బీ సురేందర్‌రెడ్డి సమీక్షించారు. అన్ని జిల్లాల ఎస్ఈలు, ఈఈలతో ఎలక్ట్రోపనుల ప్రగతిపై చర్చించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజినీర్లు కృపాకర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, విజయప్రకాశ్, కన్సల్టెంట్లు నర్సింగరావు, మనోహర్‌బాబు, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, నందారావు, సురేశ్ పాల్గొన్నారు.

సూపర్‌వైజర్ల నియామకాలకు విద్యార్హత సడలించండి

తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంగన్‌వాడీ గ్రేడ్-2 సూపర్‌వైజర్ల నియామకాలు, పదోన్నతులకు విద్యార్హతను సడలించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గురువారం బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, తెలంగాణ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్, అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం భిక్షపమ్మ అసెంబ్లీ కమిటీహాల్‌లో మహిళా, శిశు సంక్షేమశాఖ కమిటీ చైర్‌పర్సన్ రేఖానాయక్‌ను, కార్యదర్శి జగదీశ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ విజ్ఞప్తులను పరిశీలించి తగినచర్యలు తీసుకుంటామని కార్యదర్శి జగదీశ్ పేర్కొన్నట్టు భిక్షపమ్మ తెలిపారు.

జిల్లాకో ట్రిబ్యునల్!

- సర్పంచ్‌లపై కలెక్టర్ తీసుకొనే చర్యలపై అప్పిలేట్ అథారిటీ..
- అక్రమ కట్టడాల తొలిగింపు ఖర్చు.. కట్టినవారి నుంచే వసూలు
- పంచాయతీల ఆడిటింగ్ కాలపరిమితి తగ్గింపు యోచన
- ప్రతి పంచాయతీలో కంప్యూటర్ ఆపరేటర్ నియామకం
- కొత్త పంచాయతీరాజ్ చట్టం బిల్లు రూపకల్పనపై నాలుగోరోజు మంత్రివర్గ ఉపసంఘం భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సర్పంచ్‌లపై కలెక్టర్ తీసుకునే క్రమశిక్షణ చర్యలపై అప్పిలేట్ అథారిటీగా వ్యవహరించేందుకు జిల్లాకొక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందన్నదానిపై నూతన పంచాయతీరాజ్ చట్టంపై ఏర్పాటైన మంత్రివర్గ సబ్‌కమిటీ చర్చించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో గురువారం వరుసగా నాలుగో రోజు సమావేశమైంది. ఈ సందర్భంగా చట్టంలో పొందుపర్చాలనుకుంటున్న పలు కీలక అంశాలపై చర్చించారు. ఇప్పటివరకు సర్పంచ్‌లపై తీసుకునే క్రమశిక్షణా చర్యలపై అప్పిలేట్ అథారిటీగా ప్రభుత్వం తరపున పంచాయతీరాజ్‌శాఖ మంత్రే వ్యవహరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ట్రిబ్యునల్ లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా మరింత పారదర్శకంగా వ్యవహరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సబ్‌కమిటీ చైర్మన్ జూపల్లి కృష్ణారావు సూచించారు. రోడ్లపై చెత్త వేయడం, ఇండ్లలోని నీటిని వీధుల్లోకి వదులడం, రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం సహా 22 అంశాల్లో నిబంధనలు ఉల్లంఘించే వారికి పంచాయతీ పాలకవర్గమే జరిమానా విధించే విషయంపై చర్చించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు అక్రమ నిర్మాణాల్లాంటివి చేపడితే వాటిని తొలిగించేందుకు అయ్యే ఖర్చును కూడా కట్టిన వారి నుంచే వసూలు చేసే అంశాన్ని కూడా సబ్‌కమిటీ పరిశీలిస్తున్నది. ఇప్పటివరకు ఆర్థిక సంవత్సరం పూర్తయిన 9 నెలల్లోపు ఆడిటింగ్ ప్రక్రియ ముగుస్తుందని, పంచాయతీల్లో జరుగుతున్న ఆడిటింగ్ ప్రక్రియకు సంబంధించి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు సబ్‌కమిటీకి వివరించారు. ఆడిటింగ్ ప్రక్రియ కాలపరిమితిని తగ్గించే విషయమై సబ్‌కమిటీ అధికారులతో చర్చించింది. పంచాయతీల్లో నిధుల వ్యయం, పన్ను వసూళ్లలాంటివన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వీలుగా ప్రతి గ్రామ పంచాయతీల్లోను ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించుకోవాలనే అభిప్రాయాన్ని సబ్‌కమిటీ వ్యక్తం చేసింది. సరిగా పనిచేయని కార్యదర్శులను సరెండర్ చేసే అధికారాన్ని పాలకవర్గానికి కట్టబెట్టేదిశగానూ సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు సీఎం కార్యాలయ ముఖ్యకార్యదర్శి నర్సింగరావు, అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ రాంచందర్‌రావు, పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూప్రసాద్, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు పాల్గొన్నారు.



గురువారం ఎంసీహెచ్‌ఆర్డీలో మాట్లాడుతున్న మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ జూపల్లి కృష్ణారావు. చిత్రంలో మంత్రి పోచారం, సీఎంవో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ఉన్నారు.

ముగ్గురు పిల్లలుంటే అనర్హత నిబంధన తొలిగించాలి:
గిరిజన కార్పొరేషన్ చైర్మన్ గాంధీనాయక్ విజ్ఞప్తి

ముగ్గురు పిల్లలుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా పేర్కొంటూ 1995లో విధించిన నిబంధనను ఎత్తివేయాలని సబ్‌కమిటీ చైర్మన్, మంత్రి జూపల్లి కృష్ణారావుకు తెలంగాణ గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్ గాంధీనాయక్ వినతిపత్రం అందజేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలకు లేని నిబంధన స్థానిక సంస్థల్లో పనిచేసే వారికి మాత్రమే విధించడం సరికాదని ఆయన అన్నారు. అదేవిధంగా దివ్యాంగులకు స్థానిక సంస్థల్లో 5శాతం రిజర్వేషన్‌ను కల్పించాలని వికలాంగుల జేఏసీ కన్వీనర్ ఎం శ్రీనివాసులు కోరారు. ఈమేరకు గురువారం ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్‌లకు వినతిపత్రం అందజేశారు.

'రెరా'గా రాజేశ్వర్‌తివారీ

- 'రెరా' అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తూ జీవో
- నిర్మాణరంగానికి ఊతం : క్రెడాయ్
- కొనుగోలుదారులకు సంపూర్ణ రక్షణ : తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్



రాజేశ్వర్‌తివారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) గా రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారీని ప్రభుత్వం నియమించింది. నిర్మాణసంస్థలు, కొనుగోలుదారుల మధ్య నెలకొనే వివాదాలను, ఇతరత్రా అంశాలను పర్యవేక్షించటానికి ప్రత్యేకంగా రెరా అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ బాధ్యతను తెలంగాణ రాష్ట్ర వ్యాట్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు అప్పగించింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. 'రెరా' ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం భారీ కసరత్తు చేసిందని సమాచారం. కీలకమైన ఈ స్థానానికి ఉన్నతాధికారుల పేర్లను పరిశీలించినప్పటికీ, అనుభవజ్ఞుడైన రాజేశ్వర్‌తివారీ వైపు రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపినట్టు తెలిసింది. రాష్ట్రంలో పూర్తిస్థాయి రెగ్యులేటర్ అథారిటీ ఏర్పాటయ్యేంతవరకూ ఆయన బాధ్యతలు నిర్వహిస్తారు. 'రెరా' ఏర్పాటుపై రాష్ట్ర నిర్మాణ రంగం హర్షం వ్యక్తంచేసింది. ఇక కొత్త గృహసముదాయాల ప్రాజెక్టులు ప్రారంభమయ్యే అవకాశముందని అభిప్రాయపడింది. కొంతకాలం నుంచి చిన్నాచితకా నిర్మాణసంస్థలతోపాటు బడాడెవలపర్లు సైతం రెరా ఏర్పాటు కోసం ఎదురుచూస్తున్నారు. బ్యాంకులు సైతం రెరా అనుమతి పొందిన ప్రాజెక్టులకే రుణాలను మంజూరుచేస్తామని షరతు విధించాయి. ప్రభుత్వ నిర్ణయం నిర్మాణరంగానికి ఊతమిస్తుందని క్రెడాయ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు చెప్పారు. దీంతో కొనుగోలుదారులకు రక్షణ లభిస్తుందని తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జక్కా వెంకట్‌రెడ్డి తెలిపారు.

రెరా చట్టం కీలక నిబంధనలివే

- 500 చదరపు మీటర్లు కంటే అధిక విస్తీర్ణంలో నిర్మించే ప్రతి అపార్టుమెంట్‌ను 'రెరా' అథారిటీ వద్ద నమోదుచేసిన తర్వాతే.. ప్రకటనలు విడుదలచేయాలి. విక్రయాలు చేపట్టాలి. ఉల్లంఘిస్తే ప్రాజెక్టు వ్యయంలో పది శాతం జరిమానా వసూలుచేస్తారు.
- రియల్‌ఎస్టేట్ సదస్సులు, పత్రిక ప్రకటనల్లో కూడా జాగ్రత్తగా వ్యవహరించాలి. అపార్టుమెంట్‌లో పొందుపరిచే సదుపాయాలు మాత్రమే ప్రకటనల్లో కనిపించాలి.
- కొనుగోలుదారుల నుంచి వసూలుచేసే మొత్తంలో 70% సొమ్మును ప్రత్యేకంగా 'ఎస్క్రో' ఖాతాలో జమచేయాలి. ఒక ప్రాజెక్టుకు పనిచేసే సాంకేతిక నిపుణులకు సంబంధించిన వివరాలను 'రెరా' అథారిటీకి తెలియజేయాలి.
- రెరా నిబంధనలను పాటించని రియల్టర్లకు గరిష్ఠంగా మూడేండ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు. ప్రాజెక్టు వ్యయంలో పది శాతం సొమ్మును జరిమానాగా వసూలుచేస్తారు. రెండూ విధించే అవకాశం కూడా ఉంది.
- 'రెరా' చట్టం కేవలం అపార్టుమెంట్లు, విల్లాలకే కాకుండా లేఅవుట్లకూ వర్తిస్తుంది. లేఅవుట్లను అభివృద్ధి చేసే ప్రతి ఒక్క సంస్థ తప్పనిసరిగా 'రెరా' వద్ద నమోదు చేసుకోవాలి. లేకపోతే, కొత్త వెంచర్లను ప్రకటించే అవకాశం ఉండదు.

ఉమ్మడి హైకోర్టు సీజేగా రాధాకృష్ణన్

మొదటిపేజీ తరువాయి...

నియమించలేదు. జస్టిస్ కల్యాణ్‌జ్యోతి సేన్‌గుప్తా అనంతరం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దిలీప్ బీ భోసలే, తదనంతరం జస్టిస్ రమేశ్ రంగనాథన్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. ఉమ్మడి హైకోర్టుకు పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిని నియమించకపోవడంతో ఉమ్మడి హైకోర్టులో పరిపాలనపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని, అదేవిధంగా న్యాయమూర్తులను నియమించే విషయంలో జాప్యం జరుగుతున్నదని ఇటీవలే సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. దేశంలోని పలు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకం కోసం బుధవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని సీనియర్ న్యాయమూర్తుల కొలీజియం సమావేశమై పలు కీలకనిర్ణయాలు తీసుకున్నది. సుప్రీంకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులతోపాటు హైదరాబాద్ హైకోర్టు (ఉమ్మడి హైకోర్టు)తోపాటు మొత్తం ఐదురాష్ట్రాలకు పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తుల నియామకాలకు సిఫారసు చేసింది. ఈ సిఫారసులను కేంద్ర న్యాయశాఖకు పంపించారు. త్వరలోనే రాష్ట్రపతి ఈ నియామకాలకు ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది.

చాన్నాళ్ల తర్వాత హైకోర్టుకు పూర్తిస్థాయి సీజే

జస్టిస్ టీబీ రాధాకృష్ణన్ 1959 ఏప్రిల్ 29న జన్మించారు. తల్లిదండ్రులు భాస్కరన్ నాయర్, పారుకుట్టి అమ్మాళ్.. ఇద్దరూ న్యాయవాదులే. వారిరువురు కొల్లాంలోనే ప్రాక్టీస్ చేసేవారు. పాఠశాల విద్యను కొల్లాం, తిరువనంతపురంలో అభ్యసించారు. డిగ్రీ అనంతరం కర్ణాటకలోని కోలార్ గోల్డ్‌ఫీల్డ్స్ లాకాలేజీలో న్యాయవిద్యను పూర్తిచేశారు. న్యాయవాదిగా 1983 డిసెంబర్‌లో ఎన్‌రోల్ అయ్యారు. తిరువనంతపురంలో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన తర్వాత ఎర్నాకుళంలోని కేరళ హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 2004 అక్టోబర్‌లో కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2015 మేలో కేరళ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, పదోన్నతిపై 2017 మార్చి 18న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ టీబీ రాధాకృష్ణన్ ఉమ్మడి హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రస్తుతం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగుతున్న జస్టిస్ రమేశ్ రంగనాథన్ ఉమ్మడి హైకోర్టులోనే సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగే అవకాశం ఉంది. ఉమ్మడి హైకోర్టు విభజన అనంతరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు హైకోర్టులు ఏర్పడిన తర్వాత అందులో ఒకరాష్ట్రం ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

బార్‌కౌన్సిల్ నుంచి నేరుగా సుప్రీంకు

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఎం జోసెఫ్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రాలను సిఫారసు చేసింది. ఇందు మల్హోత్రాను మహిళల కోటాలో నేరుగా బార్ కౌన్సిల్ నుంచి ఎంపిక చేశారు. వీరితోపాటు హైదరాబాద్ హైకోర్టు సీజేగా జస్టిస్ టీబీ రాధాకృష్ణన్ (ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ సీజే), ఢిల్లీ హైకోర్టు సీజేగా జస్టిస్ జ్యోతిర్మయి భట్టాచార్య (ప్రస్తుతం కోల్‌కతా హైకోర్టు తాత్కాలిక సీజే), మణిపూర్ హైకోర్టు సీజేగా అభిలాషకుమారి (గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి), హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు సీజేగా జస్టిస్ సూర్యకాంత్ (పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తి), కేరళ హైకోర్టు సీజేగా జస్టిస్ అంటోని డామినిక్ (కేరళ తాత్కాలిక సీజే)లను ప్రధాన న్యాయమూర్తుల పోస్టులకు సిఫారసు చేసింది.

తెలంగాణ ఓ గురుకులం



మైనారిటీ గురుకులంలో విద్యార్థినులు(ఫైల్)

మొదటిపేజీ తరువాయి...

తరగతులను జత చేసుకుంటూ ఏడేండ్లలో ఏడున్నర లక్షల మంది విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు యజ్ఞం చేస్తున్నది. సమాజంలో అత్యంత పేదరికంలో మగ్గుతున్న చిన్నారులకు, గుణాత్మకమైన విద్యను అందించడం సాధ్యమేనని నిరూపిస్తున్నది. పేదలకు చదువు అందని మానిపండు అన్న సామెతను తిరుగరాస్తూ.. ప్రతి మారుమూల గ్రామంలోని ప్రతి పేద విద్యార్థికీ కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా విద్యనందించేందుకు ఏర్పాటుచేసిన రెసిడెన్షియల్ పాఠశాలలతో తెలంగాణ రాష్ట్రమే ఒక గురుకులంగా మారిపోయింది. ప్రతి విద్యార్థికీ కేజీ నుంచి పీజీ వరకూ నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తామంటూ ఎన్నికల సమయంలో సీఎం కే చంద్రశేఖర్‌రావు ఇచ్చిన వాగ్దానం వాస్తవరూపం దాల్చుతూ.. వడివడిగా అడుగులు వేస్తున్నది. రాష్ట్రప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మకంగా చేపట్టిన సంస్కరణలు పేదింటి పిల్లల కలలు నిజం చేసేందుకు అద్భుతమైన బాటలు వేస్తున్నాయి. విద్యతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమన్న నినాదంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. పీజీస్థాయి వరకూ ప్రతి విద్యార్థికీ ఉచితంగా చదువు చెప్పేందుకు కేజీ టూ పీజీ విద్యావిధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. పాఠశాలల్లో డ్రాపౌట్లకు ఎలాంటి ఆస్కారం ఇవ్వకుండా గురుకుల వ్యవస్థను దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా బలోపేతం చేసింది. ప్రత్యేక వ్యూహంతో వివిధ వర్గాల విద్యార్థులకు వేర్వేరుగా గురుకులాలను ఏర్పాటుచేసి, వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు, జనరల్ విద్యార్థుల కోసం కూడా గురుకుల విద్యాలయాలను పెద్ద ఎత్తున ప్రారంభించింది. జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నది. మూడున్నరేండ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో అన్ని క్యాటగిరీలకు చెందిన రెసిడెన్షియల్ పాఠశాలల సంఖ్య 298 మాత్రమే. ఆరు దశాబ్దాల ఉమ్మడి పాలనలో నాటి పాలకులు మొక్కుబడిగానే వీటిని నెలకొల్పారు. తెలంగాణ ఆవిర్భవించిన ఈ మూడున్నరేండ్లలోనే రాష్ట్రంలో గురుకులాల సంఖ్య ఏకంగా 815కు పెంచారు. కేవలం గురుకులాలను ఏర్పాటుచేయడంతోనే ప్రభుత్వం చేతులు దులుపుకోలేదు. ఆయా విద్యాసంస్థల్లో నాణ్యతాప్రమాణాలను కూడా కార్పొరేట్ విద్యకు దీటుగా తీర్చిదిద్దారు. ఈ గురుకులాల్లో 2,00,297 మంది విద్యార్థులు చదువుకోవడం, రాష్ట్రంలో 'కేజీటు పీజీ విద్య' వేసిన ముందడుగు. ఏడున్నరేండ్ల దీర్ఘకాలిక లక్ష్యంతో 1200 గురుకులాలను ఏర్పాటుచేసి కనీసంగా 7.60 లక్షల మంది విద్యార్థులను ఉచితంగా విద్యనందించే ప్రణాళికతో తెలంగాణ సర్కారు దూసుకుపోతున్నది.



ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.లక్ష ఖర్చు

గురుకుల విద్యాలయాల్లో చదువుకొనే ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం ఏటా రూ.లక్షకు పైగా ఖర్చు చేస్తున్నది. విద్యార్థులకు పౌష్టికాహారం, తగిన వసతి సౌకర్యాలు కల్పించడంతోపాటు, అవసరమైన పుస్తకాలు, నోటుబుక్కులు, దుస్తులు, కాస్మొటిక్స్ అందజేస్తున్నారు. విద్యాబోధనతోపాటు సాంస్కృతిక, క్రీడాంశాల్లోనూ విద్యార్థులకు నైపుణ్యం పెంచేందుకు దృష్టి సారించారు.

రెండున్నరేండ్లలో 815కు పెరిగిన గురుకులాలు

2014కు ముందువరకు రాష్ట్రంలో ఒకటి రెండు గురుకులాలు ఏర్పాటు చేయడానికే ప్రభుత్వాలు ఆపసోపాలు పడిన పరిస్థితి. తెలంగాణ వచ్చాక పరిస్థితి సమూలంగా మారిపోయిందనడానికి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన గురుకులాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం విద్యాసంవత్సరంలోనే రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 119 గురుకుల విద్యాలయాలను ఏకకాలంలో ప్రారంభించడం దేశ చరిత్రలోనే రికార్డు. అంతేకాదు.. సాంఘిక సంక్షేమశాఖ ద్వారా 30 మహిళా డిగ్రీ కళాశాలలు, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 15 మహిళా డిగ్రీ కళాశాలలు, బీసీ సంక్షేమశాఖ ద్వారా 7 పురుషుల డిగ్రీ కళాశాలలను ఇదే సంవత్సరం ప్రారంభించారు. ప్రభుత్వ రంగంలో, అదీ విద్యావ్యవస్థకు సంబంధించి ఒకే సంవత్సరం ఇంత పెద్ద ఎత్తున కళాశాలలను ఏర్పాటు చేయడమన్నది దేశ చరిత్రలోనే ఇంతకుముందెన్నడూ జరుగలేదు. తెలంగాణ ఆవిర్భావం (2014, జూన్ 2) నాటికి తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రెసిడెన్షియల్ పాఠశాలలు 298 ఉండగా.. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 517 పాఠశాలలను కొత్తగా అనుమతించడంతో వాటి సంఖ్య 815కు చేరుకొన్నది. రెసిడెన్షియల్ విధానంతో పీజీ వరకు ఉచిత విద్యను అందించే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను గణనీయంగా పెంచింది.

ఏడేండ్ల లక్ష్యం.. 7.6లక్షల విద్యార్థులకు ప్రయోజనం

రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టితో కేజీ టు పీజీ విద్యా విధానాన్ని అంకితభావంతో అమలు చేస్తున్నది. అంతర్జాతీయ ప్రమాణాలతో, గురుకుల విద్యార్థులకు మాతృభాష తెలుగుతోపాటు ఆంగ్ల మాధ్యమంలో గుణాత్మక విద్యను అందించేందుకు కృషి చేస్తున్నది. అత్యంత ఆధునిక విధానంలో విద్యాబోధన చేసేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. వచ్చే మూడేండ్లలో 1200 రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పి 7.60 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగించేలా ప్రణాళికను రూపొందించింది. ఈ మొత్తం రెసిడెన్షియల్ పాఠశాలలను ఏడేండ్ల కాలంలో అంచెలంచెలుగా విస్తరించుకుంటూ.. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించే దిశగా తరగతుల పెంపు, వసతుల కల్పన వంటివి చేపట్టనున్నారు.

కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు

రాష్ట్రంలోని అన్ని గురుకుల విద్యాలయాల్లో కార్పొరేట్ స్థాయి విద్యా సౌకర్యాలు కల్పించారు. తరగతి గదుల్లో విద్యార్థుల కోసం డెస్క్ టేబుళ్లు, కంప్యూటర్లు, డిజిటల్ విద్యాబోధన సామగ్రితోపాటు, సందేహాల నివృత్తికోసం కియోస్క్‌లను కూడా ఏర్పాటు చేశారు.

సొంత భవనాలు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకుల విద్యాలయాల పక్కా భవనాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. 815 గురుకుల విద్యాలయాల్లో 50శాతం వరకు సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన వాటికి భవనాల నిర్మాణంపై దృష్టిపెట్టారు. చాలా జిల్లాల్లో స్థల సేకరణ పూర్తికాగా.. పలు చోట్ల భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి.



బీసీ గురుకులంలోని లైబ్రరీలో విద్యార్థినులు(ఫైల్)

క్యాటగిరీ	ఉమ్మడి రాష్ట్రంలో గురుకులాలు	రాష్ట్రం ఏర్పడ్డాక నెలకొల్పినవి	మొత్తం గురుకులాలు	విద్యార్థుల సంఖ్య
ఎస్సీ	134	134	268	1,12,088
ఎస్టీ	94	51	145	29,880
మైనార్టీ	–	189	189	11,278
బీసీ	20	142	162	28,400
జనరల్ (టీఆర్‌ఈఐఎస్)	51	–	51	18,651
మొత్తం	298	517	815	2,00,297

తగ్గిన డ్రాపవుట్లు: ఉమ్మడి రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో పురుగుల అన్నం తినలేక.. చదువు మానేసి ఇళ్లకు వెళ్లిన పరిస్థితి. ప్రస్తుతం విద్యార్థులకు ఆ దుస్థితి ఎంతమాత్రం లేదు. స్కూళ్లు, హాస్టళ్లు, గురుకులాలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తున్నది. దీంతో బడిమానేసే విద్యార్థుల సంఖ్య ఏటేటా తగ్గుతున్నది.

ఆరోగ్యంపై దృష్టి: గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. విద్యార్థికి అనారోగ్య సమస్య వస్తే, ఆయా కేంద్రాల్లో మందులు ఇచ్చినప్పటికీ హెల్త్ మానిటరింగ్ విభాగం ద్వారా తగిన సూచనలు అందిస్తూ వారి అనారోగ్య తీవ్రతనుబట్టి నిపుణుల బృందంతో తక్షణ వైద్యసేవలు అందిస్తున్నారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ: గురుకుల విద్యాలయాలు ప్రగతి సాధించేందుకు ఆయా విభాగాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహిస్తున్నాయి. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాబోధన వంటి అంశాలను సమీక్షించుకొంటూ మెరుగు పర్చేందుకు ప్రతి జిల్లాకు ఒక కో ఆర్డినేటర్‌ను నియమించారు. గురుకులాల ప్రిన్సిపాళ్లు, అధికారులతో ప్రతివారం టెలికాన్ఫరెన్సు నిర్వహిస్తున్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుల ద్వారా ఆయా గురుకులాలను ఏడాదిలో రెండుసార్లు తనిఖీలు చేయించి ఉపాధ్యాయుల పనితీరును అంచనావేసి విద్యాబోధన, చిన్నారుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నారు.

మైనార్టీలకు ప్రయోజనం..

గతంలో మైనార్టీ వర్గానికి చెందిన పలు తెగల చిన్నారులు విద్యకు దూరమై.. ఫ్యాక్టరీలలో, మెకానిక్ షాపుల్లో మగ్గే పరిస్థితి ఉండేది. ఉమ్మడి రాష్ట్రంలో ఒక్క మైనార్టీ గురుకుల విద్యాలయాన్ని కూడా తెలంగాణ ప్రాంతంలో ఏర్పాటు చేయలేదు. తెలంగాణ ప్రభుత్వం దూరదృష్టితో మైనార్టీ జనాభాను దృష్టిలో ఉంచుకొని ఆయా ప్రాంతాల్లో 189 మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. వీటిలో మైనార్టీ వర్గానికి చెందిన చిన్నారులు అధిక సంఖ్యలో చేరుతున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని మైనార్టీలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

వర్సిటీల్లో డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యమివ్వండి

ఉన్నత విద్యామండలి చైర్మన్‌తో గవర్నర్ నరసింహన్



టూరిజం, హాస్పిటాలిటీ మార్కెటింగ్ సర్వీస్‌లలో తీసుకురావాల్సిన మార్పులపై ముద్రించిన పుస్తకాన్ని గవర్నర్ నరసింహన్‌కు అందజేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు, కాలేజీల్లో డిజిటలైజేషన్ విధానాన్ని పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ సూచించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వెంకటరమణ, సెక్రటరీ ఎన్ శ్రీనివాసరావు గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహన్ మాట్లాడుతూ విద్యార్థులు వినూత్నమైన ఆలోచనలకు శ్రీకారం చుట్టేందుకు వీలుగా నాణ్యమైన ప్రయోగశాలలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎంసెట్‌తోపాటు, అన్ని రకాల ప్రవేశపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించడాన్ని గవర్నర్ అభినందించారు. టూరిజంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టి తెలంగాణ టూరిజాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలని చెప్పారు. టీఎస్‌సీహెచ్‌ఈ ఆధ్వర్యంలో రూపొందిన టూరిజం, హాస్పిటాలిటీ మార్కెటింగ్ సర్వీస్‌లలో తీసుకురావాల్సిన మార్పులపై ముద్రించిన ప్రత్యేక పుస్తకాన్ని ఉన్నత విద్యామండలి చైర్మన్, వైస్‌చైర్మన్లు గవర్నర్ నరసింహన్‌కు అందజేశారు.

శుక్రవారం నుంచి పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో నగరవాసులు సొంతూర్లకు ప్రయాణమయ్యారు. దీంతో గురువారం బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడాయి. నగరం నుంచి జిల్లాలకు బస్సులు బయలుదేరే ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్లతోపాటు లక్డీకాపూల్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, మియాపూర్, ఎస్సార్‌నగర్, మాదాపూర్ ప్రాంతాలు రద్దీగా మారాయి. ముఖ్యంగా రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు ఏపీకి వెళ్లే బస్సులకు కేంద్రమైన ఎంజీబీఎస్‌లో ప్రయాణికుల సందడి ఎక్కువగా ఉన్నది. రద్దీకి అనుగుణంగా టీఎస్‌ఆర్టీసీ అదనపు బస్సులు నడుపుతున్నది.



పంజాగుట్ట పోలీసుల సేవలు ప్రశంసనీయం

- టీమ్‌వర్క్‌తో విజయాలు సాధిస్తూ ఆదర్శంగా నిలిచారు
- పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన గవర్నర్ నరసింహన్ దంపతులు
- వచ్చే ఏడాది తొలి మూడు అవార్డులు రాష్ట్రానికి రావాలని ఆకాంక్ష



పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందిని అభినందిస్తున్న గవర్నర్ నరసింహన్ దంపతులు. చిత్రంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ శ్రీనివాసరావు తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంజాగుట్ట పోలీస్ స్టేషన్ దేశంలోనే రెండో ఉత్తమ ఠాణాగా నిలువడం ఎంతో గర్వంగా ఉన్నదని, పంజాగుట్ట పోలీసుల సేవలకు ఇది నిదర్శనమని గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ప్రశంసించారు. అవార్డు వచ్చిన సందర్భంగా గవర్నర్ నరసింహన్, ఆయన సతీమని విమలా నరసింహన్ గురువారం సాయంత్రం పంజాగుట్ట పీఎస్‌ను సందర్శించారు. గ్రౌండ్ ఫ్లోర్ మొదలు ప్రతి గదిని పరిశీలించారు. ఆయా విభాగాల పనితీరును అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గస్తీ పోలీసులతో మాట్లాడి వారి చేతిలో ఉన్న ట్యాబ్‌ల పనితీరును, టీఎస్ కాప్ యాప్ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గవర్నర్ మీడియాతో మాట్లాడారు. ఈ అవార్డును అఖిల భారత డీజీపీల సదస్సులో కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ చేతుల మీదుగా అందుకోవడం సంతోషాన్నిచ్చిందన్నారు. సిబ్బంది పనితీరు, పీఎస్‌లో ఏర్పాట్లు ఎంతో బాగున్నాయని మెచ్చుకున్నారు. సిబ్బంది బాధ్యతతో పనిచేయడంతోపాటు టెక్నాలజీని వినియోగించడంతో క్రైం రేటు, ట్రాఫిక్ సమస్య తగ్గిందన్నారు. ఉన్నతాధికారుల దిశానిర్దేశం, ఎస్‌హెచ్‌వో రవీందర్ నేతృత్వంలో సిబ్బంది టీమ్ వర్క్‌తో విజయాలు సాధిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. పోలీసుల కష్టాన్ని గుర్తిస్తూ మీడియా, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. పోలీసులు పండుగలు, సంతోషాలు వదులుకొని ప్రజల రక్షణ కోసం విధుల్లో నిమగ్నమై ఉంటారని, వారికి సహకరిస్తే మరిన్ని మంచి ఫలితాలు వస్తాయన్నారు. తద్వారా హైదరాబాద్ సిటీ, రాష్ట్రం బాగుటుందని చెప్పారు. పంజాగుట్ట పీఎస్ తరహాలో రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లు ఎదుగాలని, వచ్చే సదస్సులో మొదటి మూడు అవార్డులు తెలంగాణకే రావాలని ఆకాంక్షించారు. డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ అవార్డు సాధించడం ఆనందంగా ఉన్నదని, స్టేషన్ ఎస్‌హెచ్‌వో, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. సీఎం కేసీఆర్ ఆకాంక్షలకు అనుగుణంగా నగరాన్ని శాంతిభద్రతలకు నిలయంగా మార్చామన్నారు. సిబ్బంది కృషితో ఆశించిన ఫలితాలు వస్తున్నాయని, ప్రజలు కూడా మా పోలీసులు, మా స్టేషన్‌గా భావిస్తూ సహకరిస్తున్నారన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లను పంజాగుట్ట తరహాలో తీర్చి దిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో హైదరాబాద్ సీపీ శ్రీనివాసరావు, అదనపు సీపీ మురళీకృష్ణ, పశ్చిమ మండలం డీసీపీ వెంకటేశ్వర్‌రావు, అదనపు డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియా బడ్జెట్ ఆరు వేల కోట్లు

- జీహెచ్‌ఎంసీలో 175 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు
- ఆరు కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి
- స్థాయీసంఘం సమావేశంలో తీర్మానాలు



బల్దియా స్థాయీసంఘం సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ బొంతు రామ్మోహన్. చిత్రంలో కమిషనర్ జనార్దన్‌రెడ్డి, స్థాయీసంఘం సభ్యులు, అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: బల్దియా బడ్జెట్ ప్రతిపాదనలను రూ.13,150 కోట్ల నుంచి రూ.6,076.86 కోట్లకు కుదించడంతోపాటు డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పథకంతోపాటు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇతర ఇంజినీరింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి 175 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించాలని నిర్ణయించారు. కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రూ. 5.95 కోట్లతో స్విమ్మింగ్‌పూల్‌ను నిర్మించడంతోపాటు ఇతర వసతులు కల్పించాలని గుర్తించారు. గురువారం నగర మేయర్ బొంతు రామ్మోహన్ అధ్యక్షతన జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జరిగిన స్థాయీసంఘం సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేశారు. ఇందులో ముఖ్యంగా బండ్లగూడలో చేపట్టిన సౌత్‌జోన్ కార్యాలయ భవనంలో అదనపు అంతస్తుల నిర్మాణానికి రూ.5.80 కోట్లు కేటాయించారు. జీహెచ్‌ఎంసీ వార్షిక బడ్జెట్-2018-19 ప్రతిపాదనలను రూ.13,150 కోట్ల నుంచి రూ.6,076.86 కోట్లకు కుదించారు. మూసీ పరీవాహక అభివృద్ధి ప్రాజెక్టు, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్ తదితర నిధులను ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ బడ్జెట్‌లో కాకుండా ఆయా ప్రాజెక్టులకు ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్పొరేషన్లకే కేటాయించనున్నందున ఆ మేరకు జీహెచ్‌ఎంసీ బడ్జెట్‌ను కుదించారు. మొదలు జీహెచ్‌ఎంసీ ప్రతిపాదనల్లో వీటిని కూడా చేర్చడంతో బడ్జెట్ స్వరూపం ఏకంగా రూ.13,150 కోట్లకు పెరిగిన విషయం విధితమే. గ్రేటర్ పరిధిలో గత పదేండ్లుగా ఏర్పాటైన అక్రమ హోర్డింగులు, బస్ షెల్టర్లపై రాష్ట్ర విజిలెన్స్ విభాగంతో విచారణ జరిపించాలని మేయర్ బొంతు రామ్మోహన్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డిని ఆదేశించారు. వీటికి బాధ్యులైనవారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో 330 అక్రమ హోర్డింగులు ఉన్నాయని గుర్తించినట్టు పేర్కొంటూ వాటి తొలిగింపునకు టెండర్లు ఆహ్వానించామని తెలిపారు. జీహెచ్‌ఎంసీలో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంతోపాటు దాదాపు రూ.23 వేల కోట్లతో ఎస్‌ఆర్డీపీ ప్రాజెక్టును చేపట్టారు. ఇవికాకుండా మార్కెట్లు, ఆటమైదానాలు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లు తదితర అనేక ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు. పనుల పర్యవేక్షణకు సిబ్బంది కొరతగా ఉండటంతో దీన్ని అధిగమించేందుకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వర్క్ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని నిర్ణయించారు.



నగరంలో మాదిగల అభివృద్ధికి కార్యాచరణ

- గత ప్రభుత్వాలు దళిత బస్తీలను విస్మరించాయి: వంగపల్లి

ముషీరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని మురికివాడల్లో నివసిస్తున్న మాదిగల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్టు ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్, జాతీయ ప్రధాన కార్యదర్శి మేడి పాపయ్య తెలిపారు. గురువారం సత్యానగర్ కమ్యూనిటీహాల్‌లో జరిగిన హైదరాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్ నిర్మాణంలో పాలుపంచుకున్న మాదిగలు నేటికీ మురికివాడల్లో దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారన్నారు. వారి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేసేలా ఒత్తిడి తెస్తామన్నారు. నగరంలోని దళితుల సంక్షేమాన్ని గత ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయన్నారు. మాదిగలు నివసిస్తున్న బస్తీల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించలేకపోయారని విమర్శించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు బస్తీల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరా రు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు కనకరాజు, దండు సురేందర్, అంజయ్య, చాప క్రిష్ణ, బీ శ్రీను, పీ రమేష్, శ్యామ్‌రావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల్లో అత్యాధునిక పోలీస్ స్టేషన్లు

- హైదరాబాద్ స్ఫూర్తిగా సాంకేతికత, సేవల మెరుగుకు కసరత్తు
- ప్రయోగాత్మకంగా కామారెడ్డి టౌన్ ఠాణా ఎంపిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నగరంలోని అత్యాధునిక పోలీస్‌స్టేషన్లను స్ఫూర్తిగా తీసుకొని జిల్లాల్లోని అన్ని పీఎస్‌లను తీర్చిదిద్దేందుకు కసరత్తు మొదలైంది. ఇక్కడి మాదిరిగా సాంకేతికత వినియోగం, సిబ్బంది విధి విధానాలను రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయాలని భావించిన డీజీపీ మహేందర్‌రెడ్డి.. ఈ అంశంపై ఇద్దరు ఐజీలు స్టీఫెన్ రవీంద్ర, నాగిరెడ్డితో చర్చించారు. అన్నిజిల్లాల పోలీస్‌స్టేషన్లను అత్యాధునికంగా మార్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ జోన్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర డిస్ట్రిక్ట్ పోలీస్ స్టబిలైజేషన్ (డీపీఎస్) పేరుతో కార్యాచరణ రూపొందించారు. వాటిని తన జోన్ పరిధిలో అమలు పరిచేందుకు తొలుత కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు కామారెడ్డి జిల్లా ఎస్పీ శ్వేతారెడ్డి కమ్యూనిటీ, ఫ్రెండ్లీ పోలీసింగ్, కేసుల దర్యాప్తులో టెక్నాలజీ వాడకం, ఆధారాల సేకరణ వంటి అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. ఎన్జీవోల సహకారంతో తొలుత జిల్లా కేంద్రాలు, కమిషనరేట్ల పరిధిలోని స్టేషన్లను అత్యాధునికంగా తీర్చిదిద్ది, అనంతరం అన్ని పీఎస్‌లకు అమలు చేయనున్నారు.

24 గంటలు విజిబుల్ పోలీసింగ్

నగర పోలీసుల్లో గత మూడేండ్లలో టెక్నాలజీ వినియోగం పెరిగింది. వేలసంఖ్యలో సీసీ కెమెరాలు బిగించి వాటి ఆధారంగా అనేక మిస్టరీ కేసులు ఛేదిస్తున్నారు. ఓ పక్క సీసీ కెమెరాలు, మరోపక్క పెట్రోలింగ్ పోలీస్‌తో నగరమంతా 24 గంటలూ విజిబుల్ పోలీసింగ్ కనిపిస్తుంది. ప్రతి పీఎస్‌లో రిసెప్షన్ ఏర్పాటుచేసి ఫిర్యాదులు స్వీకరిస్తుండడతో ఠాణాల్లో స్నేహపూరిత వాతావరణం నెలకొన్నది. దీంతో ప్జలు అర్ధరాత్రి సైతం ఠాణాకు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేస్తున్నారు. ఈ విధానాలను అన్ని జిల్లాల్లో ప్రవేశపెట్టనున్నారు.

17 లక్షల ఓట్లు తొలిగించారు

- ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్‌ల నాయకుల ఫిర్యాదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్‌లో 17.20 లక్షల ఓట్లను అకారణంగా తొలిగించారని, వాటిని పునఃపరిశీలించి వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవోను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ఓటర్ లిస్టును ప్రక్షాళన చేయించి జాబితా నుంచి తొలిగించారని ఆరోపించారు. గురువారం సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో అనూప్‌సింగ్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు సబితాఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఓటర్ లిస్టు అంతా అపసవ్యంగా తయారు చేసి, నిజమైన ఓటర్లను తొలిగించడం భావ్యం కాదన్నారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ శాతం ఓట్లను తొలిగించారని ఆరోపించారు. ఎన్నికల సంఘం సీఈవో అనూప్‌సింగ్ మాట్లాడుతూ ఓటర్ లిస్టు ప్రక్షాళనలో నిజమైన ఓటర్లను తొలిగించే అవకాశమే లేదన్నారు. నిజమైన ఓటరు ఉన్నట్లైతే మళ్లీ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియగా ఉంటుందని చెప్పారు.

ఇంధన ఆదాలో హైదరాబాద్ రైల్వే డివిజన్ ఆదర్శం

- పునరుత్పాదక వనరులతో విద్యుత్ ఉత్పత్తిలో ముందంజ



సికింద్రాబాద్‌లోని రైలు నిలయంపై ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ పలకాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఇంధన పరిరక్షణ, పునరుత్పాదక వనరులతో విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంలో హైదరాబాద్ రైల్వే డివిజన్ ఆదర్శంగా నిలుస్తున్నది. ఇంధన ఆదాలో ఏ-1 కేటగిరీ స్టేషన్లలో మొదటిస్థానంలో నిలిచిన కాచిగూడ స్టేషన్‌తో ఈ చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇంధన ఆదా కోసం డివిజన్‌లో 1,312 సంప్రదాయ లైట్ల స్థానంలో ఎల్‌ఈడీ లైట్లను, 370 పాత సీలింగ్ ఫ్యాన్ల స్థానంలో ఇంధనాన్ని ఆదా చేయగల 'బ్రష్ లెస్ డైరెక్ట్ కరెంట్' (బీఎల్‌డీసీ)ఫ్యాన్లను, 5 నక్షత్రాల స్థాయి గల ఇన్‌వర్టర్ ఏసీలను అమర్చారు. డివిజన్ పరిధిలోని 100 రైల్వే స్టేషన్లలో 176 లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద మొత్తం ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేశారు. దక్షిణ మధ్య రైల్వే కేంద్ర కార్యాలయమైన రైల్ నిలయం భవనంలో 3,048 సంప్రదాయ లైట్లను ఎల్‌ఈడీలతో మార్పిడి చేశారు. తద్వారా భారతీయ రైల్వేలో పూర్తిస్థాయి ఎల్‌ఈడీ లైట్లు అమర్చిన మొట్టమొదటి జోన్‌గా దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు పొందింది. ఫలితంగా విద్యుత్ లోడ్ 217.31 కిలోవాట్లు తగ్గి ఏటా 8.55 లక్షల యూనిట్ల కరెంటు ఆదా అవుతున్నది. సంస్థకు ఇప్పటివరకు రూ.68.4 లక్షలు మిగిలాయి. ఈ ఏడాది జూన్‌నాటికి రైల్వే కాలనీల్లోనూ ఎల్‌ఈడీ లైట్లు అమర్చుతామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు హైదరాబాద్ డివిజన్ పరిధిలో 290 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ పలకాలతో కరెంటును ఉత్పత్తి చేస్తున్నారు. ఈ కరెంటు కర్నూలు సిటీ, గద్వాల, బాసర, కామారెడ్డి, ధర్మాబాద్ తదితర రైల్వే స్టేషన్లు, వివిధ సేవా భవనాలకు ఉపయోగపడుతున్నది. కాచిగూడ, సికింద్రాబాద్‌లోని ఇండియన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్ అండ్ కమ్యూనికేషన్, జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, లేఖా భవన్ మొదలైన చోట్ల 1.45 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇవి మార్చి 31 నాటికి పూర్తి కానున్నాయి.

ఎంవీఐ, ఏఎంవీఐల ఆన్‌డ్యూటీలు రద్దు

నగర ఇన్‌స్పెక్టర్లకు సొంత స్థానాల్లో పోస్టింగ్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్(ఎంవీఐ), అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్(ఏఎంవీఐ)ల ఆన్‌డ్యూటీలు రద్దయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 16 మంది ఇన్‌స్పెక్టర్లను ఆన్‌డ్యూటీ(ఓడీ)లు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోగా అందులో నగరానికి చెందిన ఎంవీఐ, ఏఎంవీఐలు ఎక్కువగా ఉన్నారు. ఆన్‌డ్యూటీ పోస్టింగ్‌లతో అవసరంలేని ప్రాంతంలో ఎక్కువ మంది పనిచేస్తుండటం, కొన్ని ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్లు లేకపోవడం వంటి అంశాలు రద్దు చేయడానికి కారణాలయ్యాయి. కొద్దిరోజుల కిందట రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి నిర్వహించిన డీటీసీల సమీక్షలో ఈ అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. చెక్‌పోస్టులకు ఇబ్బడిముబ్బడిగా వెళ్తుండటంతో నగరంలో ఇన్‌స్పెక్టర్ల కొరత ఏర్పడుతున్నదని, దీనివల్ల ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇతర డ్యూటీల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొంతమంది డీటీసీలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని రద్దు నిర్ణయాన్ని తీసుకున్నట్టు సమాచారం. రేషనలైజేషన్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం ఆర్టీవో కార్యాలయంలో ఆన్‌డ్యూటీపై పనిచేస్తున్న ఎంవీఐ వీ లక్ష్మణ్‌ను ఓడీ రద్దు చేసి ఒర్జినల్ పోస్టింగ్ డీటీవో సిద్దిపేటకు పంపిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. హైదరాబాద్ నార్త్‌జోన్‌లో ఓడీపై పనిచేస్తున్న బీ సాయిబాబాను తన స్థానం సాలూర చెక్‌పోస్టుకు వెళ్లాలని సూచించారు. నల్లగొండ జిల్లా వాడేపల్లి చెక్‌పోస్టులో ఆన్‌డ్యూటీపై పనిచేస్తున్న ఈ వాసును పోస్టింగ్ ఉన్న జేటీసీ హైదరాబాద్‌కు వెళ్లాలని సూచించారు. కామారెడ్డిలోని మద్నూర్ చెక్‌పోస్టు వద్ద ఓడీపై పనిచేస్తున్న ఏఎంవీఐ సీహెచ్ కొండయ్యను తనకు పోస్టింగ్ ఇచ్చిన డీటీవో మేడ్చల్‌కు వెళ్లాలని ఆదేశించారు. ప్రస్తుతం హైదరాబాద్ సౌత్‌జోన్‌లో ఆన్‌డ్యూటీపై పనిచేస్తున్న ఏఎంవీఐ ఎస్‌కే మున్నీని పోస్టింగ్ ఇచ్చిన సాలూర చెక్‌పోస్టుకు, కామారెడ్డి చెక్‌పోస్టులో పనిచేస్తున్న ఏఎంవీఐ ధూప్‌సింగ్‌ను పోస్టింగ్ ఉన్న ప్రాంతమైన హైదరాబాద్ జేటీసీ కార్యాలయానికి వెళ్లాలని ఆదేశించారు. వీటిపై బుధవారం రాత్రి రవాణాశాఖ కమిషనర్ సునీల్‌శర్మ సర్క్యులర్ జారీచేశారు.

భారీగా మత్తుమందు స్వాధీనం

సంగారెడ్డి జిల్లాలో మెథాకులోన్ డ్రగ్ పట్టుకున్న డీఆర్‌ఐ అధికారులు

జహీరాబాద్, నమస్తే తెలంగాణ: సంగారెడ్డి జిల్లాలో గురువారం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు పెద్దమొత్తంలో మత్తుమందును స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్ విలువ రూ. కోట్లలో ఉంటుందని తెలిసింది. తనిఖీల్లో మెథాకులోన్ అనే డ్రగ్ దొరికిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని డీఆర్‌ఐ అధికారులు చెప్పారు. కర్ణాటక రాష్ట్రం నుంచి హైదరాబాద్ వైపు కొందరు కారులో మాదకద్రవ్యాలు తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో సంగారెడ్డి నుంచి హైదరాబాద్‌కు వచ్చేమార్గంలో టోల్‌గేట్లు, చెక్‌పాయింట్ల వద్ద డీఆర్‌ఐ అధికారులు నిఘా పెట్టి వాహనాలు తనిఖీ చేశారు. ఓ కారును సోదా చేయగా డిక్కీలో మెథాకులోన్ డ్రగ్ ప్యాకెట్లు కనిపించాయి. డ్రగ్‌ను స్వాధీనం చేసుకొని, వాహనంలోని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

క్యాంపస్ నియామకాలు తగ్గుముఖం

- బహుముఖ నిపుణుల కోసం కంపెనీల అన్వేషణ
- విద్యార్థుల్లో కనీస నైపుణ్యాల కొరత
- విజ్‌డంజాబ్స్ డాట్‌కామ్ సర్వే వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గత రెండేండ్ల కాలంలో క్యాంపస్ నియామకాలు దారుణంగా పడిపోయాయని విజ్‌డంజాబ్స్ డాట్‌కామ్ సర్వేలో వెల్లడైంది. ప్రధానంగా ద్వితీయ, తృతీయ శ్రేణి విద్యాసంస్థల నుంచి నియామకాలు భారీగా తగ్గాయి. నైపుణ్యం గల అభ్యర్థుల పట్ల కంపెనీలు ఆసక్తి చూపుతుండడం వల్లే క్యాంపస్ నియామకాలు అడుగంటాయి. దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో విజ్‌డంజాబ్స్ సర్వేను నిర్వహించింది. 'భారతదేశంలో క్యాంపస్ నియామకాలు-పరిణామం' అనే శీర్షికతో విడుదల చేసిన నివేదికలో సర్వే ఫలితాలను విశ్లేషించింది. ప్రథమశ్రేణి విద్యాసంస్థల్లో 75 శాతం నియమకాలు జరుగుతుండగా, ద్వితీయశ్రేణి సంస్థల్లో 38శాతం, తృతీయ శ్రేణి సంస్థల్లో 23శాతం మాత్రమే జరుగుతున్నాయని సర్వేలో వెల్లడైంది. గత కొన్నేండ్లుగా ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్స్‌కి క్యాంపస్ నియామకాలు ప్రధాన ఉపాధివనరుగా మారాయి. ఐటీ బూమ్.. ఆతర్వాత మాన్యుఫాక్చరింగ్ రంగం అభివృద్ధితో నూతన గ్రాడ్యుయేట్స్‌కి మంచి అవకాశాలు లభించాయి. కానీ అనూహ్యంగా గత రెండేండ్లలో క్యాంపస్ నియామకాల ట్రెండ్ మారిపోతూ వస్తున్నది. 100శాతం ప్లేస్‌మెంట్స్ సంస్థలు అనేకం అందులో సగంతోనే సరిపెట్టుకోవాల్సి వస్తున్నది. హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, పుణెల్లో విజ్‌డంజాబ్స్ డాట్‌కామ్ నిర్వహించిన సర్వేలో ఈ విష యం వెల్లడైంది. ఐటీ, ఈకామర్స్, రిటేల్, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా, ఆటోమోటివ్ రంగాలతోపాటు 120 ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో సర్వే నిర్వహించారు. క్యాంపస్ నియామకాల తగ్గుముఖానికి కంపెనీలు ఆశించే నైపుణ్యాలు అభ్యర్థుల్లో లేకపోవడమే కారణమని సర్వే ఫలితాల విశ్లేషణలో తేలింది.

నైపుణ్యాలు లేకపోవడమే అసలు సమస్య

పెరుగుతున్న సాంకేతిక అవసరాలు, వృద్ధి నేపథ్యంలో కంపెనీలు అభ్యర్థుల నుంచి ప్రత్యేక స్కిల్స్‌ని ఆశిస్తున్నాయని, బహుముఖ ప్రతిభ గల అభ్యర్థులపై ఎక్కువ దృష్టి సారిస్తున్నాయని విజ్‌డమ్‌జాబ్స్ డాట్‌కామ్ సీఈఓ అజయ్ కొల్లా తెలిపారు. ప్రత్యేక నైపుణ్యాలతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, విశ్లేషణా నైపుణ్యం లేకపోవడం వల్ల కంపెనీలు క్యాంపస్ నియామకాలకు దూరమవుతున్నాయని సర్వే పేర్కొన్నది. 73 శాతం మంది అభ్యర్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోవడం గమనార్హం. 58 శాతం అభ్యర్థుల్లో విశ్లేషణా సామర్థ్యం ఉండటం లేదని సర్వేలో తేలింది. ప్రధానంగా విద్యాసంస్థలు విద్యార్థులను తీర్చిదిద్దడంలో విఫలమవుతున్నట్టు సర్వే ఫలితాలు సూచిస్తున్నాయి. 60 శాతం ప్రైవేటు విద్యాసంస్థల్లో క్వాలిఫైడ్ ఫ్యాకల్టీ లేదని సర్వే వెల్లడించింది.

కేసుల దర్యాప్తులో పెరిగిన వేగం

ఎఫ్‌ఎస్‌ఎల్, పోలీస్‌శాఖల మధ్య ఆన్‌లైన్ బంధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీస్‌శాఖ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్‌ఎస్‌ఎల్) మధ్య ఆన్‌లైన్ బంధం ఏర్పడటంతో కేసుల దర్యాప్తులో వేగం పెరిగిందని పోలీసు అధికారులు చెప్తున్నారు. ఏదైనా నేరం జరిగిన సమయంలో సేకరించిన ఆధారాలను పోలీసులు పరీక్షల నిమిత్తం ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపిస్తుంటారు. అన్నిరకాల పరీక్షల నివేదికలు ఒకే సమయంలో రావు. కొన్నింటికి నెలరోజులు, అంతకంటే ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో నివేదికలు నిర్దేశించిన సమయంలో రాకపోవడంతో దర్యాప్తులో ఆలస్యం జరుగుతుండేది. దీంతో పోలీసులు ఎఫ్‌ఎస్‌ఎల్ కార్యాలయం చుట్టూ తిరుగాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులను దూరం చేసేందుకు పోలీస్, ఎఫ్‌ఎస్‌ఎల్ మధ్య ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టారు. పోలీసులు సేకరించిన ఆధారాలను పరీక్షల నిమిత్తం ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపిన వెంటనే ఎన్ని ఆధారాలు పంపారు, వాటి వివరాలు, ఏయే ఆధారానికి సంబంధించిన పరీక్షల నివేదిక ఎంత సమయంలో వస్తుంది వంటి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. పరీక్షల సమయంలో పోలీసులతో ఎఫ్‌ఎస్‌ఎల్‌కు, ఎఫ్‌ఎస్‌ఎల్ సిబ్బందితో పోలీసులకు అవసరం ఏర్పడితే ఆన్‌లైన్ ద్వారానే సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకొంటున్నారు. దీంతో నిర్దేశిత సమయంలో నివేదికలు రావడంతోపాటు, ల్యాబ్ చుట్టూ తిరిగే ఇబ్బందులు తప్పిందని అధికారులు చెప్తున్నారు. ఎఫ్‌ఎస్‌ఎల్ నివేదికలు తొందరగా అందితే కోర్టులో చార్జిషీట్లు త్వరగా దాఖలు చేసే అవకాశం ఉంటుందన్నారు.

కొనసాగుతున్న చలి తీవ్రత

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతున్నది. గురువారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రత 8 డిగ్రీలుగా నమోదవగా, జగిత్యాలలో 10, వరంగల్ రూరల్‌లో 11, కరీంనగర్‌లో 13 డిగ్రీలుగా నమోదైంది. మిగతా జిల్లాల్లోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14 నుంచి 20 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు మరోసారి సాధారణ స్థాయికి చేరుకున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో చలిప్రభావం తగ్గుముఖం పడుతున్నది. గురువారం గరిష్ఠ ఉష్ణోగ్రత 31 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 17 డిగ్రీలుగా నమోదయినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
మంచిర్యాల	31.2	8.0
కుమ్రంభీం ఆసిఫాబాద్	31.2	8.0
ఆదిలాబాద్	31.2	8.0
నిర్మల్	31.2	8.0
జగిత్యాల	29.5	10.0
వరంగల్ రూరల్	30.0	11.0
కరీంనగర్	35.3	13.0
పెద్దపల్లి	31.4	13.4
ఖమ్మం	31.0	14.0
వికారాబాద్	31.5	14.5
వరంగల్ అర్బన్	30.5	15.5
మహబూబాబాద్	29.0	16.0
జనగామ	31.0	16.0
నల్లగొండ	30.0	16.6
నిజామాబాద్	30.4	16.8
కామారెడ్డి	30.4	16.8
యాదాద్రి భువనగిరి	30.0	17.0
హైదరాబాద్	31.0	17.0
రంగారెడ్డి	31.0	17.0
మేడ్చల్	31.0	17.0
జయశంకర్ భూపాలపల్లి	32.0	17.0
వనపర్తి	33.6	17.1
మెదక్	31.3	17.2
సంగారెడ్డి	31.3	17.2
సిద్దిపేట	31.3	17.2
నాగర్‌కర్నూల్	31.0	18.0
సూర్యాపేట	32.0	18.0
రాజన్న సిరిసిల్ల	32.0	18.0
భద్రాద్రి కొత్తగూడెం	33.0	18.0
మహబూబ్‌నగర్	34.0	18.5
జోగుళాంబ గద్వాల	32.0	20.0

ఇండ్ల కొనుగోలుదారులకు లబ్ధి?

ఆదాయ పన్ను ప్రయోజనాల కోసం ఫ్లాట్ బయ్యర్ల సంఘం డిమాండ్

న్యూఢిల్లీ, జనవరి 11: గడువులోగా ఇండ్లను బిల్డర్లు అప్పగించకపోవడంతో ఆదాయ పన్ను ప్రయోజనాలను కొనుగోలుదారులు కోల్పోవాల్సి వస్తుండగా, దీనికి సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం ఎత్తివేయాలని నేషనల్ ఫ్లాట్ బయ్యర్ల సంఘం డిమాండ్ చేస్తున్నది. బిల్డర్ల పొరబాట్ల కారణంగానే ఇండ్ల స్వాధీనం ఆలస్యమవుతున్నది, అయినప్పటికీ ఏ తప్పూ చేయని కొనుగోలుదారులు మాత్రం గృహ రుణాలపై రూ.2 లక్షల వరకు పన్ను మినహాయింపును పొందలేకపోతున్నారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీకి రాసిన లేఖలో అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. కాబట్టి రాబోయే బడ్జెట్‌లో గృహ కొనుగోలుదారులకు మేలు జరిగేలా ఆదాయ పన్ను ప్రయోజనాల నిబంధనలను సరళతరం చేయాలని కోరింది.



భారీ సంస్కరణలుండకపోవచ్చు

వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న క్రమంలో ఈ ఫిబ్రవరి 1న ప్రకటించే 2018-19 వార్షిక బడ్జెట్‌లో భారీ సంస్కరణలకు చోటుండకపోవచ్చన్న అభిప్రాయాన్ని సుందరం మ్యూచువల్ ఫండ్ ఈక్విటీ సీఐవో ఎస్ కృష్ణకుమార్ వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి, ఉద్యోగ కల్పనకు సంబంధించిన పథకాలకు పెద్ద మొత్తంలో కేటాయింపులు ఉండవచ్చున్న ఆయన ఆర్థిక వ్యవస్థను, ప్రజా జీవనాన్ని ప్రభావితం చేసే నిర్ణయాల జోలికి మోదీ సర్కారు పోకపోవచ్చన్నారు. ఇప్పటికే పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటివి ప్రజాజీవనాన్ని ఇబ్బందులకు గురిచేయడమే దీనికి కారణమన్నారు.

జైట్లీపై 'కార్పొరేట్' ఒత్తిడి

వచ్చే నెల బడ్జెట్ ప్రవేశపెడుతున్న క్రమంలో అరుణ్ జైట్లీపై కార్పొరేట్ పన్ను రేటు కోత హామీ ఒత్తిడి కనిపిస్తున్నది. 2015-16 బడ్జెట్‌లో వచ్చే నాలుగేండ్లలో కార్పొరేట్ పన్ను రేటు 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గుతుందని ప్రకటించారు. అయితే, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు నెలనెలా తగ్గిపోతుండటంతో ద్రవ్య లోటు భయాలు కేంద్రాన్ని వెంటాడుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీలో 3.2 శాతానికి ద్రవ్యలోటును కట్టడి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న.. పడిపోతున్న ఆదాయం, పెరుగుతున్న వ్యయం దృష్ట్యా ఈ లక్ష్యం నెరవేరే అవకాశాలు సన్నగిల్లాయి. ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వానికి ఈ దఫా ఆఖరి పూర్తికాల బడ్జెట్ అయిన రాబోయే బడ్జెట్‌లో కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గించి ఆదాయాన్ని మరింతగా జైట్లీ దిగజారుస్తారా? అన్నది అనుమానంగానే మారింది. ఈ క్రమంలో కనీసం 28 శాతానికైనా తగ్గించాలని ఫిక్కీసహా ఇతర కార్పొరేట్ వర్గాలు కోరుతున్నాయి.

3,500 కోట్ల బినామీ ఆస్తుల జప్తు

వివరాలను వెల్లడించిన ఐటీ శాఖ

న్యూఢిల్లీ, జనవరి 11: ఆదాయ పన్ను (ఐటీ) శాఖ రూ.3,500 కోట్ల విలువైన బినామీ ఆస్తులను జప్తు చేసింది. ఫ్లాట్లు, షాపులు, ఆభరణాలు, వాహనాలు సహా 900లకుపైగా బినామీ స్థిరచరాస్తులను స్వాధీనం చేసుకున్నట్లు గురువారం ఓ ప్రకటనలో ఐటీ శాఖ వెల్లడించింది. వీటిలో వివిధ బ్యాంకుల్లో డిపాజిట్లతోపాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లు కూడా ఉన్నాయని తెలిపింది. వీటి మొత్తం విలువ రూ.3,500 కోట్లపైనేనని, స్థిరాస్తుల విలువే సుమారు రూ.3,000 కోట్లని పేర్కొన్నది. ఐదు కేసుల్లో పట్టుబడిన ఆస్తుల విలువ రూ. 150 కోట్లపైనేనని ఐటీ శాఖ వివరించింది. ఓ కేసులో కొందరు వ్యక్తుల పేరిట దాదాపు 50 ఎకరాల భూమిని ఓ రియల్ ఎస్టేట్ సంస్థ కలిగి ఉందని, దీని విలువ రూ.110 కోట్లకుపైగా ఉందని చెప్పిన ఐటీ శాఖ.. మరో కేసులో పాత పెద్ద నోట్ల రద్దు తర్వాత ఇద్దరు వ్యక్తులు తమ వద్ద పనిచేస్తున్న సిబ్బంది ఖాతాల్లో దాదాపు రూ.39 కోట్ల వరకు రద్దయిన నోట్లను డిపాజిట్ చేశారన్నది. ఇంకో కేసులో రూ.1.11 కోట్లు వాహనంలో పట్టుబడ్డాయని, ఈ నగదు తమదంటూ ఎవరూ ముందుకురాలేదన్నది. కాగా, బినామీ ఆస్తుల లావాదేవీల నిషేధిత చట్టం కింద తీసుకున్న చర్యల్లో భాగంగా వీటన్నిటినీ జప్తు చేసినట్లు పేర్కొన్నది. 2016 నవంబర్ 1 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ చట్టం ప్రకారం బినామీ స్థిరచరాస్తులను స్వాధీనం చేసుకోవడమేగాక, ప్రయోజనం పొందిన యజమానిని విచారణ కూడా చేయవచ్చు. బినామీదారు నేరం రుజువైతే గరిష్ఠంగా ఏడేండ్ల వరకు కఠిన జైలుశిక్ష, పట్టుబడిన ఆస్తుల మార్కెట్ విలువలో 25 శాతం వరకు జరిమానాను ఎదుర్కోవాల్సి ఉంటుంది. బినామీ ఆస్తులపట్ల కఠిన వైఖరిని అవలంభించడంలో భాగంగా గతేడాది మే నెలలో తమ దర్యాప్తు విభాగాల పర్యవేక్షణలో దేశవ్యాప్తంగా 24 అంకిత భావం కలిగిన బినామీ నిర్మూలన యూనిట్ల (బీపీయూ)ను కూడా ఐటీ శాఖ ఏర్పాటుచేసింది.





- బినామీ అంటే 'పేరు లేనిది'. 'న్యాయ/చట్టబద్ధమైన యజమాని లేని ఆస్తి' లేదా 'కల్పిత యజమాని' ఆస్తి
- ఎవరివద్దనైతే ఓ ఆస్తి ఉందో, ఎవరికైతే బదిలీ అయ్యిందో ఆ ఆస్తి లావాదేవీలకు సంబంధించి వేరొకరు చెల్లింపులు జరుపడాన్ని బినామీ లావాదేవీగా బినామీ చట్టం చెబుతున్నది
- నల్లధనం నిర్మూలనలో భాగంగా తొలిసారి 1988లో పరిచయమైన బినామీ చట్టం
- బినామీ లావాదేవీల నిషేధం, ఆస్తుల జప్తు కోసం 2016లో సవరణలు
- ఆస్తులను దాచి పెట్టడం లేదా ఓ ఆస్తి తనదేనని ప్రకటించకపోవడం, ఇతరుల పేరిట లావాదేవీలను నిర్వహించడం వంటి వాటిని బినామీ చట్టం-2016లో చేర్చారు

స్మార్ట్ లగేజ్‌పై జెట్ ఎయిర్‌వేస్ నిషేధం!

ముంబై, జనవరి 11: ఈ నెల 15 నుంచి తమ విమానాల్లో స్మార్ట్ లగేజ్‌ను నిషేధిస్తున్నట్లు దేశీయ ప్రైవేట్ రంగ విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్ గురువారం ప్రకటించింది. అంతర్జాతీయ విమాన రవాణా సంఘం (ఐఏటీఏ) సూచనల ప్రకారం లిథియం బ్యాటరీలు, మోటార్లు, పవర్ బ్యాంక్స్, జీపీఎస్, జీఎస్‌ఎం, బ్లూటూత్, ఆర్‌ఎఫ్‌ఐడీ లేదా వై-ఫై టెక్నాలజీతో కూడిన పరికరాలు తదితర స్మార్ట్ లగేజ్‌ను అనుమతించబోమని తెలిపింది. అయితే బ్యాటరీ తీసేస్తే లిథియం బ్యాటరీ ఆధారిత ఉత్పత్తులను అనుమతిస్తామని పేర్కొన్న జెట్ ఎయిర్‌వేస్.. సదరు బ్యాటరీలను క్యాబిన్ బ్యాగేజ్‌లో మాత్రమే అనుమతిస్తామన్నది. కాగా, తమ ఈ ప్రకటన అంతరార్థం విమానంలో ప్రయాణీకుడు మొబైల్ ఫోన్‌ను ఉంచుకోవద్దని కాదని స్పష్టం చేసింది.

నిరాశపరిచిన టీసీఎస్

క్యూ3లో లాభం రూ.6,531 కోట్లు
షేరుకు రూ.7 మధ్యంతర డివిడెండ్

ముంబై, జనవరి 11: దేశంలో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.6,531 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.6,778 కోట్ల లాభంతో పోలిస్తే 3.6 శాతం క్షీణించగా, క్యూ2లో నమోదైన దాంతో పోలిస్తే మాత్రం ఒక శాతానికి పైగా పెరిగింది. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికి సంస్థ రూ. 30,904 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2016-17 ఏడాది ఇదే కాలానికి వచ్చిన రూ.29,735 కోట్లతో పోలిస్తే 3.9 శాతం వృద్ధిని కనబరిచింది. దేశీయ అకౌంటింగ్ ప్రమాణాలకు లోబడి సంస్థ ఈ ఆర్థిక ఫలితాలను విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రతి షేరుకు రూ.7 మధ్యంతర డివిడెండ్‌ను సంస్థ ప్రకటించింది. ఈ నెల చివరిలోగా ఈ డివిడెండ్ చెల్లింపులను జరుపనున్నది. బ్యాంకింగ్, ఆర్థికం, సేవలు, బీమా రంగాల్లో నిరాశాజనక పనితీరు కనబరుచడం వల్లనే లాభాల్లో గండిపడిందని టీసీఎస్ సీఈవో, ఎండీ రాజేష్ గోపీనాథన్ తెలిపారు. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో డిజిటల్ రంగం వాటా 22.1 శాతంగా ఉందని, అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 40 శాతం ఎగబాకిందని ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. గడిచిన త్రైమాసికంలో డిజిటల్ విభాగంలో తొలిసారిగా 50 మిలియన్ డాలర్లకంటే అధిక విలువైన మూడు ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు చెప్పారు. వీటితోపాటు 20 మిలియన్ డాలర్ల విలువైనవి ఒప్పందాలు ఏడు కాగా, 10 మిలియన్ డాలర్లవి తొమ్మిది, 5 మిలియన్ డాలర్లవి 15 ఉన్నాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. డిజిటల్ రంగంతోపాటు రిటైల్, ఇండస్ట్రీ వర్టికల్ విభాగాలు కూడా మెరుగైన పని తీరును కనబరిచినట్లు చెప్పారు. ఇక వలసల విషయానికి వస్తే రెండో త్రైమాసికంలో నమోదైన 11.3 శాతంతో పోలిస్తే ఆ తర్వాతి త్రైమాసికానికిగాను 0.2 శాతం తగ్గి 11.1 శాతానికి పరిమితమైంది. నికరంగా గడిచిన మూడు నెలల్లో 12,534 మంది సిబ్బంది చేరడంతో మొత్తం సంఖ్య 3,90,880కి చేరుకున్నారు. అలాగే బిజినెస్ 4.0 నూతన విభాగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు, అలాగే డిజిటల్ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి వీ రామకృష్ణన్ పేర్కొన్నారు. కంపెనీ షేరు ధర రూ.2,788.40 వద్ద స్థిరపడింది.



రాజేష్ గోపీనాథన్

సహారా గ్రూపునకు ఊరట

ఐఆర్‌డీఏఐ తీర్పును రద్దు చేసిన ఎస్‌ఏటీ

ముంబై, జనవరి 11: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సహారా గ్రూపునకు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎస్‌ఏటీ)లో పెద్ద ఊరట లభించింది. సహారా గ్రూపునకు చెందిన జీవిత బీమా వ్యాపారాన్ని స్వాధీనం చేసుకోవాల్సిందిగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌ను ఆదేశిస్తూ గత ఏడాది జూలై 28వ తేదీన బీమా రంగ నియంత్రణా సంస్థ ఐఆర్‌డీఏఐ (ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ) ఇచ్చిన తీర్పును ఎస్‌ఏటీ గురువారం రద్దు చేసింది. ఈ వ్యవహారంలో సహారా సంస్థను విచారించిన తర్వాత ఐఆర్‌డీఏఐ మరోసారి తీర్పును ప్రకటించాలని సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ సూచించింది. అయితే తాత్కాలికంగా సహారా లైఫ్ సంస్థను నడిపేందుకు అడ్మినిస్ట్రేటర్‌ను నియమించాలన్న ఐఆర్‌డీఏఐ నిర్ణయాన్ని మాత్రం ఎస్‌ఏటీ సమర్థించింది.

పేటీఎం షాపింగ్ ఫెస్టివల్

హైదరాబాద్, జనవరి 11: ప్రముఖ ఆన్‌లైన్ సేవల సంస్థ పేటీఎం.. ఈ నెల 17 వరకు హైదరాబాద్‌లో షాపింగ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఈ ఫెస్టివల్‌లో భాగంగా స్థానిక దుకాణాలు, బ్రాండ్ షోరూంలను ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఫెస్టివెల్‌లో వస్తువులను కొనుగోలు చేసేవారికి రూ.50 కోట్ల వరకు క్యాష్‌బ్యాక్‌ను అందిస్తున్నట్లు తెలిపింది.

ఏటా వెయ్యి స్క్రీన్లు: బుక్‌మైషో

హైదరాబాద్, జనవరి 11: సినిమా టిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా అందించే బుక్‌మైషో భారీ విస్తరణకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 5వేల స్క్రీన్లు కలిగివుండగా, ఇకనుంచి ప్రతియేటా వెయ్యి స్క్రీన్లకు సేవలు అందించాలనుకుంటున్నట్లు కంపెనీ సీవోవో అశిష్ సక్సేనా తెలిపారు. వీటిలో తెలుగు రాష్ర్టాల్లో 650 స్క్రీన్లు కలిగివుండగా, వచ్చే ఏడాది మరో 240 అందుబాటులోకి రానున్నట్లు ఆయన చెప్పారు. సినిమా టిక్కెట్ల విక్రయంలో హైదరాబాద్ దూసుకుపోతున్నదన్నారు.

నిరుద్యోగులకు మంచి రోజులు

కొత్త సిబ్బందిని నియమించుకునేందుకు 55 శాతం సంస్థల ఎదురుచూపు

ఈ ఏడాది 10 శాతం పెరుగనున్న జీతాలు



న్యూఢిల్లీ, జనవరి 11: ఉద్యోగార్థులకు శుభవార్త. నిరుద్యోగులకు త్వరలో మంచి రోజులు రాబోతున్నాయని, దేశంలోని అనేక సంస్థలు ఈ ఏడాది తమ ఉద్యోగుల వేతనాలను 10 శాతం మేరకు పెంచడంతో పాటు పెద్ద సంఖ్యలో కొత్త ఉద్యోగులను చేర్చుకునే అవకాశం ఉందని మెర్సెర్స్-2017 ఇండియా టోటల్ రెమ్యునరేషన్ తన సర్వే నివేదికలో వెల్లడించింది. దేశంలోని 791 సంస్థలపై సర్వే నిర్వహించి ఈ నివేదిక రూపొందించామని, వీటిలో దాదాపు 55 శాతం సంస్థలు రానున్న 12 నెలల్లో కొత్త ఉద్యోగులను చేర్చుకోవాలన్న ఆలోచనలో ఉన్నాయని మెర్సెర్స్ స్పష్టం చేసింది. ఆర్థిక పరిస్థితులు ఆశావహంగా ఉన్నప్పటికీ నైపుణ్యత కలిగిన ఉద్యోగుల కొరత ఏర్పడటంతో దేశ పారిశ్రామిక వృద్ధి మందకొడిగానే కొనసాగే అవకాశం ఉందని, దీంతో ఈ ఏడాది కొత్త ఉద్యోగులను చేర్చుకోవాలని దేశంలోని ప్రతి రెండు సంస్థల్లో ఒకటి ఆలోచిస్తున్నదని మెర్సెర్స్ ఇండియా బిజినెస్ లీడర్ శాంతి నరేష్ తెలిపారు. రిటైల్, ఎఫ్‌ఎంసీజీ, తయారీ, ఫార్మా, సేల్స్, డిజైనింగ్, ఎనలిటిక్ తదితర రంగాల్లో ఉద్యోగులపై బాధ్యతలు పెరుగడంతో కొత్త సిబ్బందిని నియమించడం అనివార్యంగా కనిపిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఇదిలావుంటే, క్లౌడ్, సెక్యూరిటీ, డేటా సైన్స్ తదితర రంగాల్లో నైపుణ్యమున్న వారికి ఈ ఏడాది ఎక్కువగా ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఐబీఎం ఇండియా మానవ వనరుల విభాగం వైస్‌ప్రెసిడెంట్ దిల్‌ప్రీత్ సింగ్ తెలిపారు.

ఇండస్‌ఇండ్ లాభంలో భారీ వృద్ధి



ముంబై, జనవరి 11: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.936.25 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు హిందుజా గ్రూపునకు చెందిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రకటించింది. కీలక ఆదాయం భారీగా పుంజుకోవడం ఇందుకు కలిసొచ్చిందని బ్యాంక్ వర్గాలు వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.756.24 కోట్లతో పోలిస్తే 24.72 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. ఆదాయం విషయానికి వస్తే రూ.4,716.13 కోట్ల స్థాయి నుంచి రూ.5,473.54 కోట్లకు పెరిగినట్లు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది. గడిచిన త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 20 శాతం పెరిగి రూ.1,894.81 కోట్లకు చేరుకోగా, అడ్వాన్స్‌ల్లో 25 శాతం, డిపాజిట్లలో 23 శాతం మేర పెరిగినట్లు బ్యాంక్ ఎండీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ రమేష్ సోబ్టి తెలిపారు. సమీక్షకాలంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.16 శాతంగా నమోదైందన్నారు. సూక్ష్మ రుణాలు అందించే భారత్ ఫైనాన్షియల్స్ సంస్థ విలీనానికి సీసీఐ ఆమోదం తెలిపిందని, అలాగే సెబీ, ఎన్‌సీఎల్‌టీ అనుమతికోసం వేచి చూస్తున్నట్లు ఆయన చెప్పారు. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు ధర 2.08 శాతం తగ్గి రూ.1,698.80 వద్ద ముగిసింది.

5 లక్షల ఉద్యోగాలకు బ్రెగ్జిట్ దెబ్బ

ఈయూ నుంచి వైదొలిగితే బ్రిటన్‌కు తిప్పలేనంటున్న సర్వే

లండన్, జనవరి 11: బ్రెగ్జిట్ కారణంగా బ్రిటన్‌లో ఏకంగా 5 లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడుతున్నాయి. కేంబ్రిడ్జ్ ఎకనామెట్రిక్స్ రిసెర్చ్ తాజా అధ్యయనం ప్రకారం యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలిగితే (బ్రెగ్జిట్) 2030కల్లా దేశంలో 4,82,000 ఉద్యోగాలు మాయం కావడం ఖాయమని తేలింది. అంతేగాక ఈయూతో సత్సంబంధాలు చెడిపోతే బ్రిటన్ ఆర్థిక వ్యవస్థకు రాబోయే దశాబ్దానికిపైగా కాలంలో వాటిల్లే నష్టం 62.9 బిలియన్ డాలర్లని అంచనా వేసింది. వచ్చే ఏడాది మార్చి ఆఖరు నాటికి ఈయూ నుంచి బ్రిటన్ బయటకు రావాల్సి ఉండగా, ఈయూతో కలిసి ఉండలేమని ఇప్పటికే బ్రిటీష్ ప్రభుత్వం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం విడుదలైన సర్వే ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈయూ నిబంధనల ప్రకారం బ్రిటన్‌పై వ్యాపారపరంగా తీవ్ర ఒత్తిడి ఏర్పడవచ్చని, ఇది ఉద్యోగాలను, ఆదాయాన్ని ప్రభావితం చేయవచ్చని తెలిపింది.

ప్రత్యేక ఎడిషన్‌గా హోండా సిటీ

మరో రెండు కార్లు కూడా..



న్యూఢిల్లీ, జనవరి 11: ప్రముఖ కార్ల తయారీ సంస్థ హోండా.. ప్రత్యేక ఎడిషన్లుగా ఒకేసారి మూడు కార్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో సిటీ, అమేజ్, డబ్ల్యూఆర్-వీ ఉన్నాయి. 20వ వార్షికోత్సవ ఎడిషన్‌గా విడుదల చేసిన హోండా సిటీ పెట్రోల్ ఆటోమేటిక్ వెర్షన్ ధర రూ.13,74,532గాను, డీజిల్ రకం రూ.13,82,382గా నిర్ణయించింది. అలాగే అమేజ్ ప్రైడ్ పెట్రోల్ రకం రూ.6,29,900, డీజిల్ మోడల్ రూ.7,83,486గాను, డబ్ల్యూఆర్-వీ పెట్రోల్ రకం రూ.8,01,017, డీజిల్ మోడల్‌ను రూ.9,04,683కు విక్రయించనున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంకు సంబంధించినవి.


మార్కెట్లోకి రూ.3 కోట్ల కారు

విడుదల చేసిన లంబోర్ఘిని



ముంబై, జనవరి 11: ఇటలీకి చెందిన సూపర్ స్పోర్ట్స్ కార్ల తయారీ సంస్థ లంబార్గినీ దేశీయ మార్కెట్లోకి తొలిసారిగా సూపర్ స్పోర్ట్స్ యుటిలిటీ వాహనమైన 'యూరస్'ను ప్రవేశపెట్టింది. ఈ కారు ధర అక్షరాల రూ.3 కోట్లు. 4.0 లీటర్ల వీ8 ఇంజిన్‌తో రూపొందించిన ఈ కారు 100 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 3.6 సెకండ్లలో అందుకుంటుందని, అలాగే గంటకు 305 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుందని లంబార్గినీ జనరల్ మేనేజర్ అంద్రే బాల్డి తెలిపారు. ప్రపంచంలో అత్యధిక వేగంతో దూసుకుపోతున్న కారు ఇదే కావడం విశేషం. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో లగ్జరీ కార్లకు డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ ఏడాది అమ్మకాలు మూడు రెట్లు పెరిగే అవకాశం ఉన్నదని ఆయన పేర్కొన్నారు.

షారూఖ్‌కు 'డబ్ల్యూఈఎఫ్' క్రిస్టల్ అవార్డు



దావోస్: ఈ నెల 22న జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో బాలీవుడ్ మెగాస్టార్ షారూఖ్ ఖాన్ 'క్రిస్టల్' అవార్డు అందుకోనున్నారు. ఆయనతోపాటు హాలీవుడ్ నటి కేట్ బ్లాచెట్, ప్రముఖ సంగీత విద్వాంసుడు సర్ ఎల్టాన్ జాన్ ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. భారతదేశంలో మహిళలు, బాలల హక్కుల పరిరక్షణ కోసం ముందుండి పోరాడినందుకు షారూఖ్‌ఖాన్‌కు ఈ అవార్డు ప్రదానం చేస్తున్నట్లు డబ్ల్యూఈఎఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇంతకుముందు భారత్ నుంచి ఈ అవార్డును అమితాబ్ బచ్చన్, మల్లికా సారాభాయి, ఏఆర్ రెహ్మాన్, షబానా అజ్మీ, రవి శంకర్, అంజాద్ అలీఖాన్ తదితరులు అందుకున్నారు. షారూఖ్‌ఖాన్, కేట్ బ్లాచెట్, సర్ ఎల్టాన్ జాన్ తమ తమ రంగాల్లో మానవత్వ పరిరక్షణకు కృషి చేసినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారని డబ్ల్యూఈఎఫ్ వివరించింది.

పట్టణీకరణలో చైనాను కాపీ కొట్టం: నీతిఆయోగ్


న్యూఢిల్లీ: పట్టణీకరణపై చైనా విధానాలను అనుసరించబోమని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్‌కుమార్ అన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'మన సొంత పట్టణీకరణకు బయటివాళ్ల నమూనాలను చూడనవసరం లేదు. మనకున్న వైవిధ్యం, బహుళతత్వం వల్ల మన దేశంలో అసమానమైన/ అసమతుల్య పట్టణీకరణను అనుమతించం. చైనా ఏదైతే చేసేందో దానిని మనం అనుసరించలేము' అని పేర్కొన్నారు. దేశంలోని 115 వెనుకబడిన జిల్లాలకు త్వరలో ర్యాంకులను కేటాయించనున్నట్లు రాజీవ్‌కుమార్ తెలిపారు.

అసాంజేకు ఈక్వెడార్ పౌరసత్వం

దౌత్య హోదా ఇచ్చేందుకు నిరాకరించిన బ్రిటన్

క్విటో: పలు దేశాల రహస్యాల బట్టబయలుతో, పలువురు నేతలకు కంటగింపుగా మారిన వికిలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజేకు ఈక్వెడార్ ప్రభుత్వం పౌరసత్వం మంజూరు చేసింది. ఐదేండ్లుగా ఆయన లండన్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయంలోనే తలదాచుకుంటున్నారు. అసాంజేకు పౌరసత్వం మంజూరు చేశామని, ఆయనను బ్రిటన్ నుండి బయటకు తెచ్చే మార్గాలను అన్వేషిస్తున్నామని ఈక్వెడార్ విదేశాంగ మంత్రి గురువారం చెప్పారు. లైంగికదాడి ఆరోపణలపై స్వీడన్‌లో కేసు నమోదు కాగా, అసాంజే అరెస్టుకు బ్రిటన్ ప్రయత్నిస్తున్నది. దీంతో ఈక్వెడార్ ఆయనకు 2012 నుంచి రాజకీయ ఆశ్రయం కల్పించింది.

ఆకట్టుకున్న సైకత శిల్పాలు





పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కల గూడూర్ గ్రామానికి చెందిన రేవెళ్లి శంకర్ వేసిన సైకత శిల్పాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామి వివేకానందతోపాటు తెలంగాణ కవి అలిశెట్టి ప్రభాకర్ జయంతిని పురస్కరించుకుని గురువారం సైకత శిల్పాలను వేసి అబ్బురపరిచారు.

- పాలకుర్తి

డార్ఫ్ దంపతులకు ఘన నివాళి

జైనూర్: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయిలో ఆదివాసీల ఆరాధ్యదైవం ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ దంపతుల 31వ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఆసిఫాబాద్, ఆదిలాబాద్ కలెకర్లు ప్రశాంత్ జీవన్ పాటిల్, దివ్య, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎస్పీ కల్మేశ్వర్ శింగన్‌వార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డోలు, వాయిద్యాల నడుమ హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజిబెత్ దంపతుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ త్వరలో జిల్లాలో కుమ్రం భీం స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువకులకు అవగాహన కార్యక్రమాలు,ఉద్యోగాల శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజన సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు కృషిచేస్తామని, హైమన్ డార్ఫ్ దంపతుల ఆశయాల మేరకు అభ్యున్నతి సాధించాలని ఐటీడీఏ చైర్మెన్ దివ్య కోరారు. పోలీసు శాఖ తరపున 3 లక్షల పుస్తకాలను మార్లవాయి లైబ్రరీకి అందించారు.



హైమన్‌డార్ఫ్ దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న కలెక్టర్లు ప్రశాంత్ జీవన్‌పాటిల్, దివ్య, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎస్పీ

తొమ్మిది ఎంపీటీసీ స్థానాల ఉప ఎన్నిక ప్రశాంతం

- ఆదిలాబాద్ జిల్లా మెట్పూర్‌లో ఏకగ్రీవం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వివిధ కారణాలతో ఖాళీ అయిన తొమ్మిది మండల ప్రాదేశిక నియోజకవర్గాలకు (ఎంపీటీసీ) జరిగిన ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ మండలంలో మెట్పూర్‌లో ఎంపీటీసీ స్థానం ఏకగ్రీంగా ఎన్నికైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నిడమనూరు మండలం ఎర్రబెల్లిలో 84.6 శాతం, పొనుగోడు మండలం కిష్టాపురంలో 93 శాతం, ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని కౌటాల మండల కేంద్రంలో 81.5 శాతం, మహబూబ్‌నగర్ జిల్లా నర్వ మండలం కమ్మనూరులో 64 శాతం, మక్తల్ మండలం లింగంపల్లిలో 69.53 శాతం, ఖమ్మం జిల్లా జక్కపల్లిలో 87 శాతం, భద్రాచలం మండల కేంద్రంలో 48 శాతం, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో 63 శాతం పోలింగ్ జరిగింది. వీటి లెక్కింపు ఈ నెల 13న జరుగనున్నది.



జనగామ జిల్లా కేంద్రం సూర్యాపేట రోడ్డులోని యాదగిరి ఇంటి ఆవరణలోగల తులసి చెట్టుపై తాబేలు ఆకారంలోని వింత పురుగు వాలింది. రాగి, బంగారు వర్ణంతో ఉండటంతో అందరూ ఆసక్తిగా తిలకించారు. ఇలాంటి పురుగును తామెప్పుడూ చూడలేదన్నారు.

- జనగామ టౌన్

మేడారం జాతర ప్రతిష్ఠాత్మకం

- సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి
- జాతీయ పండుగ గుర్తింపునకు కేంద్రానికి లేఖ
- గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎక్కా



మేడారంలో మాట్లాడుతున్న గిరిజనసంక్షేమ శాఖ కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా

జయశంకర్ జిల్లా ప్రతినిధి/నమస్తే తెలంగాణ: ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు మేడారంలో జరిగే సమ్మక్కసారలమ్మ మహాజాతరను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నట్టు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా తెలిపారు. గురువారం ఆయన మేడారాన్ని సందర్శించి జాతర పనులను పరిశీలించారు. మేడారంలో రూ.1.60 కోట్లతో నిర్మిస్తున్న ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించి 18వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మ్యూజియం ఆవరణలో గిరిజన సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు హంపీ థియేటర్(కళావేదిక), 46 ఆధునిక గుడారాల నిర్మాణ పనులను కూడా పూర్తి చేయాలన్నారు. గిరిజన సంస్కృతి, సమ్మక్కసారలమ్మ విశిష్టతకు అద్దంపట్టే రీతిలో మ్యూజియం సిద్ధం చేయాలని ఆదేశించారు. మ్యూజియంలో సమకూర్చాల్సిన వస్తువులపై సూచనలు చేశారు. మేడారం సమీపంలో రూ.30 లక్షలతో కొత్తగా నిర్మిస్తున్న రెండు హెలీప్యాడ్ పనులను కూడా ఎక్కా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ మహాజాతర నిర్వహణ కోసం సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కోరుతూ శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ప్రత్యేకంగా కేంద్రానికి లేఖరాశారని పేర్కొన్నారు. జాతర ప్రారంభమయ్యేలోపు కేంద్ర ప్రభుత్వం నుంచి తీపి కబురు అందవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి మేడారం వచ్చే భక్తుల సంఖ్య గతంలో కంటే పెరుగనున్నందున ముందు జాగ్రత్తలు చేపట్టామని, ట్రాఫిక్, తొక్కిసలాట, తోపులాట, చైన్‌స్నాచింగ్‌లు, ఇతర నేరాలు వంటివి తలెత్తకుండా పోలీసు శాఖ పకడ్బందీ ప్రణాళిక రూపొందించిందని ఎక్కా చెప్పారు. ఆయన వెంట మేడారం జాతర ట్రస్టు బోర్డు చైర్మన్ కాక లింగయ్య, జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్వీ కర్ణన్, ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చక్రధర్‌రావు, ములుగు సబ్‌కలెక్టర్ గౌతమ్‌కుమార్ తదితరులున్నారు.



'కాళేశ్వరం' రైతులకు వరం

- వానకాలం నుంచి ఎస్సారెస్పీ కాల్వలకు నీరు
- 20 ఏండ్లవరకు టీఆర్‌ఎస్‌దే అధికారం
- యాసంగి పంటకు తొలిసారి దేవాదుల నీరు
- బహిరంగ సభలో మంత్రి తన్నీరు హరీశ్‌రావు



భూపాలపల్లి జిల్లా రేగొండ బహిరంగసభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి,మండలి విప్ వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మ, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి, చల్లా ధర్మారెడ్డి

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల తెలంగాణ రైతులకు వరమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే వానకాలం నుంచి ఎస్సారెస్పీ కాల్వల ద్వారా చివరి ఆయకట్టుకు నీరు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. మంత్రి హరీశ్‌రావు గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. ఎస్సారెస్పీ డీబీఎం-38 కాల్వ ఆధునీకరణ కోసం రూ.58కోట్లతో చేపట్టిన పనులకు రేగొండ వద్ద శంకుస్థాపన చేశారు. ఇక్కడ రైతుల కోసం రూ.3.50 కోట్లు వెచ్చించి 5వేల టన్నుల సామర్థ్యంతో మార్కెటింగ్ శాఖ నిర్మించిన గోదాం ప్రారంభించారు. రేగొండ వద్ద శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో మంత్రి ప్రసంగిస్తూ.. రైతు శ్రేయస్సే లక్ష్యంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. కేసీఆర్ సీఎం కావటం, తెలంగాణ రావటం మన అదృష్టమని రైతులను ఉద్దేశించి అన్నారు. కోటి ఎకరాలకు నీరందించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ముందుకు వెళ్తున్నారని చెప్పారు. వచ్చే 20 ఏండ్లవరకు రాష్ట్రంలో టీఆర్‌ఎస్ అధికారంలో ఉంటుందన్నా రు. ఈ నేపథ్యంలో సుమారు 37లక్షల ఎకరాలకు నీరందించటానికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయన్నారు. సీడబ్ల్యూసీ అధికారులు రెండు రోజుల క్రితం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన ఇక్కడ సాగుతున్న పనులను చూసి ఆశ్చర్యపోయారన్నారు. దేశంలో ఏ సాగునీటి ప్రాజెక్టు పనులు కూడా ఇంత వేగంగా జరుగడం లేదని అబ్బురపడ్డారని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల చరిత్రలో దేశంలో ఇదో రికార్డుగా అభివర్ణించారని, బ్యారేజీలు, పంప్‌హౌస్‌లు, పైపులైన్, టన్నల్ నిర్మాణ పనులను చూడటానికి రెండు కళ్లు చాలలేదని చెప్పారని మంత్రి అన్నారు.

యాసంగికి దేవాదుల నీరు

ముందెన్నడూ లేని విధంగా ఈ ఏడాది యాసంగికి జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ద్వారా నీరు ఇవ్వనున్నట్టు మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. 'గతంలో ఎప్పుడు కూడా దేవాదుల మోటర్లు నవంబర్ లేదా డిసెంబర్ వరకు మాత్రమే పనిచేసేవి. జనవరిలో మోటర్లు పనిచేయటం ఇదే ప్రథమం. సంక్రాంతిలోపు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరితో కలిసి దేవాదుల మోటర్లను ప్రారంభిస్తాం' అని మంత్రి అన్నారు.

కాంగ్రెస్‌పై ఫైర్

కాంగ్రెస్ నేతల తీరుపై మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఇతర రాష్ట్రాలు తెలంగాణను చూసి నేర్చుకుంటుంటే రాష్ట్రంలోని కాంగ్రెసోళ్లకు మాత్రం ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం కనిపించటం లేదని ఫైర్ అయ్యారు. గాంధీభవన్‌కే పరిమితమై ప్రెస్‌మీట్లతో టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేయటమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే రాష్ట్రంలో ప్రాజెక్టులు వడివడిగా పూర్తవుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసన సభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, శాసన మండలి విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మ, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, హౌస్ ఫెడ్ చైర్మన్ కడారి నవనీతరావు, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో మాట్లాడుతున్న మంత్రి ఈటల

రైతు రాజ్యాన్ని స్థాపిస్తాం

జమ్మికుంట/దుగ్గొండి: రైతు రాజ్య స్థాపనే లక్ష్యంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. 'ఈ-సాగు' పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో కరీంనగర్ జిల్లాను ప్రభుత్వం ఎంపిక చేయగా.. హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల రైతులకు 'ఈ-సాగు' యాజమాన్య పద్ధతులపై గురువారం అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాగా వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలం లక్ష్మీపురంలో సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి చేపట్టిన 'పల్లె ప్రగతి' సభలోనూ మంత్రి ఈటల మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్, గొర్రెల, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ రాజయ్యయాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. ఆకలి కేకల్లేని, ఆత్మహత్యల్లేని.. ఆకుపచ్చని తెలంగాణే ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. రైతులకు పైసా ఖర్చు లేకుండా పెట్టుబడులందిస్తూ, ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ఆంధ్రాపాలకుల చేతిలో అణచివేతకు గురైన తెలంగాణను సీఎం కేసీఆర్ అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారన్నారు.

వరంగల్ 44వ డివిజన్‌లో టీఆర్‌ఎస్ గెలుపు

- 835 ఓట్ల మెజారిటీతో అనిశెట్టి సరిత విజయం



విజేత సరిత

వరంగల్, నమస్తేతెలంగాణ: వరంగల్ మహా నగరపాలక సంస్థ పరిధిలోని 44వ డివిజన్ ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ విజయం సాధించింది. టీఆర్‌ఎస్ అభ్యర్థి అనిశెట్టి సరిత సమీప బీజేపీ అభ్యర్థి కొలను సంతోష్‌రెడ్డిపై 835 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. సిట్టింగ్ కార్పొరేటర్ అనిశెట్టి మురళీమనోహర్ హత్యతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మురళీమనోహర్ సతీమణి సరితను టీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. గురువారం కార్పొరేషన్ ఆవరణలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ నిర్వహించారు. మొత్తం 9641 ఓటర్లు ఉండగా అందులో 5242 ఓట్లు పోలయ్యాయి. అందులో టీఆర్‌ఎస్ అభ్యర్థి అనిశెట్టి సరితకు 3016 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి సంతోష్‌రెడ్డికి 2181 ఓట్లు వచ్చాయి. దీంతో అనిశెట్టి సరిత 835 ఓట్ల అధిక్యతతో విజయం సాధించినట్టు రిటర్నింగ్ అధికారి కరుణాకర్ ప్రకటించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: తుమ్మల



వెంకటాపురంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నదని రోడ్లు, భవనాల శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలో గురువారం మంత్రి తుమ్మల వెంకటాపురంలో 60 డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించి సభలో మాట్లాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రూ.5.50లక్షలతో అన్ని హంగులతో డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. అనంతరం మర్లపాడు - కందుకూరులో రూ.2కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, జెడ్పీ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత పాల్గొన్నారు.

నో క్యాష్..!


- పని చేస్తున్న ఏటీఎంలు అరకొరే.. మూతపడినవెన్నో..



ఆసిఫాబాద్ జిల్లా గోలేటి లో మూసి ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: డీ మానిటేషన్ అనంతరం పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. బ్యాంకింగ్ రంగం ఇంకా కోలుకోలేదు. చాలా వరకు ఏటీఎంలు మూతపడ్డాయి. కొన్ని పని చేస్తున్నా తరుచూ నోక్యాష్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. 'నమస్తే తెలంగాణ' గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఏటీఎంలు పని చేస్తున్న తీరును పరిశీలించింది. చాలా ప్రాంతాల్లో ఏటీఎంలు బోర్డులకే పరిమితమవటంతో పాటు షట్టర్లు మూసి దర్శనమిచ్చాయి. ఖాతాల్లో డబ్బులున్నప్పటికీ చేతికి వచ్చే పరిస్థితి లేక పోవటంతో ఖాతాదారులు ఇబ్బందులు పడటం కనిపించింది.

ఇటలీలో వనపర్తి జిల్లా వాసి మృతి



ఖిల్లాఘణపురం: వనపర్తి మండలం మానాజీపేటకు చెందిన జయప్రకాశ్ ఇటలీ దేశంలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన విశ్వనాథం పెద్దకుమారుడు జయప్రకాశ్(42) మూడు నెలల కిందట ఇటలీ వెళ్లి ఐఎంబీలో ఉద్యోగం చేస్తున్నారు. రెండురోజులుగా ఆఫీస్‌కు వెళ్లకపోవడంతో కార్యాలయ సిబ్బంది అతని ఇంటికి వెళ్లి చూడగా అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండడం గమనించి, అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొస్తారని స్థానికులు తెలిపారు. జయప్రకాశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు హైదరాబాద్‌లో ఉంటున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

పాన్‌గల్ /జడ్చర్ల రూరల్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. వనపర్తి జిల్లాలో ముగ్గురు, మహబూబ్‌నగర్ జిల్లాలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బొందలపల్లికి చెందిన బాలస్వామి కుటుంబం వారి బంధువులతో కలిసి ట్రాక్టర్‌పై వచ్చి పాన్‌గల్‌లోని బాలపీర్ల వద్ద మొక్కులు తీర్చుకున్నారు. తిరిగి వెళ్తున్న క్రమంలో బాలపీర్ల ముఖద్వారం మలుపు వద్ద ట్రాక్టర్ పంటపొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. డ్రైవర్ తిరుపతయ్య(45), మౌనిక(16) అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన తిరుపతమ్మ(41) వనపర్తి దవాఖానలో మృతి చెందింది. మృతి చెందిన తిరుపతయ్య, తిరుపతమ్మలు భార్యాభర్తలు. మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లికి చెందిన నవీన్(18), ప్రశాంత్(16) బైక్‌పై వెళ్తుండగా రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో గాయపడ్డారు. దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందారు.



చౌదూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

దేశంలోనే కేసీఆర్ పాలన ఆదర్శం

జడ్చర్ల, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ దేశంలోనే ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలో గురువారం ఎంపీ జితేందర్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నదన్నారు.

రామప్ప రూపురేఖలు మారుస్తాం..

- ఎంపీ సీతారాంనాయక్



వెంకటాపురం: ప్రపంచ ప్రఖ్యాతి పొందిన రామప్ప దేవాలయ రూపురేఖలు మారుస్తామని మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. భూపాలపల్లి జయశంకర్ జిల్లా రామప్ప ఆలయం చుట్టూ రూ.1.5కోట్లతో చేపట్టనున్న ప్రాకారం పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. యాదాద్రి, భద్రాద్రి తరహాలో రామప్ప ఆలయాన్ని అభివృద్ధి పర్చేందుకు సీఎం కేసీఆర్ దృష్టిసారించారన్నారు. రామప్ప కట్టపై మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటు రుద్రమదేవితోపాటు కాకతీయుల రాజుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. నందీశ్వరుడి విగ్రహంపై రోప్ వేయనున్నట్టు చెప్పారు. కామేశ్వర ఆలయ అభివృద్ధి పనులు కూడా చేపడుతామన్నారు.

బీజేపీపై ప్రజల్లో అసంతృప్తి: నాగం

నాగర్‌కర్నూల్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: బీజేపీపై ప్రజల్లో అసంతృప్తి ఉందని.. తన రాజకీయ భవిష్యత్తుపై ఉగాది తర్వాత నిర్ణయం తీసుకొంటానని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి సంచలన ప్రకటన చేశారు. నాగర్‌కర్నూల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాబోయేవి తనకు చివరి ఎన్నికలన్నారు. పార్టీ మారడంపై ప్రజలు, అభిమానుల నుంచి ఒత్తిడి వస్తున్నదని చెప్పారు. ప్రజాభీష్టం మేరకు తాను నడుచుకుంటానని తెలిపారు. ఉగాది వరకు ఆగాలని తనను కలిసిన ప్రజలకు తెలిపానని నాగం స్పష్టం చేశారు.

విపక్షాలను పిచ్చికుక్కలు కరిచాయి

- వీధుల్లో మొరుగడం కాదు.. దమ్ముంటే అసెంబ్లీలో చర్చకు రండి
- కోటి ఎకరాల మాగాణే తెలంగాణ లక్ష్యం
- విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట జిల్లా వర్ధమానుకోటలో నిర్వహించిన సోమా భరత్‌కుమార్ సన్మాన సభలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు

అర్వపల్లి/నాగారం: 24 గంటల విద్యుత్ సరఫరాపై పిచ్చికుక్కల్లా వీధుల్లో మొరుగుతున్న కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాన్ని మాని దమ్ముంటే అసెంబ్లీలో చర్చకు రావాలని విద్యుత్, ఎస్సీ కులాల అభివృద్ధి శాఖల మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా వర్ధమానుకోటలో జరిగిన టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమా భరత్‌కుమార్ ఆత్మీయ సన్మాన సభలో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలనగానే పారిపోయిన ప్రతిపక్ష నేతలు ఇప్పుడు రోడ్లెక్కి విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. విద్యుత్‌ను తామే తయారుచేశామని చిలుకపలుకులు పలుకుతున్న కాంగ్రెస్ నేతలు ఎన్నికలప్పుడు ప్రచారసభల్లో ఎందుకు చెప్పుకోలేకపోయారో ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని కొంతమంది నాయకులు కరెంటు సరఫరాపై అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడిన నాడు 6 వేల మెగావాట్లు విద్యుత్‌ను ఇచ్చిపోతే సీఎం కేసీఆర్ దానిని 14 వేల మెగావాట్ల విద్యుత్‌కు పెంచింది నిజం కాదా..? అని మంత్రి ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.12 వేల కోట్లతో నేడు 24 గంటల కరెంటిస్తున్నారన్నారు. వచ్చే ఏడాది నుంచి తుంగతుర్తి నియోజకవర్గంలోని ఎస్సారెస్పీ కాలువల ద్వారా రెండు పంటలకు గోదావరి నీళ్లిచ్చితీరుతామన్నారు. అంతకుముందు నాగారం మండలంలోని ఫణిగిరి శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం పాలకమండలి నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఫణిగిరిని పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమాల్లో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, రాష్ట్ర గ్రంథాలయసంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సభ్యులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాశం విజయయాదవరెడ్డి పాల్గొన్నారు.

ముత్యాల ముగ్గులు మురువంగా..



బాదేపల్లిలో ముగ్గు వేస్తున్న మంత్రి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని 'నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పోటీపడి రంగురంగుల ముగ్గులు వేశారు. మంచిర్యాల బాలుర పాఠశాల మైదానంలో, భద్రాద్రి కొత్తగూడెం సమీపంలోని లక్ష్మీదేవిపల్లి వివేకవర్ధని డిగ్రీ, పీజీ కళాశాల ప్రాంగణంలో, సిరిసిల్లలోని ఫంక్షన్‌హాల్‌లో, పెద్దపల్లిలో, మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయాచోట్ల కొత్తగూడెం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు జలగం వెంకటరావు, దాసరి మనోహర్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతాలక్ష్మారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై బహుమతి ప్రదానం చేశారు.

గులాబీ పార్టీలో భారీగా చేరికలు



వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో టీఆర్‌వీకేఎస్‌లో చేరిన విద్యుత్ ఉద్యోగులు, కార్మికులతో ఎమ్మెల్యే వినయ్ భాస్కర్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గులాబీ పార్టీలోకి వలసలు జోరుగా సాగుతున్నాయి. సూర్యాపేట జిల్లా వర్ధమానుకోటలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో గురువారం టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేటకు చెందిన పదిమంది సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో 50 మందికిపైగా వివిధ పార్టీల వారు, నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లో కాంగ్రెస్, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో, నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం కంఠం గ్రామానికి చెందిన సుమారు 40 మైనార్టీ కుటుంబాల వారు ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. హన్మకొండలో విద్యుత్ శాఖ ఉద్యోగులు దాదాపు ఆరువందల మంది టీఆర్‌వీకేఎస్‌లో చేరారు. టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కండువాలు కప్పి ఆహ్వానించారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
శుక్రవారం 12 జనవరి 2018

సాకర్ చాంప్ నిజామాబాద్



రన్నరప్‌గా రంగారెడ్డి జట్టు

నిజామాబాద్ స్పోర్ట్స్ : సీనియర్ మహిళా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని నిజామాబాద్ జిల్లా జట్టు కైవసం చేసుకుంది. గురువారం జరిగిన ఫైనల్లో నిజామాబాద్ 2-0తో రంగారెడ్డిపై గెలిచింది. ఇరు జట్ల క్రీడాకారిణులు గోల్స్ కోసం హోరాహోరీగా పోరాడటంతో తొలి అర్ధభాగంలో గోల్స్ నమోదు కాలేదు. అయితే రెండో అర్ధభాగంలో గుగులోత్ సౌమ్య (17వ ని.) గోల్ చేసింది. కొద్దిసేపటి తర్వాత నమ్రత డి-ఏరియా నుంచి కొట్టిన పెనాల్టీ కార్నర్‌ను మనీష సూపర్ హెడర్‌గా మలిచింది. తర్వాత గోల్స్ కోసం రంగారెడ్డి జట్టు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మూడోస్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఖమ్మం 2-0తో మెదక్‌ను ఓడించింది. ఈ టోర్నీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్లేయర్లను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నారు.



క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ జితేందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

సూపర్ సెవెన్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ : జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 సూపర్ సెవెన్ క్రికెట్ టోర్నీ గురువారం జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ జితేందర్‌రెడ్డి టోర్నీని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ అంటే ప్రేమ అని.. మా ఆతిథ్యాన్ని స్వీకరించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డకే ప్రధాన స్టేడియాన్ని రూ.2 కోట్ల 50 లక్షలతో ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. క్రికెట్‌కు మంచి క్రేజ్ ఉందని, మెరుగ్గా ఆడి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్నారు. తెలంగాణ, యూపీ, సీబీఎస్ఈ, ఢిల్లీ, జమ్మూ కశ్మీర్, పంజాబ్, డీఏవీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, డీఐఈవో, ఎస్‌జీఎఫ్ అండర్-19 అధ్యక్షుడు ఎన్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'టాప్'గా సెమీస్‌లోకి

అగ్రస్థానంలో హైదరాబాద్ హంటర్స్



సాయి ప్రణీత్

హైదరాబాద్: సొంతగడ్డపై హైదరాబాద్ హంటర్స్ ఆటగాళ్లు చెలరేగిపోయారు. బెంగళూరు బ్లాస్టర్స్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా టాప్‌గా సెమీస్‌లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 6-(-1)తో బెంగళూరుపై గెలిచింది. దీంతో 20 పాయింట్లతో జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. మిక్స్‌డ్‌లో సాత్విక్-జెబాదియా 15-6, 14-15, 15-9తో మను అత్రి-సిక్కిరెడ్డిపై గెలిచి శుభారంభాన్నిచ్చారు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ కరోలినా మారిన్ 15-9, 15-7తో గిల్‌మోర్‌పై గెలిచింది. అంతకుముందు జరిగిన పురుషుల సింగిల్స్‌లో సాయి ప్రణీత్ 10-15, 15-7, 15-14తో చో వీ ఫెంగ్‌ను ఓడించాడు. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో ఇరువురు చెరో గేమ్ గెలిచారు. నిర్ణాయాత్మక మూడో గేమ్‌లో ఓ దశలో ఫెంగ్ 12-14తో వెనుకబడ్డాడు. కానీ సాయి కొట్టిన స్మాష్‌లు నెట్‌కు తాకడంతో స్కోరు సమమైంది. ఈ దశలో ఫెంగ్ కొట్టిన ర్యాలీ నెట్‌కు తాకడంతో మ్యాచ్ సాయి సొంతమైంది. పురుషుల సింగిల్స్ ట్రంప్ మ్యాచ్‌లో లీ హ్యున్ 15-11, 11-15, 15-11తో శుభాంకర్ డేపై నెగ్గాడు. ఆఖర్లో జరిగిన పురుషుల డబుల్స్ ట్రంప్ మ్యాచ్‌లోనూ మార్కిస్ కిడో-షియాంగ్ జంట 15-10, 11-15, 15-7తో మథియాస్-కిమ్ సారంగ్‌ను ఓడించి విజయాన్ని పరిపూర్ణం చేశారు. శుక్రవారం జరిగే సెమీస్‌లో హైదరాబాద్..ఢిల్లీ డాషర్స్ (15)తో, శనివారం అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్ (17).. బెంగళూరు బ్లాస్టర్స్ (14)తో తలపడుతాయి.

ధవనా.. రాహులా?

- రోహిత్‌కు మరో అవకాశం
- తుది జట్టు ఎంపికపై కొనసాగుతున్న సందిగ్ధం



ప్రాక్టీస్ జోరు..

రెండో టెస్టుకు రెండు రోజుల సమయమే ఉండటంతో టీమ్‌ఇండియా ప్రాక్టీస్ మరింత ముమ్మరం చేసింది. గురువారం ఉదయం తొమ్మిదిన్నరకే సూపర్ స్పోర్ట్స్ పార్క్‌కు వచ్చిన ఆటగాళ్లు దాదాపు మూడు గంటల పాటు చెమటోడ్చారు. ఓవైపు భరించలేని ఎండ ఉన్నా.. చీఫ్ కోచ్ రవిశాస్త్రి పర్యవేక్షణలో మొదట తేలికపాటి వామప్ చేసి ఆ తర్వాత ఫుట్‌బాల్ ఆడారు. సమయం గడుస్తున్నకొద్దీ తీవ్రత పెంచుతూ ఫీల్డింగ్ డ్రిల్స్‌లో పాల్గొన్నారు. ఇది విభిన్నంగా సాగింది. గంట తర్వాత నెట్స్‌లోకి వెళ్లి బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. ఆశ్చర్యకంగా బుమ్రా, షమీ, భువనేశ్వర్ ముందుగా నెట్‌లో బరిలోకి దిగారు. ఓ నెట్‌లో బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ త్రోడౌన్స్ విసరగా, మిగతా రెండింటిలో నెట్ బౌలర్లు, పేసర్లు పూర్తిస్థాయిలో బౌలింగ్ చేశారు. బౌలర్ల బ్యాటింగ్ సెషన్ ముగిశాక మురళీ విజయ్, రాహుల్, కోహ్లీ నెట్స్‌లోకి వచ్చారు. ధవన్ మాత్రం ప్రధాన గ్రౌండ్‌లో కాస్కో బంతులతో సాధన చేశాడు. ఆర్.శ్రీధర్ టెన్నిస్ రాకెట్‌తో బంతులను వేగంగా సంధించాడు. కోహ్లీ త్రయం ప్రాక్టీస్ పూర్తయిన తర్వాత పుజార, రహానే, రోహిత్ బ్యాట్లు పట్టారు. వీళ్ల బ్యాటింగ్‌ను నిశితంగా పరిశీలించిన కోచ్, కెప్టెన్ వ్యూహాల గురించి మాట్లాడుతుండగా, రహానే, రోహిత్ సరిసమానంగా నెట్స్‌లో బంతులను బాదేశారు. ఫలితంపై దృష్టిపెట్టకుండా సరైన దిశలో ముందుకు సాగుతామని పేసర్ బుమ్రా అన్నాడు.

సెంచూరియన్:

సిరీస్‌లో నిలువాలంటే రెండో టెస్టులో కచ్చితంగా గెలువాల్సిన నేపథ్యంలో.. భారత్ జట్టు వ్యూహాలకు మరింత పదును పెడుతుంది. ఈ క్రమంలో కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని భావిస్తున్నది. ఓపెనర్‌గా విఫలమవుతున్న ధవన్ స్థానంలో కర్ణాటక బ్యాట్స్‌మన్ లోకేశ్ రాహుల్‌కు తుది జట్టులో చోటు దాదాపుగా ఖరారైంది. ధవన్, విజయ్ విఫలమైన చోట రాహుల్ మెరుగ్గా ఆడటం కలిసొచ్చే అంశం. దక్షిణాఫ్రికాలో రెండుసార్లు పర్యటించిన అనుభవం ఉండటంతో మేనేజ్‌మెంట్ విజయ్ వైపే మొగ్గు చూపుతున్నది. ఇక ఐదుగురు బౌలర్ల వ్యూహానికి కట్టుబడితే ఎక్స్‌ట్రా బ్యాట్స్‌మన్‌ను త్యాగం చేయాల్సి వస్తున్నది. దీంతో మిడిలార్డర్‌లో రోహిత్, రహానేలపై ఎటూ తేల్చుకోలేకపోతున్నది. ప్రస్తుతానికైతే ఫామ్ ఆధారంగా రోహిత్‌కే మరో అవకాశం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. 2016లో 10 వన్డేలు ఆడిన రోహిత్ 62.67 సగటుతో 564 పరుగులు చేశాడు. ఇందులో అత్యధిక స్కోరు 171 నాటౌట్. ఇక 2017కు వస్తే 21 వన్డేల్లో 71.83 సగటుతో 1293 పరుగులు చేశాడు. 208 నాటౌట్ అత్యధిక స్కోరు. ఈ రెండేండ్లలో అతని స్ట్రయిక్ రేట్ 95, 100గా ఉంది. రహానే విషయానికొస్తే గత ఏడు టెస్టుల్లో అతను 300ల పరుగులే చేశాడు. లంకపై చేసిన 132 పరుగులకే అత్యధిక స్కోరు. 12 వన్డేలు ఆడినా పెద్దగా రాణించలేదు. కాబట్టి రోహిత్‌తో పోలిస్తే రహానేకు అవకాశాలు తక్కువే. కానీ విదేశాల్లో రహానే సగటు 55కి పైగా ఉంది. ఈ ఒక్క అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే అశ్విన్‌ను పక్కకు బెట్టి అతనికి అవకాశం ఇవ్వొచ్చు.

రన్నరప్‌గా బోపన్న జోడి



బోపన్న

సిడ్నీ: భారత టెన్నిస్ ఆటగాడు రోహన్ బోపన్న-రోజెర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జోడి.. సిడ్నీ ఇంటర్నేషనల్ టోర్నీలో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో బోపన్న-వాసెలిన్ 4-6, 7-5, 8-10తో లుకాస్ కుబోట్ (పోలెండ్)-మార్సెలో మెలో (బ్రెజిల్) చేతిలో ఓడారు. గంటా 29 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో బోపన్న జోడి 64 మ్యాచ్ పాయింట్లు సాధించగా... విజేతలు 70 పాయింట్లు గెలిచారు. ఆధిపత్యం ఆద్యంతం చేతులు మారినప్పటికీ బోపన్న జోడీకి నిరాశ తప్పలేదు. ఇక ప్రతిష్ఠాత్మక ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు ముందు ఇదే చివరి సన్నాహక టోర్నీ.



ఫెదరర్ / షరపోవా

ఫెదరర్‌కు రెండోసీడ్

మెల్‌బోర్న్: ఈ ఏడాది తొలి గ్రాండ్ స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రఫెల్ నాదల్ (స్పెయిన్)కు టాప్‌సీడ్ లభించింది. గురువారం విడుదల చేసిన అధికారిక డ్రాలో ఫెదరర్ (స్విట్జర్లాండ్)కు రెండోసీడ్ దక్కింది. గాయంతో ఇబ్బందిపడుతున్న సెర్బియన్ స్టార్ జొకోవిచ్‌కు 14వ సీడ్‌గా బరిలోకి దిగనున్నాడు. ఇక మహిళా విభాగంలో సిమోనా హలెప్, వోజ్నియాకి వరుసగా 1,2 సీడింగ్స్ దక్కించుకున్నారు. వీనస్ విలియమ్స్ 5వ సీడ్‌గా బరిలోకి దిగుతున్నది. మరోవైపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మైదానంలోకి గ్రాండ్ స్లామ్ ట్రోఫీని తీసుకొచ్చేందుకు రష్య అందాల తార షరపోవాను ఎంచుకున్నారు. అయితే దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డోపింగ్‌లో పట్టుబడి 15 నెలల నిషేధం ఎదుర్కొన్న షరపోవాకు ఇంత పెద్ద బాధ్యత అప్పగించడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అయితే మాజీ క్రీడాకారిణులు ట్రోఫీని తీసుకొచ్చే సంప్రదాయం ఉందని, సెరెనా గైర్హాజరీతో షరపోవాకు అవకాశమిచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

సిడ్నీలో అర్జున్ ఆల్‌రౌండ్ షో

న్యూఢిల్లీ: సచిన్ తనయుడు అర్జున్ టెండూల్కర్ మరోసారి మెరిశాడు. అది కూడా ఆస్ట్రేలియాలోని సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో ఆల్‌రౌండ్ షోతో అదురగొట్టాడు. సిడ్నీలో జరుగుతున్న 'స్పిరిట్ ఆఫ్ క్రికెట్ గ్లోబల్ చాలెంజ్' లో భాగంగా హాంకాంగ్ క్రికెట్ క్లబ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో అర్జున్ (భారత క్రికెట్ క్లబ్) ఓపెనర్‌గా బ్యాటింగ్‌కు దిగి 27 బంతుల్లోనే 48 పరుగులు చేశాడు. ఆ తర్వాత బౌలింగ్‌లోనూ మెరిసి నాలుగు ఓవర్లలో నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఈ నెల 7న ప్రారంభమైన ఈ టోర్నీలో ఎనిమిది జట్లు ఆడుతున్నాయి. ఈ టోర్నీ ఈనెల 14తో ముగియనుంది.

ఫైనల్లో సరిత, సోనియా

రోహ్‌తక్: జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సరితాదేవి (60కేజీ), సోనియా లాథర్ (57కేజీ) ఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం ఇక్కడ జరిగిన సెమీస్‌లో సరిత (ఏఐపీ) 5-0తో మోనిక (హర్యానా)పై, సోనియా (ఆర్‌ఎస్‌పీబీ) 5-0తో సంధ్యారాణి (ఏఐపీ)పై విజయం సాధించారు. ఫైనల్లో సరిత.. పవిత్ర (ఆర్‌ఎస్‌పీబీ)తో తలపడుతుంది. ఇక తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ పోరాటం ముగిసింది. నిఖత్ 1-4తో రీతు (హర్యానా) చేతిలో ఓటమిపాలైంది. 48 కేజీల ఫ్లయ్ విభాగంలో సర్జుబాల (మణిపూర్) 4-1తో మీనాక్షి (ఆర్‌ఎస్‌పీబీ)పై గెలిచింది.


ఆఫర్‌లోయ్ సంబరాలోయ్
— సంగీత —
ప్రైస్ ఛాలెంజ్
ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్
సంగీతకు సాటి లేదు
iPhone X ₹89,000 ₹72,990*
SAMSUNG GALAXY NOTE 8 ₹8,000 CASHBACK
Google Pixel ₹21,000 CASHBACK
Redmi 5A NOW AVAILABLE
Mi A1 ₹1,300pm
Panasonic P91 ₹5,690 ₹4,999*
4G VoLTE SMARTPHONE ONLY AT ₹2,499*
Vivo V7 ₹17,000 ₹15,999*
Oppo F5 ₹19,990 ₹18,999*
Nokia 8 ₹35,500 ₹34,499*
WIN PRIZES
Motorcycles
LED TVs
Refrigerators
Washing Machines
Mobile Phones
Bluetooth
AND MANY MORE
SBI Card Make life simple
Extra 5% Cashback* with SBI Credit Cards.
*Min. trnx: ₹11,999; Max. Cashback: ₹1,500 per card account. Validity: 21 Dec '17 - 14 Jan '18. Offer also valid on EMI trxns. T&C Apply.
*Conditions apply.
You can also shop at www.sangeethamobiles.com
BAJAJ FINSERV
Sangeetha®
PIONEER THEN, LEADER NOW.
43 YEARS | 8 STATES | 416 STORES | 20 MILLION HAPPY CUSTOMERS
For feedback/suggestions, write to us at support@sangeethamobiles.com or call us at 080 4939 7000 | Connect with us SangeethaMobilesIndia | For terms and conditions, visit www.sangeethamobiles.com/sangeetha-advantage/price-challenge
*Prices offered are applicable only on exchange.
ఇప్పుడు పెద్దపల్లి, భద్రాచలం, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తిలో ఆదిలాబాద్, ఆర్మూర్, గోదావరి ఖని, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, జహీరాబాద్, హన్మకొండ, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, మహబూబ్ నగర్, మిర్యాలగూడ, నయిమ్ నగర్, నక్కలగుట్ట, నల్గొండ, షాద్ నగర్, సూర్యాపేట, వరంగల్
హైదరాబాద్ & తెలంగాణ లో 72 స్టోర్లు
ఆంధ్రప్రదేశ్ లో 55 స్టోర్లు
SAMSUNG LG NOKIA Panasonic Lenovo OPPO vivo GIONEE HUAWEI LAVA micromax INTEX